మోక్షసన్న్యాసయోగము



యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః
తత్ర శ్రీర్విజయో భూతిర్ధ్రువా నీతిర్మతిర్మమ. (18-78)

ఎచట యోగేశ్వరుడగు శ్రీకృష్ణుడున్ను ఎచట ధనుర్ధారియగు అర్జునుడున్ను ఉందురో అచట సంపదయు, విజయమున్ను, ఐశ్వర్యమున్ను, దృఢమగు నీతియు ఉండునని నా యభిప్రాయము.

ఓం

శ్రీ భగవద్గీత

అథ అష్టాదశోఽధ్యాయః

పదునెనిమిదవ అధ్యాయము

మోక్షసన్న్యాసయోగః

మోక్షసన్న్యాసయోగము

ఈ అధ్యాయముయొక్క పేరు :-

''మోక్షసన్న్యాసయోగము'' - (1) మోక్షమనగా విడుదల; బంధమునుండి విడుదల. సంసారిక దుఃఖమునుండి, జననమరణములనుండి విడుదల. అనగా బంధవిముక్తి యని భావము. అట్టి బంధవిమోచనరూపమగు కైవల్యము (మోక్షము) త్యాగముచేతనే లభించును★. త్యాగమనినను, సన్న్యాసమనినను, రెండును ఒకటియే. త్యాగము (సన్న్యాసము) అనగా వాస్తవముగ దృశ్యభావనాపరిత్యాగము, సర్వసంగపరిత్యాగము. ప్రపంచము, దేహము, మనస్సు - ఇత్యాది సమస్తదృశ్యవస్తువులయొక్క సంగమును పరిత్యజించి మోక్షరూపుడగు భగవంతునొకరినే, ఆత్మవస్తువునొక్కదానినే శరణుబొందవలెను. దృశ్యవస్తుసంబంధమైన భావనయంతయు ఏక్షణమున మనుజుడు త్యజించివేయునో, ఆ క్షణముననే యతడు దృక్ - వస్తువగు ఆత్మగనే శేషించును. అదియే మోక్షస్థితి. అనగా క్షేత్రమును త్యజించుటచే క్షేత్రజ్ఞుడు శేషించునని భావము. దృశ్యసన్న్యాసము (త్యాగము)చే దృగ్రూపమగు మోక్షము (దైవము, ఆత్మ) లభించునని యర్థము. ఈప్రకారముగ సన్న్యాసమువలన, త్యాగమువలన, సర్వదృశ్యవస్తు సంగపరిత్యాగము వలన మోక్షము లభించునని బోధింపబడిన అధ్యాయమగుట వలన దీనికి మోక్షసన్న్యాసయోగమను పేరువచ్చినది.

(2) మోక్షసన్న్యాసమునకు మఱియొక అర్థము - మోక్షమనగా దైవము, భగవంతుడు. సన్న్యాసమనగా సమస్తకర్మములను అర్పించుట. సమస్తకర్మలను, ఆ కర్మలయొక్క ఫలములను భగవంతునకు అర్పించుటయే మోక్షసన్న్యాసమనియు చెప్పవచ్చును.

(3) ఇంకొక అర్థము - మోక్షమును సన్న్యసించుట, వదలుట మోక్షసన్న్యాసము. ప్రతివారును మోక్షమును కోరుదురేకాని వదలరుగదాయనిన, కోరునదియెవరు? మోక్షమును కోరునది బంధముననున్న వారే. బద్ధుడే ముక్తిని కోరును. కాని గీతపదునేడధ్యాయములందు తెలుపుబడిన అఖండమగు బోధను జీర్ణించుకొనినవాడిక బద్ధుడెట్లగును? 'అజో నిత్యశ్శాశ్వతోఽయం పురాణో ' అని నిత్యసత్యసనాతనమగు తన

★ త్యాగేనైకే అమృతత్వ మానశుః (కైవల్యోపనిషత్)

ఆత్మనెఱిగినవానికిక బంధమెచట? బంధమే లేనపు డిక మోక్షమునుగూర్చిన ప్రశ్నయే యెచట? @ కాబట్టి అట్టి ముక్తస్థితిలో జీవుడు మోక్షభావననుగూడ త్యజించివైచును, సన్న్యసించివైచును. ఏలయనిన అత్తఱి తానే మోక్షరూపుడైవెలయును. లేక, అట్టి 17 అధ్యాయముల బోధను చక్కగ అనుభూతమొనర్చుకొనినచో భగవానుడే అతనికి మోక్షమును ప్రసాదించును. కావున మోక్షమునుగూర్చిన సంకల్పమే యతని కనవసరము. అత్తఱి మోక్షసంకల్పము నతడు త్యజించివేయవచ్చును. అదియే మోక్షసన్న్యాసము.

ఇంతవఱకు 17 అధ్యాయములందు తెలుపబడిన బోధలన్నియు ఈ అధ్యాయమున సంక్షేపముగ తెలుపబడినవి. మఱియు ఇదివఱకు ఏవైనబోధలు విడిచియుండిన అవియు ఇచ్చోట సంపూర్తిచేయబడెను. కావున ఈ అధ్యాయమును గీతాసారమనిగాని, సంక్షిప్తగీతయనిగాని చెప్పవచ్చును. ఇట్టి అపూర్వ అధ్యాత్మబోధలను బడసినవాడిక ముక్తినొందక నుండునా? కావున అట్టివాడిక మోక్షమునుగూర్చిన సంకల్పమును త్యజించవచ్చును. అనగా మోక్షసన్న్యాసమును గావింపవచ్చును. ఇట్టి భావమును సూచించునదియగుటచేగూడ దీనికి మోక్షసన్న్యాసయోగమని పేరుకలిగియుండవచ్చును.

(4) ఇంతదనుక చెప్పబడిన 17 అధ్యాయములయొక్క పేర్లు జ్ఞానయోగమని, కర్మయోగమని, భక్తియోగమని - ఈ ప్రకారముగ నుండుటబట్టి ఆ యా పేర్ల యొక్క అర్థము - 'జ్ఞానముచే భగవదైక్యము (యోగము)ను', 'కర్మచే భగవదైక్యమును', 'భక్తిచే భగవదైక్యమును' గలుగజేయు పద్ధతులను తెలుపు అధ్యాయములని చెప్పుకొనుచుంటిమి. అట్లే ఇచట 'మోక్షసన్న్యాసయోగ'మని చెప్పినపుడు, 'మోక్షసన్న్యాస'మను క్రియద్వారా భగవ దైక్యమును సిద్ధింపజేయు యోగమని ఈ అధ్యాయమునుగూర్చి చెప్పవలసివచ్చును. ఈ ప్రకారముగ సాక్షాత్ మోక్షస్వరూపమగు లేక మోక్షప్రదమగు సన్న్యాసముద్వారా, త్యాగముద్వారా లేక భగవదర్పణముద్వారా, సర్వసంగరాహిత్యము ద్వారా యోగము (భగవ దైక్యము) సిద్ధించునని తెలుపు అధ్యాయమగుటచేతను దీనికి మోక్షసన్న్యాసయోగమను పేరు గలిగియుండవచ్చును.

(1) సన్న్యాసముచే, త్యాగముచే సర్వసంగపరిత్యాగముచే మోక్షము లభించును.

(2) మోక్షమును (మోక్షసంకల్పమును) గూడ సన్న్యసింపుము.

(3) మోక్షరూపుడగు భగవంతునకు సర్వకర్మలను సన్న్యసింపుము.

} అని బోధించిన అధ్యాయమగుటచే దీనికి మోక్షసన్న్యాసయోగమని పేరువచ్చినది.

(4) మోక్షప్రదమగు, లేక మోక్షరూపమగు సన్న్యాసముచే (త్యాగముచే) భగవదైక్యము (యోగము) సిద్ధించును.

ఈ అధ్యాయమునందలి ప్రధాన విషయములు :-

(1) త్యాగమును గూర్చిన ప్రసంగము :- (1శ్లో॥ నుండి - 12శ్లో॥ వఱకు)

(2) సాంఖ్యసిద్ధాంతప్రకారము కర్మలయొక్క స్థితికి కారణము వచించుట, ఆత్మ అకర్తయని బోధించుట - (13శ్లో॥ నుండి - 18శ్లో॥ వఱకు)

(3) జ్ఞానము, కర్మ, బుద్ధి, ధైర్యము, సుఖము - అను వీనియొక్క సాత్త్విక, రాజస, తామసరూపములు - (19శ్లో॥ నుండి - 40శ్లో॥ వఱకు)

@ న నిరోధో న చోత్పత్తిర్నబద్ధో న చ సాధకః
న ముముక్షుర్నవైముక్త ఇత్యేషా పరమార్థతా. (అమృతబిందూపనిషత్తు - 2)

(4) చాతుర్వర్ణ్యములవారి ధర్మములు - (41శ్లో॥ నుండి - 48శ్లో॥ వఱకు)
(5) బ్రహ్మసాక్షాత్కారసిద్ధికి ఉపాయములు - జ్ఞాననిష్ఠనుగూర్చి ప్రసంగము (49శ్లో॥ నుండి - 55శ్లో॥ వఱకు)
(6) భక్తిసహిత నిష్కామకర్మయోగమునుగూర్చిన వర్ణనము - (56శ్లో॥ నుండి - 60శ్లో॥ వఱకు)
(7) భగవచ్ఛరణాగతి, గీతాసారసంగ్రహము - (61శ్లో॥ నుండి - 66శ్లో॥ వఱకు)
(8) గీతామహిమ - (67శ్లో॥ నుండి - 73శ్లో॥ వఱకు)
(9) సంజయుని గీతా సంస్తుతి - (74శ్లో॥ నుండి - 78శ్లో॥ వఱకు)

పూర్వాధ్యాయముతో ఈ అధ్యాయమునకుగల సంబంధము :-

ఇంతదనుక శ్రీకృష్ణపరమాత్మ అనేకయోగములను గుఱించి అర్జునునకు బోధించుచు వచ్చిరి. అవియన్నియు వినినపిదప అర్జునునకు వాని యన్నింటియొక్క సారమును దెలిసికొన కుతూహలము గలిగి సన్న్యాసముయొక్కయు, త్యాగముయొక్కయు తత్త్వమునుగూర్చి భగవానుని ప్రశ్నించెను. అర్జునుని యా ప్రశ్నతో ఈ అధ్యాయము ప్రారంభమగుచున్నది. (ఇది చివఱి అధ్యాయమగుటవలన ఇంతవఱకు బోధింపబడిన తత్త్వము లన్నిటియొక్క సారము ఈ అధ్యాయమునందు చెప్పబడుచున్నది.)

అర్జున ఉవాచ :-

1. సన్న్యాసస్య మహాబాహో తత్త్వమిచ్ఛామి వేదితుమ్
త్యాగస్య చ హృషీకేశ! పృథక్కేశి నిషూదన.

అర్జున ఉవాచ = అర్జునుడు చెప్పెను (ప్రశ్నించెను) -

టీక:- మహాబాహో = గొప్పభుజములుకలవాడవును, హృషీకేశ = ఇంద్రియములయొక్క నియామకుడవును, కేశినిషూదన = 'కేసి' యను రాక్షసుని సంహరించినవాడవును★నగు ఓ కృష్ణా!, సన్న్యాసస్య = సన్న్యాసముయొక్కయు, త్యాగస్య = త్యాగముయొక్కయు, తత్త్వమ్ = యథార్థమును (నిజస్థితిని), పృథక్ = వేఱ్వేఱుగా, వేదితుమ్ = తెలిసికొనుటకు, ఇచ్ఛామి = కోరుచున్నాను.

తా:- అర్జునుడు చెప్పెను (ప్రశ్నించెను) - గొప్పభుజములుగలవారును, ఇంద్రియములయొక్క నియామకులును, కేశియను రాక్షసుని సంహరించినవారునగు ఓ కృష్ణా! సన్న్యాసముయొక్కయు, త్యాగము యొక్కయు యథార్థము తెలిసికొనగోరుచున్నాను. కావున ఆ రెండిటిని వేఱువేఱుగా నాకు జెప్పుడు.

వ్యాఖ్య:- గీతయం దింతదనుక అనేక ప్రసంగములందు శ్రీకృష్ణపరమాత్మ సన్న్యాస, త్యాగ శబ్దములను వాడుచువచ్చిరి. కాని వానిని గూర్చిన వివరణమును తెలిపియుండలేదు. (శ్లో॥ 3-30, 4-20, 4-41, 9-28, 12-6, 12-11, 12-12, 12-16, 1-25). అందువలన అర్జునునకు వాని వివరములు తెలిసికొనవలెనను కాంక్ష ఉదయింప వానినిగూర్చి భగవానుని యిట్లు ప్రశ్నించెను.

★ గుఱ్ఱపుమూతిగల 'కేశి' యను రాక్షసుడు నోరుతెఱచుకొని శ్రీ కృష్ణునిపైకి యుద్ధమునకు రాగా శ్రీకృష్ణు డాతని నోటిలో తన చేతినిదూర్చి దానిని పెరుగనివ్వగా, అంతట నా రాక్షసుడు నోరు బ్రద్దలై చనిపోయెను.

(ఉపనిషత్తులందు సన్న్యాసము, త్యాగము, రెండును మోక్షమునకు హేతువులని చెప్పబడినది.

(1) 'త్యాగేనైకే అమృతత్వ మానశుః' – (2) సన్న్యాసయోగాద్యతయశ్శుద్ధసత్త్వాః .... ఇత్యాదివాక్యము లనేకములు ఉపనిషత్తులందు గలవు.)

ఈ శ్లోకమున అర్జునుడు భగవానుని మూడు విశేషణములద్వారా సంస్తుతించుచు సంబోధించెను. ఇట్టిస్తుతిచే నతడు తనభక్తిభావమును బాగుగ వెల్లడించెను. ఈ ప్రకారముగ వినయాన్వితుడై, పరిపూర్ణభక్తిభావసంయుతుడై, ప్రశ్నించుటనే 'పరిప్రశ్న' యందురు. శిష్యుడు గురువుదగ్గఱ ఇవ్విధముగనే శ్రద్ధాభక్తులతో మెలగవలెను. అట్టి వర్తనచే గురువు సంతోషించి శిష్యుని శ్రేయముకొఱకై జ్ఞానబోధను వర్షించును.

ప్ర:– అర్జునుడు భగవానునివలన ఏయే విషయముల నెఱుగగోరెను?

ఉ:– సన్న్యాసము, త్యాగము – అను ఈ రెండిటియొక్క తత్త్వమెఱుగగోరెను.

అ॥ అర్జునుని యాప్రశ్నకు భగవానుడు సమాధాన మొసంగుచున్నాడు –

శ్రీ భగవానువాచ :–

2. కామ్యానాం కర్మణాం న్యాసం సన్న్యాసం కవయో విదుః
సర్వకర్మఫలత్యాగం ప్రాహుస్త్యాగం విచక్షణాః.

శ్రీ భగవానువాచ = శ్రీ భగవంతుడు పలికెను –

టీక:– కామ్యానామ్ = ఫలమునుగోరిచేయబడు (కామ్యములైన), కర్మణామ్ = కర్మముల యొక్క, న్యాసమ్ = వదలుటను, సన్న్యాసమ్ = సన్న్యాసముగా, కవయః = (కొందఱు) పండితులు (జ్ఞానులు), విదుః = తెలిసికొనుచున్నారు, సర్వకర్మఫలత్యాగమ్ = సమస్త కర్మముల యొక్కయు ఫలమును త్యజించుటను, త్యాగమ్ = త్యాగముగా, విచక్షణాః = (మఱికొందఱు) పండితులు (విద్వాంసులు), ప్రాహుః = చెప్పుదురు.

తా:– శ్రీ భగవంతుడు చెప్పెను – (ఓ అర్జునా!) కామ్యకర్మలను వదలుటయే సన్న్యాసమని కొందఱు పండితులు చెప్పుదురు. మఱికొందఱు పండితులు సమస్తకర్మములయొక్క ఫలమును త్యజించుటయే త్యాగమని వచించుదురు.

వ్యాఖ్య:– గీతయందు సన్న్యాసమనగా సమస్తమునుత్యజించి అడవులకుబోవుట అని చెప్పబడలేదు. కామ్యకర్మలను త్యజించుటయే సన్న్యాసమని చెప్పబడినది. అనగా నిట్టిసన్న్యాసమును గృహస్థులుకూడ నాచరించవచ్చునన్నమాట. నిష్కామకర్మల నాచరించువాడు, కామ్యకర్మలను త్యజించువాడు సన్న్యాసియే అని యర్థము. అట్లే సమస్తకర్మలయొక్క ఫలమును త్యజించువాడు ఆత దేయాశ్రమమున నున్నప్పటికిని 'త్యాగి'యే యగును.

ప్ర:– సన్న్యాసమనగా నేమి?

ఉ:– కామ్యకర్మలను వదలుటయే సన్న్యాసము.

ప్ర:– త్యాగమనగా నేమి?

ఉ:– సమస్తకర్మలయొక్క ఫలమును వదలుటయే త్యాగము.

అ॥ కర్మనుగూర్చిన కొందఱి యభిప్రాయములను చెప్పుచున్నాడు –

**3. త్యాజ్యం దోషవదిత్యేకే కర్మ ప్రాహుర్మనీషిణః
యజ్ఞదానతపఃకర్మ న త్యాజ్యమితి చాపరే.**

టీక:– ఏకే = కొందఱు, మనీషిణః = బుద్ధిమంతులు (సాంఖ్యులు), దోషవత్ = దోషమువలె, కర్మ = కర్మ, త్యాజ్యమ్ = విడిచిపెట్టదగినది, ఇతి = అని, ప్రాహుః = చెప్పుదురు, అపరే = మఱికొందఱు, యజ్ఞ దాన తపః కర్మ = యజ్ఞము దానము తపస్సు అనెడి కర్మ, న త్యాజ్యమ్ ఇతి చ = విడువదగనిదియనియు (ప్రాహుః = చెప్పుదురు).

తా:– కొందఱు బుద్ధిమంతులు (సాంఖ్యులు) దోషమువలె కర్మ విడిచిపెట్టదగిన దని చెప్పుదురు. మఱికొందఱు యజ్ఞము, దానము, తపస్సు – మున్నగు కర్మలు విడువదగనివనియు చెప్పుదురు.

వ్యాఖ్య:– కర్మ ఉపాధికి (శరీర, ఇంద్రియ, మనంబులకు) సంబంధించినదిగావునను ఉపాధి భ్రాంతిజన్యమైనది గనుకను, ఆత్మ సర్వసాక్షికావునను, కర్మ దోషముపగిది త్యజింపదగినదని కొందఱి (సాంఖ్యుల) మతము. కర్మ బొత్తిగా వదలినచో జీవునకు చిత్తశుద్ధి యెట్లు కలుగుననియు, అసలు దేహయాత్రయే యెట్లు జరుగుననియు భావించినవారై కొందఱు చిత్తశుద్ధికరములగు తపో యజ్ఞ దానాది కర్మలు వదలదగినవి కావని చెప్పుదురు. ఈ ప్రకారముగ జనులలో కర్మనుగూర్చిన భిన్నాభిప్రాయములను భగవానుడు వ్యక్తపఱచి ఇవ్విషయమున తనయొక్క నిర్ణయమును రాబోవు శ్లోకమునతెలియజేయుచున్నాడు.

ప్ర:– కర్మనుగూర్చి కొందఱి యభిప్రాయమేమి?

ఉ:– కొందఱు కర్మను దోషమువలె త్యజించవలెననియు, మఱికొందఱు తపోయజ్ఞదానాది కర్మలను త్యజించరాదనియు చెప్పుచున్నారు.

అ॥ ఇట్లు కర్మనుగూర్చి భిన్నమతములను దెలిపి శ్రీకృష్ణమూర్తి అవ్విషయమున తన నిశ్చయమును తెలియజేయుచున్నాడు –

**4. నిశ్చయం శృణు మే తత్ర త్యాగే భరత సత్తమ!
త్యాగో హి పురుషవ్యాఘ్ర త్రివిధస్సమ్ప్రకీర్తితః.**

టీక:– భరతసత్తమ = భరతవంశములో నుత్తముడవగు ఓ అర్జునా!, తత్రత్యాగే = (భిన్నవాదములుగల) ఆ కర్మత్యాగవిషయమందు, మే = నాయొక్క, నిశ్చయమ్ = నిశ్చయమును, శృణు = వినుము, పురుషవ్యాఘ్ర = పురుషశ్రేష్ఠుడవగు ఓ అర్జునా!, త్యాగః = త్యాగము, త్రివిధః = మూడువిధములుగా సంప్రకీర్తితః హి = చెప్పబడియున్నదికదా!

తా:— భరతకులోత్తముండవును, పురుషశ్రేష్ఠుడవునగు ఓ అర్జునా! అట్టి కర్మత్యాగవిషయమున నా యొక్క నిశ్చయమేదియో చెప్పెదను వినుము. త్యాగము మూడువిధములుగా చెప్పబడియున్నదికదా!

వ్యాఖ్య:— (1) కర్మలను బొత్తిగా వదలివేయవలెను. (2) తపోయజ్ఞదానాది కర్మలను మాత్రము వదలరాదు – అను రెండు వాదములను జెప్పి భగవానుడు ఆ విషయమున తన తీర్పును చెప్పుచున్నాడు –

'నిశ్చయం శృణు మే' – అని చెప్పినందువలన భగవానుడు తాను పూర్ణముగ స్థిరపఱచుకొని, నిశ్చయించుకొనినదానినే వచించుచున్నారని అర్థము. ఆహా! ఇట్టి భగవన్నిశ్చయమందు జనుల కేల విశ్వాసముండరాదు? సామాన్యులు ప్రకృతికి, మాయకు లోబడినవారుకావున వారి నిశ్చయములం దేవేని లోపములుండవచ్చును. కాని ప్రకృతికి అతీతుడై మాయాదోషములేని (చైతన్యరూపుడగు) పరమాత్మయొక్క భావములు అతినిర్దుష్టములై యుండును. అట్టి మహనీయుడు 'నా నిశ్చయము వినుడు' అని చెప్పినపుడు ఇక జీవులు ఎన్ని చెవులతో దానిని వినవలయునో యోచించుకొనుడు! కావున భగవాను డిపుడు చెప్పబోవు త్యాగము మున్నగువానిని గూర్చిన ఉదాత్తభావములను, నిశ్చయములను కడుజాగరూకతతో విని తదనురీతి యనుష్ఠించి తరించవలెను.

ప్ర:— త్యాగ మెన్నివిధములని భగవానుడు తెలియజేసిరి?

ఉ:— మూడు విధములని.

5. యజ్ఞదానతపఃకర్మ న త్యాజ్యం కార్యమేవ తత్
యజ్ఞోదానం తపశ్చైవ పావనాని మనీషిణామ్.

టీక:— యజ్ఞ దాన తపః కర్మ = యజ్ఞము, దానము, తపస్సు అనెడి కర్మ, న త్యాజ్యమ్ = విడిచిపెట్టదగినదికాదు, కార్యమ్ ఏవ = చేయదగినదియే యగును, యజ్ఞః = యజ్ఞము, దానమ్ = దానము, తపః చ ఏవ = తపస్సును, మనీషిణామ్ = (ఫలాభిలాషలేని) బుద్ధిమంతులకు, పావనాని = పవిత్రతను (చిత్తశుద్ధిని) గలుగజేయునవి (అయియున్నవి).

తా:— యజ్ఞము, దానము, తపస్సు అనెడి కర్మలు త్యజింపదగినవి కావు; చేయదగినవియే యగును. ఏలయనిన ఆ యజ్ఞదానతపంబులు బుద్ధిమంతులకు పవిత్రతను (చిత్తశుద్ధిని) గలుగజేయునవై యున్నవి.

వ్యాఖ్య:— భగవానుడీ శ్లోకమున కర్మలనుగూర్చిన తన నిశ్చయమును చెప్పుచున్నాడు –

(1) న త్యాజ్యమ్ – తపోయజ్ఞదానాది కర్మలను వదలగూడదు.

(2) కార్యమేవ తత్ – వానిని తప్పక చేయవలెను.

'పుణ్యకర్మలను వదలగూడదు' అను వాక్యములోనే ఆ కర్మలను చేయవలెనను అర్థముకూడ ఇమిడి యున్నది. అయినను భగవంతుడు దానితో తృప్తిపడక ఆ పుణ్యకర్మలనుతప్పకచేయవలెనని మఱలచెప్పుటచే ఈ విషయమువారెంతగా నొక్కిచెప్పినట్లైనదో విదితముకాగలదు. మఱియు అట్టి పుణ్యకార్యములను చేయుట ముముక్షువుల కెంతటి అవసరమో అదియు స్పష్టమైనది. సామాన్యముగ లోకములో కొందఱు జనులు

'పుణ్యకార్యములు చేసినచో మఱల జన్మకలుగును; కావున వానిని చేయరాదు. అని అమాయకులగువారికి దుర్బోధలుచేయుచు అట్టి కార్యములనుండి వారిని విరమింప జేయుచున్నారు. ఇది చాల ఘోరము. ఏలయనిన, అట్లు కావించుట భగవదాశయమునకు విరుద్ధము. భగవానుడు గీతలో పలుచోట్ల పుణ్యకార్యములను, తపోదానాది కర్మలను మిక్కుటముగ ప్రోత్సహించుచు వచ్చెను. ఈ శ్లోకమునందును వానిని తప్పక చేయవలెననియే హెచ్చరించెను. వానిని వదలరాదనియు శాసించెను. ఈ ప్రకారముగ సాక్షాత్ భగవానుడే పలుకుచుండ ఇక మానవమాత్రుల సత్యేతరవాక్యముల నేల విశ్వసించి అధోగతి నొందవలెను? యజ్ఞతపోదానాది పుణ్యకార్యములను నిష్కామముగ నాచరించినచో జనులకు చిత్తశుద్ధి కలుగును. చిత్తశుద్ధివలన ఆత్మజ్ఞానముదయించును. ఆత్మజ్ఞానముచే మోక్షము లభించగలదు. ఈ ప్రకారముగ ఆ యజ్ఞాదికర్మలు మోక్షహేతువులే యగుచున్నవి. కాబట్టి విజ్ఞులు వానినెన్నడును వదలరాదు.

'పావనాని' - అని చెప్పుటచే ఆ యజ్ఞాది కర్మలు పరమపవిత్రములైనవని స్పష్టమగుచున్నది. అయ్యవి చేయరానివి అయినచో, అపవిత్రములైనచో, దోషజనకములైనచో భగవానుడు వానినిగూర్చి 'పావనాని' అని యిచట చెప్పనేచెప్పరు.

'మనీషిణామ్' - తెలివిగలవారికి - బుద్ధిమంతులకు - అనగా ఫలమునుగోరక చేయువారికి అని యర్థము. ఫలమునుగోరి చేయువారు బుద్ధివికాసము లేనివారు కావున వారు మనీషులు కారు.

ఇచట యజ్ఞమనగా జ్ఞానయజ్ఞమనియు, ఇదివఱలో 4వ అధ్యాయమున తెలుపబడిన స్వాధ్యాయాది చిత్తశుద్ధికరములగు వివిధయజ్ఞములనియు భావము.

ప్ర:- యజ్ఞతపోదానాది కర్మలను చేయవలెనా? వదలవలెనా?

ఉ:- వానిని వదలరాదు. తప్పక చేయవలెను.

ప్ర:- ఎందువలన?

ఉ:- అవి జనులను పవిత్రవంతులుగ నొనర్చును. వారికి చిత్తశుద్ధిని గలుగజేయును.

ప్ర:- ఏప్రకార మాచరించినచో?

ఉ:- ఫలాభిలాషారహితముగ (నిష్కామముగ) నాచరించినచో (మనీష (తెలివి) గలిగి వాని విషయమై జాగ్రతగ వర్తించినచో)

అ॥ తన యా నిశ్చయమును భగవానుడు ఇంకను దృఢపఱచుచున్నాడు -

6. ఏతాన్యపి తు కర్మాణి సఙ్గం త్యక్త్వా ఫలాని చ
కర్తవ్యానీతి మే పార్థ! నిశ్చితం మతముత్తమమ్.

టీక:- పార్థ = ఓ అర్జునా!, ఏతాని కర్మాణి అపి తు = ఈ (యజ్ఞదానతపములను) కర్మలనుగూడ, సఙ్గమ్ = ఆసక్తిని (తాను కర్తనను అభిమానమును), ఫలాని చ = ఫలములను, త్యక్త్వా = విడిచి, కర్తవ్యాని = చేయదగినవి, ఇతి = అని, మే = నాయొక్క, నిశ్చితమ్ = నిశ్చయింపబడినదియు, ఉత్తమమ్ = శ్రేష్ఠమైనదియునగు, మతమ్ = అభిప్రాయము.

తా:– అర్జునా! ఈ యజ్ఞదానతపఃకర్మలనుగూడ ఆసక్తిని, ఫలములను విడిచియే చేయవలెనని నాయొక్క నిశ్చితమగు ఉత్తమాభిప్రాయము.

వ్యాఖ్య:– క్రిందటిశ్లోకమునందు యజ్ఞదానతపములను తప్పక చేయవలెనని చెప్పబడినది. అయితే వానిని ఏప్రకారముగ నాచరింపవలయునో, ఆ పద్ధతి నిచట తెలియజేయుచున్నారు. ఆ యా కర్మలను అసంగముగ, ఫలాపేక్షను వదలి చేయవలయునని చెప్పబడినది. సంగముతో (నేను కర్తయను అభిమానముతో) చేయుటవలన, ఫలములను కోరుటవలన కర్మయొక్క పవిత్రత తగ్గిపోవుచున్నది. కర్మలో దోషములేదుకాని దానిని సంగముతో, కర్తృత్వాభిమానముతో చేయుటచే దోష మేర్పడుచున్నది. కాబట్టి ముముక్షువులు అసంగముగ, ఫలాపేక్షారహితముగ ఆ తపోదానాది పుణ్యకార్యముల నాచరించవలెను. తన యీ యభిప్రాయమునుగూర్చి 'ఇది నిశ్చయింపబడినది, శ్రేష్ఠమైనది' (నిశ్చితమ్, ఉత్తమమ్) అని భగవానుడు తెలిపినందువలన అద్దాని మహత్తరశక్తి, ఉపాదేయత్వము వెల్లడియగుచున్నవి. ఇది సాక్షాత్ భగవంతుడే బాగుగ నిశ్చయించి చెప్పిన భావముగనుక అతినిర్దిష్టమై యుండుటచే విజ్ఞులెల్లరును ఇద్దానిని అనుసరించవలయును.

ప్ర:– పైన దెల్పిన యజ్ఞదానాది కార్యముల నెట్లాచరించవలెను?

ఉ:– సంగరహితముగ (నేను కర్తనను అభిమానములేక), ఫలాపేక్షారహితముగ (నిష్కామముగ) నాచరించవలెను.

ప్ర:– ఈ యభిప్రాయ మెట్టిది?

ఉ:– సాక్షాత్ భగవానునిచే బాగుగ నిశ్చయింపబడినది, మఱియు సర్వశ్రేష్ఠమైనది.

అ॥ సాత్త్వికరాజసిక, తామసిక, త్యాగములు మూడిటిని చెప్పదలంచి మొట్టమొదట తామసత్యాగమునుగూర్చి చెప్పుచున్నాడు –

7. నియతస్య తు సన్న్యాసః కర్మణో నోపపద్యతే
మోహాత్తస్య పరిత్యాగ స్తామసః పరికీర్తితః.

టీక:– నియతస్య = (వేదశాస్త్రాదులచే) విధింపబడినట్టి, కర్మణః = కర్మముయొక్క, సన్న్యాసః తు = పరిత్యాగమైతే, న ఉపపద్యతే = యుక్తముకాదు, మోహాత్ = అజ్ఞానము వలన, తస్య = అట్టి కర్మముయొక్క, పరిత్యాగః = విడిచిపెట్టుట, తామసః = తామసమగు (తమోగుణసంబంధమైన) త్యాగమని, పరికీర్తితః = చెప్పబడుచున్నది.

తా:– (వేదశాస్త్రాదులచే) విధింపబడినట్టి కర్మముయొక్క పరిత్యాగము యుక్తము కాదు. అజ్ఞానముచే అట్టి కర్మమును ఎవడైన విడిచిపెట్టిన అది తామస త్యాగమే యగునని చెప్పబడుచున్నది.

వ్యాఖ్య:– శాస్త్రవిహితమగు కర్మను ఎవరును త్యజించరాదు. శాస్త్రములందు విధింపబడు కర్మలన్నియు జీవునియొక్క నైతిక ఆధ్యాత్మిక సమున్నతికి దోహదమును గలుగజేయునవియే యగుటవలన

వాని నెవరును త్యజించరాదు. అట్లు త్యజించుట అవివేకమే యగును. కనుకనే 'మోహాత్' అని యిచట చెప్పబడినది. అనగా మోహముచే, అజ్ఞానముచే ఆవరింపబడునపుడు మాత్రమే అట్టి విధ్యుక్తకర్మమును, ధర్మమును త్యజించు సంకల్పము జీవునకు కలుగుచుండునని భావము. కాబట్టి వివేకము నాశ్రయించి అట్టి శాస్త్రనియతకర్మలను పరిత్యజించక ఆచరించుటయే శ్రేయస్కరము. సోమరితనముచేగాని, అజ్ఞానముచేగాని అట్టిదేయగు మరేకారణముచేగాని వానిని త్యజించినచో అది తామసత్యాగమే కాగలదు.

ఇదివఱలో యజ్ఞదానాదులనుగూర్చి వర్ణించునపుడును, మున్ముందు జ్ఞానము, ధైర్యము మున్నగువానిని చెప్పునపుడును మొదట సాత్త్వికమైనదానిని, తదుపరి రాజసమైనదానిని, ఆపిమ్మట తామసమైనదానిని చెప్పి, ఈ ఒక్క త్యాగమునుగూర్చి చెప్పునపుడుమాత్రము మొదట తామసమును, తదుపరి రాజసమును, ఆపిమ్మట సాత్త్వికమును చెప్పుట గమనార్హమైనది. మొట్టమొదటనే తామసత్యాగుల చర్యను ఖండించవలెనను ఉద్దేశ్యముతో భగవానుడీ విధముగ చెప్పియుండవచ్చును.

ప్ర:– తామసత్యాగ మెట్టిది?

ఉ:– శాస్త్రవిహితములగు తపోయజ్ఞదానాది కర్మలయొక్క పరిత్యాగము తగదు. అట్టి త్యాగము తామసమనియే చెప్పబడును.

ప్ర:– దేనివలన జనులు నియతకర్మలను త్యజించుచుందురు?

ఉ:– అవివేకమువలన, అజ్ఞానమువలన.

ప్ర:– కాబట్టి శాస్త్రవిహితకర్మలను త్యజించువారెట్టివారని నిశ్చయించుకొనవచ్చును?

ఉ:– అవివేకులని, మోహవశులని నిశ్చయించుకొనవచ్చును.

అ॥ రాజసత్యాగమును వర్ణించుచున్నాడు -

8. దుఃఖమిత్యేవ యత్కర్మ కాయక్లేశభయాత్త్యజేత్
స కృత్వా రాజసం త్యాగం నైవ త్యాగఫలం లభేత్.

టీక:– (యః = ఎవడు), యత్ కర్మ = ఏ కర్మమును, కాయక్లేశభయాత్ = శరీర ప్రయాసవలని భయముచేత, దుఃఖమ్ ఇతి ఏవ = దుఃఖము (కష్టము)ను గలుగజేయునదియనియే తలంచి, త్యజేత్ = విడిచిపెట్టునో, సః = అతడు, రాజసమ్ = రజోగుణసంబంధమైన, త్యాగమ్ = త్యాగమును, కృత్వా = చేసి, త్యాగఫలమ్ = త్యాగముయొక్క ఫలితమును, న లభేత్ ఏవ = పొందనే పొందడు.

తా:– ఎవడు శరీరప్రయాసవలని భయముచేత దుఃఖమును గలుగజేయునది యనియే తలంచి విధ్యుక్తకర్మమును విడిచిపెట్టునో, అట్టివాడు రాజసత్యాగమును గావించినవాడై త్యాగఫలమును బొందకయే యుండును.

వ్యాఖ్య:– తామసత్యాగి అజ్ఞానమువలన విధ్యుక్తకర్మలను వదలుచున్నాడు. రాజసత్యాగియో ఆ కర్మచేయుట ప్రయాసమని తలంచి దానిని వదలివేయుచున్నాడు. అనగా సోమరతనము వహించుచున్నాడని

అర్థము. ఉత్తమసుఖమును గలుగజేయు క్రియలు సామాన్యముగ ప్రారంభములో కష్టముగా తోచును. కాని తుదకు అనంతసుఖమునే కలుగజేయును. కాని రాజసత్యాగి ప్రారంభమునతోచు కష్టమునకు బెదరిపోయి, సోమరితనముచే ఏమాత్రము శ్రమించక, ఆ కర్మలనే వదలివైచుచున్నాడు. బ్రహ్మ ముహూర్తమున లేచుట, శీతలోదకముచే స్నానముచేయుట, బ్రహ్మచర్యమును పాలించుట మున్నగు క్రియలు పారంభములో కష్టముగా తోచవచ్చును. కాని అవియే తుదకు మహదానందమును కలుగజేయును. కాని రాజసత్యాగి (బద్ధకము వలన) వానిని చేయుటకు నిచ్చగింపక వదలిపెట్టుచున్నాడు. అట్టివానికి త్యాగముయొక్క ఫలమేమియు లభించుటలేదు ఏలననగా త్యాగమనగా సంగత్యాగమేకాని కర్మత్యాగముకాదు. వారో, కర్మలనే త్యజించివైచుచున్నారు. ఈప్రకారముగ తామసుడు, రాజసుడు వేర్వేఱు కారణములచే విధ్యుక్తకర్మలను త్యజించివైచుచు తత్ఫలములను పొందకున్నారు.

ప్ర:- రాజసత్యాగముయొక్క లక్షణమేమి?

ఉ:- కార్యము కష్టమని తలంచి (సోమరితనముచే) దానిని వదలివేయుట రాజసత్యాగమనుబడును.

ప్ర:- దానివలన అతనికి కలుగు నష్టమేమి?

ఉ:- అతడు త్యాగఫల మిసుమంతేని పొందకుండును.

అ॥ ఇక సాత్త్వికత్యాగమును వివరించుచున్నాడు -

9. కార్యమిత్యేవ యత్కర్మ నియతం క్రియతేఽర్జున !
సఙ్గం త్యక్త్వా ఫలం చైవ స త్యాగస్సాత్త్వికో మతః.

టీక:- అర్జున = ఓ అర్జునా!, నియతమ్ = శాస్త్రముచే నియమింపబడిన, యత్ కర్మ = ఏ కర్మము, కార్యమ్ ఇతి ఏవ = చేయదగినదియేయని (తెలిసికొని), సఙ్గమ్ = అభిమానమును (ఆసక్తిని), ఫలం చఏవ = ఫలమునుగూడ, త్యక్త్వా = విడిచి, క్రియతే = చేయబడుచున్నదో, సః త్యాగః = అట్టి త్యాగము, సాత్త్వికః = సత్త్వగుణసంబంధమైనదని, మతః = నిశ్చయింపబడినది.

తా:- ఇది చేయదగినదియే యని తలంచి శాస్త్రనియతమగు ఏ కర్మము అభిమానము, ఫలము విడిచిపెట్టబడి చేయబడుచున్నదో అట్టి (కర్మమందలి సంగఫల) త్యాగము సాత్త్వికత్యాగమని నిశ్చయింపబడినది.

వ్యాఖ్య:- త్యాగమనగా సంగత్యాగమేకాని, ఫలత్యాగమేకాని, కర్మత్యాగముకాదని ఈశ్లోకముద్వారా స్పష్టముగ వెల్లడియగుచున్నది. మఱియు 'కార్యమ్' అని చెప్పినందువలన శాస్త్రనియతమగు కర్మ మనుజుడు తప్పక చేయవలెననియే బోధితమగుచున్నది. తామసుడు శాస్త్రవిధి తెలియక దాని నాచరించకనుండును. రాజసుడు తెలిసియు ఆచరించుట కష్టమని భావించి దానిని చేయకుండును. సాత్త్వికుడు తెలిసియు, కష్టములకు జంకక, సంగమును, ఫలమును త్యజించి దాని నాచరించును. సాత్త్వికునిదే ఉత్తమపద్ధతియనియు, ఆతడు కావించిన త్యాగమే ఉత్తమత్యాగమనియు ఈశ్లోకముద్వారా విదితమగుచున్నది. కావున అద్దానినే విజ్ఞులవలంబించవలెను.

ప్ర:– సాత్త్వికత్యాగముయొక్క లక్షణమేమి?

ఉ:– శాస్త్రనియతమగు కర్మను, 'ఇది తప్పక చేయవలెను' అని యెంచి, ఫలమును, సంగమును (ఆసక్తిని) వదలిపైచి చేయుట సాత్త్వికత్యాగమనబడును.

అ॥ అట్టి త్యాగశీలుడు కర్మలందు ఇచ్ఛాద్వేషములు లేకుండునని తెలుపుచున్నాడు –

10. న ద్వేష్ట్యకుశలం కర్మ కుశలేనానుషజ్జతే
త్యాగీ సత్త్వసమావిష్టో మేధావీ ఛిన్నసంశయః.

టీక:– సత్త్వసమావిష్టః = సత్త్వగుణముతో గూడినవాడును, మేధావీ = ప్రజ్ఞాశాలియు, ఛిన్న సంశయః = సంశయములను బోగొట్టుకొనినవాడును నగు, త్యాగీ = త్యాగశీలుడు, (సంగమును, ఫలమును త్యజించి కర్మలంజేయువాడు), అకుశలమ్ కర్మ = అశుభమును, దుఃఖకరమును, కామ్యమునగు కర్మను, న ద్వేష్టి = ద్వేషింపడు, కుశలే = శుభమును, సుఖకరమును, నిష్కామమునగు కర్మమందు, న అనుషజ్జతే = ఆసక్తుడు కాడు (అభిమానము గలిగియుండడు).

తా:– సత్త్వగుణముతో గూడినవాడును, ప్రజ్ఞాశాలియు, సంశయములను బోగొట్టుకొనినవాడును నగు త్యాగశీలుడు, అశుభమును, కామ్యమును, దుఃఖకరమును నగు కర్మను ద్వేషింపడు; శుభమును, నిష్కామమును, సుఖకరమునగు కర్మయందు ఆసక్తుడుకాడు (అభిమానము గలిగియుండడు).

వ్యాఖ్య:– సత్త్వగుణముతో గూడిన కర్మఫలత్యాగి ద్వంద్వములందు సమబుద్ధి గలిగి యుండునని చెప్పబడుచున్నది. ఒకదానిని ద్వేషించుటగాని, మఱియొక దానియందు ఆసక్తిగలిగి తగుల్కొనుటగాని యతనికుండదు. అతడు ఇచ్ఛాద్వేషరహితుడై యుండును. అశుభకర్మను, కామ్యకర్మను ద్వేషింపడని చెప్పినంతమాత్రముచేత దానిని ప్రేమించునని అర్థముకాదు. జీవన్ముక్తునిపగిది దానియెడల తటస్థభావముగలిగి, తాను మాత్రము దాని నాచరింపక శుభకార్యమునే, నిష్కామకర్మమునే ఆచరించును. అట్లాచరించినను దానితో కలియక, దానియం దభిమానము (సంగము) లేకయుండును.

ప్ర:– సత్త్వగుణశీలుడగు కర్మఫలత్యాగియొక్క స్వభావమెట్లుండును?

ఉ:– అతడు (1) సత్త్వగుణసంపన్నుడై (2) ప్రజ్ఞాశాలియై (3) సంశయరహితుడై (4) అశుభ (కామ్యాది)కర్మలను ద్వేషింపకయు, శుభ(నిష్కామాది) కర్మములందు తగుల్కొనకయు (అభిమానము లేకయు) నుండును.

అ॥ కర్మఫలములను త్యజించువాడే త్యాగియని వచించుచున్నాడు –

11. న హి దేహభృతా శక్యం త్యక్తుం కర్మాణ్యశేషతః
యస్తు కర్మఫల త్యాగీ స త్యాగీత్యభిధీయతే.

టీక:– కర్మాణి = కర్మలను, అశేషతః = సంపూర్ణముగా, త్యక్తుమ్ = విడుచుటకు, దేహభృతా =

దేహధారియగు జీవునకు, న శక్యం హి = సాధ్యముకాదుగదా!, యః తు = ఎవడైతే, కర్మఫలత్యాగీ = కర్మలయొక్క ఫలములను విడుచుచున్నాడో, సః = అతడు, త్యాగీ ఇతి = త్యాగియని, అభిధీయతే = పిలువబడుచున్నాడు.

తా:– కర్మములను పూర్తిగా విడుచుటకు దేహధారియగు జీవునకు సాధ్యము కాదు. ఎవడు కర్మలయొక్క ఫలమును విడుచుచున్నాడో అట్టివాడే త్యాగియని పిలువబడుచున్నాడు.

వ్యాఖ్య:– దేహధారియగు జీవుడు దేహసంరక్షణాదులకై కర్మను చేయవలసియే యున్నాడు. కావున కర్మలను సంపూర్తిగా విడచుట కాతనికి సాధ్యపడదు. ఇక్కారణమున ఆ యా కర్మలను చేయుచు వానిఫలములను విడచుటయే సర్వోత్తమమగు పద్ధతి. అట్టివాడిక ఆ కర్మలచే బద్ధుడు కానేరడు. మఱియు అట్టివాడే త్యాగియని చెప్పబడును. త్యాగి యనగా బాహ్యవస్తువులను త్యాగముచేయువాడు కాదనియు, కర్మలను చేయుచు వాని ఫలములను వదులువాడే త్యాగియనియు, అభిమానమును, సంగమును త్యజించువాడే త్యాగియనియు ఈ శ్లోకముద్వారా వెల్లడియగుచున్నది. కేవలము కర్మలను వదలివేసినంత మాత్రమున మనుజుడు త్యాగికానేరడు, త్యాగఫలమును బొందనేరడు. కర్మలను గావించుచు వాని ఫలములను వదలువాడే త్యాగి యగును. మఱియు త్యాగఫలమును బొందగలుగును. దీనినిబట్టి అంతరంగమునగల త్యాగిత్వము ఫలాపేక్షారూప (దేహాభిమానరూప) అంతరంగమనోవృత్తియొక్క త్యాగముపైననే ఆధారపడియున్నదిగాని బాహ్యవస్తువులయొక్క పరిత్యాగముపై గాదని స్పష్టపడుచున్నది. కావున కర్మలను జేయవలెననియు, కాని ఫలాభిసంధిరహితముగ చేయవలెననియు భగవంతుని ఆశయమై యున్నట్లు తెలియుచున్నది.

ప్ర:– కర్మలను పూర్తిగ విడచుట సాధ్యపడునా?

ఉ:– దేహధారియగు జీవున కది సాధ్యపడదు.

ప్ర:– త్యాగి అనగా ఎవడు?

ఉ:– ఎవడు కర్మలజేయుచు వాని ఫలములను వదలివేయునో ఆతడే త్యాగి యనబడును (అంతియే కాని కర్మలను వదలినవాడుకాదు).

అ॥ కర్మఫలములను త్యజించుటచే కర్మబంధమునుండి మనుజు డేల విడివడగలడో చెప్పుచున్నాడు

12. అనిష్టమిష్టం మిశ్రం చ త్రివిధం కర్మణః ఫలమ్
భవత్యత్యాగినాం ప్రేత్య న తు సన్న్యాసినాం క్వచిత్.

టీక:– అనిష్టమ్ = దుఃఖకరమైనదియు (నరకము, నీచజన్మాదులు గలుగజేయునది), ఇష్టమ్ = సుఖకరమైనదియు (స్వర్గము, దేవతాజన్మము గలుగజేయునది), మిశ్రం చ = సుఖదుఃఖములు రెండును గలసినదియు (మనుష్యజన్మను గలుగజేయునది) అగు, త్రివిధమ్ = మూడువిధములైన, కర్మణః ఫలమ్ = కర్మములయొక్క ఫలము, అత్యాగినామ్ = కర్మఫలత్యాగముచేయనివారలకు, ప్రేత్య = మరణానంతరము, భవతి = కలుగుచున్నది, సన్న్యాసినాం తు = కర్మఫలత్యాగము చేసినవారికన్ననో, క్వచిత్ = ఒకప్పుడును్ను, న కలుగదు.

తా:— దుఃఖకరమైనదియు, సుఖకరమైనదియు, సుఖదుఃఖములు రెండును గలసినదియునగు మూడువిధములైన కర్మఫలము కర్మఫలత్యాగము చేయనివారలకు మరణానంతరము కలుగుచున్నది. కర్మఫలత్యాగముచేసినవారికన్ననో అవి యెన్నటికిని కలుగనేరవు.

వ్యాఖ్య:— కర్మ బంధమును గలుగజేయునని, జన్మకు హేతువగునని, కావున చేయరాదని చెప్పువారికి భగవాను డీశ్లోకమున సరియైన సమాధాన మొసంగిరి. కర్మ యెవరికిబంధమును గలిగించును? అందఱికినిగాదు. ఫలాపేక్షతో చేయువారికి, సంగముతోను, అభిమానముతోను, కర్తృత్వబుద్ధితోను ఆచరించువారికిమాత్రమే కర్మ బంధకరముగ పరిణమించునుగాని, అసంగముగ, నిష్కామముగ ఫలాపేక్షారహితముగ ఆచరించువారికి గాదు. ఆ విషయమే ఈ శ్లోకమందు స్పష్టముగ చెప్పబడినది. స్వర్గాది సుఖరూప ఇష్టఫలముగాని, నరకనీచజన్మాది దుఃఖరూప అనిష్టఫలముగాని, మానవజన్మయను సుఖదుఃఖమిశ్రఫలముగాని ఫలాపేక్షతో కర్మలను జేయువారికే కలుగునుగాని, ఫలములను వదలిన వారికికాదు. (నతు సన్న్యాసినాం క్వచిత్). అని చెప్పుటవలన ఏకాలమందును వారికి బంధము కలుగదని భావము. ఏలయనగా కర్మఫలములను త్యజించువారికి చిత్తశుద్ధిద్వారా మోక్షమే కలుగును. జన్మరాహిత్యమే సిద్ధించును. వారికి లోకాదుల (జన్మాదుల) ప్రసక్తియే యుండదు. సంసారచక్ర పరిభ్రమణమంతయు ఫలాపేక్షతో కర్మలను జేయువారికే యగును. దీనినిబట్టి ఫలాపేక్షారహితమగు (నిష్కామమగు) కర్మ యెంతటి మహిమతో గూడుకొనియున్నదో, భగవానునకు దానియెడల యెంతటిప్రీతియో విస్పష్టమగుచున్నది.

ప్ర:— కర్మఫల మెన్నివిధములు? అవి యేవి?

ఉ:— మూడు విధములు - (1) ఇష్టమైనది (సుఖకరమైన స్వర్గాదులు) (2) అయిష్టమైనది (దుఃఖకరమగు నరకనీచజన్మాదులు) (3) ఇష్టానిష్టమిశ్రమమైనది (సుఖదుఃఖములు రెండునుగల మానవజన్మ).

ప్ర:— ఈ మూడు ఫలములు యెవరికి కలుగును?

ఉ:— కర్మఫలములను వదలక కర్మలను ఫలాసక్తితో చేయువారికే కలుగును.

ప్ర:— ఎపుడు కలుగును?

ఉ:— మరణానంతరము (ప్రేత్య).

ప్ర:— ఈ కర్మఫలములు ఎవరికి కలుగవు?

ఉ:— కర్మఫలములు త్యజించి కర్మనాచరించువారికి అనగా, నిష్కామకర్మాచరణపరులకు కలుగవు. (వారికి చిత్తశుద్ధిద్వారా మోక్షమే లభించును గావున).

అ॥ కర్మలు నెరవేరుటకుగల ఐదు కారణములను వచించుచున్నాడు -

13. పఞ్చైతాని మహాబాహో! కారణాని నిబోధ మే
సాఙ్ఖ్యే కృతాన్తే ప్రోక్తాని సిద్ధయే సర్వకర్మణామ్.

టీక:– మహాబాహో = గొప్పబాహువులు గల ఓ అర్జునా!, సర్వకర్మణామ్ = సమస్తకర్మములయొక్క, సిద్ధయే = నెరవేరుటకొఱకు (సంపూర్తికొఱకు), కృతాన్తే = కర్మకాండయొక్కఅంతమును దెలుపు (లేక కర్మబంధమును నశింపజేసెడి, లేక, కర్మఫలసమాప్తిగల) సాంఖ్యే = సాంఖ్యశాస్త్రమందు (వేదాంతశాస్త్రమునందు), ప్రోక్తాని = చెప్పబడిన, ఏతాని = ఈ, పఞ్చ కారణాని = ఐదు కారణములను, మే *(వచనాత్)* = నా వాక్యములవలన, నిబోధ = తెలిసికొనుము.

తా:– గొప్పబాహువులుకల ఓ అర్జునా! సమస్త కర్మలు నెరవేరుటకు కర్మకాండయొక్క అంతమును దెలుపు సాంఖ్యశాస్త్రమునందు చెప్పబడిన ఈ ఐదు కారణములను నావలన తెలిసికొనుము.

వ్యాఖ్య:– కృత + అన్తే = కృతాన్తే, సాంఖ్యే - అనగా కర్మకాండయొక్క అంతమును బోధించు వేదాంతశాస్త్రమందు - అని అర్థము. వేదాంతమున ఆత్మ స్వరూపమును నిర్ణయించునపుడు అది ప్రకృతికి పరమై, అతీతమైయుండునది యనియు, సమస్తకర్మలు ప్రకృతిచేతనే జరుగుచుండుననియు, ఆత్మ సాక్షిగ, నిష్క్రియముగ నుండుననియు అట తెలియజేయబడును. కనుకనే సమస్తకర్మలు అంతమగు వేదాంత శాస్త్రమున అని యిట చెప్పబడినది. మఱియు 'సర్వం కర్మాఖిలం పార్థ జ్ఞానే పరిసమాప్యతే' అని చెప్పబడినందువలన కర్మలన్నియు జ్ఞానమందు లయించిపోయి, పరిసమాప్తమగుచున్నవి. ఏలయనిన, చైతన్య (ప్రజ్ఞారూప) ఆత్మస్థితయందు శరీర, ఇంద్రియ, మనస్సంకల్పాదులుండవుకావున అచట కర్మ రహితమగును. కర్మను దాటిపోయినస్థితి అది. కనుకనే ఇచట జ్ఞానమునకు, వేదాంతశాస్త్రమునకు కర్మయొక్క అంతము (కృతాంతము) అని చెప్పబడినది.

ప్ర:– ఏ కర్మ అయినను జరుగవలెననిన ఎన్ని కారణములుండవలెను?

ఉ:– ఐదు.

ప్ర:– వానినిగూర్చి ఎచట తెలుపబడినది?

ఉ:– కర్మయొక్క అంతమగు జ్ఞానమును బోధించు సాంఖ్య (వేదాంత) శాస్త్రమున తెలుపబడినది.

అ॥ ఆ యైదు కారణము లెవ్వియో తెలుపుచున్నారు -

14. అధిష్ఠానం తథా కర్తా కరణం చ పృథగ్విధమ్
వివిధాశ్చ పృథక్చేష్టా దైవం చైవాత్ర పఞ్చమమ్.

టీక:– *అత్ర* = ఈ కర్మాచరణ విషయమున, *అధిష్ఠానమ్* = శరీరము, *తథా* = అటులనే, *కర్తా* = కర్త, *పృథగ్విధమ్* = వేఱువేఱు విధములగు, *కరణం చ* = ఇంద్రియములు, *వివిధాః* = నానావిధములుగను, *పృథక్* = వేఱువేఱుగనుండు, *చేష్టాః చ* = క్రియలు, *పంచమమ్* = అయిదవదియైన, *దైవం చ* = దైవమున్ను, (*భవన్తి* = కారణములగుచున్నవి).

తా:– ఈ కర్మాచరణ విషయమున (1) శరీరము (2) కర్త (3) వివిధములగు ఇంద్రియములు (4) పలువిధములుగను, వేఱువేఱుగను నుండు క్రియలు (వ్యాపారములు) ఐదవదియగు (5) దైవమున్ను కారణములుగా నున్నవి.

వ్యాఖ్య:– కరణములనగా పండ్రెండు (పంచకర్మేంద్రియములు + పంచజ్ఞానేంద్రియములు + మనస్సు + బుద్ధి). చేష్టలనగా వానివానివ్యాపారములు. ఇచట 'దైవ' మనగా ఆ యా ఇంద్రియాదుల అధిష్ఠానదేవతలనిగాని, లేక పూర్వజన్మసంస్కారములు (అదృష్టపుణ్యపాపములు) అనిగాని చెప్పవచ్చును.

ప్ర:– ఏ కర్మ అయినను జరుగవలెననిన దానికిగల ఐదు కారణములెవ్వి?

ఉ:– (1) శరీరము (2) కర్త (3) వివిధములగు ఇంద్రియములు (4) ఆ ఇంద్రియములయొక్క వ్యాపారములు (5) దైవము.

అ॥ ఏ కర్మచేయబడినప్పటికిని ఈ ఐదున్ను అందులకు కారణములని చెప్పుచున్నాడు -

15. శరీరవాఙ్మనోభిర్య త్కర్మ ప్రారభతే నరః
న్యాయ్యం వా విపరీతం వా పఞ్చైతే తస్య హేతవః.

టీక:– *నరః* = మనుజుడు, *శరీరవాఙ్మనోభిః* = శరీరము, వాక్కు, మనస్సు - అను వీనిచేత, *న్యాయ్యం వా* = న్యాయమైనట్టిగాని (శాస్త్రీయమైనట్టిగాని), *విపరీతం వా* = అన్యాయమైనట్టిగాని (అశాస్త్రీయమైనట్టిగాని), *యత్ కర్మ* = ఏ కర్మమును, *ప్రారభతే* = ఆరంభించుచున్నాడో, *తస్య* = ఆ కర్మమునకు, *ఏతే పఞ్చ* = ఈ అయిదున్ను, *హేతవః* = కారణములైయున్నవి.

తా:– మనుజుడు శరీరము, వాక్కు, మనస్సు అను వీనిచేత న్యాయమైనట్టిగాని (శాస్త్రీయమైనట్టి గాని), అన్యాయమైనట్టి) అశాస్త్రీయమైనట్టి)గాని ఏకర్మమును ప్రారంభించుచున్నాడో దానికీయైదున్ను కారణములైయున్నవి.

అ॥ సాక్షియగు ఆత్మను కర్తయని తలంచువాడు అవివేకియని తెలుపుచున్నాడు -

16. తత్రైవం సతి కర్తార మాత్మానం కేవలం తు యః
పశ్యత్యకృత బుద్ధిత్వా న్న స పశ్యతి దుర్మతిః.

టీక:– *తత్ర* = ఆ కర్మవిషయములందు, *ఏవం సతి* = ఇట్లుండగా, (పైనదెల్పిన అయిదున్ను కారణములైయుండగా), *యః* = ఎవడు, *అకృతబుద్ధిత్వాత్* = (శాస్త్రాదులచే) సంస్కరింపబడని బుద్ధిగలవాడగుటచే, *కేవలం ఆత్మానం తు* = నిరుపాధికుడును, సంగరహితుడునగు ఆత్మను, *కర్తారమ్* = కర్తనుగా, *పశ్యతి* = చూచుచున్నాడో (తలంచుచున్నాడో), *సః దుర్మతిః* = అట్టి దుర్బుద్ధి (అవివేకి), *న పశ్యతి* = కర్మముయొక్క స్వరూపమునుగాని, ఆత్మయొక్క స్వరూపమును గాని ఎఱుంగకున్నాడు.

తా:– కర్మవిషయమం దిట్లుండగా (పైనదెల్పిన అయిదున్ను కారణములై యుండగా) ఎవడు సంస్కరింపబడని బుద్ధిగలవాడగుటచే, నిరుపాధికుడగు ఆత్మను కర్తగా తలంచుచున్నాడో, అట్టి అవివేకి కర్మముయొక్కగాని, ఆత్మయొక్కగాని వాస్తవస్వరూపమును ఎఱుంగకున్నాడు.

వ్యాఖ్య:– కర్మయందు ఆత్మ కర్తకాదు. పైనదెల్పిన అయిదుమాత్రమేకర్తలు. ఆత్మసాక్షి, కేవలుడు, నిరుపాధికుడు, సంగరహితుడు. అయినను కర్తృత్వమును ఆత్మయందారోపించువాడు వివేకహీనుడేయగును. ఆతడు పరమార్థతత్త్వమును తెలియనివాడు. శ్రవణాది సంస్కారములేని బుద్ధిగలవాడు – దుర్మతి. అసంగమగు ఆత్మను కర్తగజూచువాడు నేత్రములున్నను గ్రుడ్డివాడేయగును. ఏలయనిన అతడు సత్యమును గాంచుటలేదు. ఆత్మకు కర్తృత్వము ఆరోపించుట అజ్ఞానమేయగును. కావుననే అట్టివారు గ్రుడ్డివారే యని చెప్పబడినది. దీనికి కారణము వారిబుద్ధికి సరియైన సంస్కారము లేకుండుటయే (అకృతబుద్ధిత్వాత్). ఎంత పాండిత్యము, ఎన్ని లౌకికవిద్యలు గలిగియున్నప్పటికిని, సత్యదృష్టిలేనిచో, ఆత్మజ్ఞానములేనిచో అట్టివారు అంధప్రాయులేయగుదురు. ఏలయనిన వారు జ్ఞాననేత్రవిహీనులై యున్నారు. వారెంత గొప్పవారైనప్పటికిని చీకటిలోనున్నవారి చందముననేయుండుచు వాస్తవమును గ్రహించజాలకయుందురు.

కాబట్టి ఎంతటి ప్రాపంచిక వివేకమున్నను, ఆత్మజ్ఞానము లేనివారు దుర్మతులు, అంధులేకనుక, ప్రపంచదృష్టిలో కీర్తి, ప్రతిష్ఠలు సంపాదించుకొనినప్పటికిని పరమార్థదృష్టిలో వారు గణనీయులుకారు. కనుక, జనులు ఆత్మతత్త్వమెఱింగి మానవులకేకాక, భగవంతునకుగూడ ప్రీతిపాత్రులు కావలయును.

దోషము – అసంగమగు ఆత్మను కర్తగ భావించుట.

దోషకారణము – బుద్ధి శ్రవణాదులచే సంస్కరింపబడకుండుట.

దోషఫలితము – అజ్ఞానరూప అంధత్వము (సత్యమును జూడజాలకుండుట).

ప్ర:– ఆత్మ యెట్టిది?

ఉ:– కేవలమై, సాక్షియై, అసంగమైయున్నది.

ప్ర:– అట్టి నిష్క్రియ, అసంగఆత్మను కర్తయని మనుజు డేల చెప్పుచున్నాడు?

ఉ:– అజ్ఞానమువలన, బుద్ధికి ఇంకను శ్రవణాది సంస్కారము లేనందువలన.

ప్ర:– కాబట్టి ఆతని స్థితి యెట్లున్నది?

ఉ:– గ్రుడ్డివానివలె నున్నది. సత్యము నతడు కాంచుటలేదు.

అ॥ అహంకారము, కర్తృత్వబుద్ధి లేనివాడు కర్మలచే నంటడని వచించుచున్నాడు –

17. యస్య నాహఙ్కృతో భావో బుద్ధిర్యస్య న లిప్యతే
హత్వాఽపి స ఇమాంల్లోకా న్న హన్తి న నిబధ్యతే.

టీక:– యస్య = ఎవనికి, అహంకృతః భావః = .నేను కర్తను. అను తలంపు, న = లేదో, యస్య = ఎవనియొక్క, బుద్ధిః = బుద్ధి (అంతఃకరణము), న లిప్యతే = విషయములను, కర్మలను అంటదో, సః = అతడు, ఇమాన్ లోకాన్ = ఈ ప్రాణులన్నిటిని, హత్వాఽపి = చంపినను, న హన్తి = చంపుటలేదు, న నిబధ్యతే = (కర్మలచే, పాపముచే) బంధింపబడుటయు లేదు.

తా:– ఎవనికి 'నేను కర్తను' అను తలంపు లేదో, ఎవనియొక్క బుద్ధి విషయములను, కర్మలను అంటదో అతడీ ప్రాణులన్నిటిని చంపినను వాస్తవముగ ఏమియు చంపుటలేదు. మఱియు నతడు (కర్మలచే, పాపముచే) బంధింపబడుటయు లేదు.

వ్యాఖ్య:– అహంకారముగాని, నేను కర్తనను తలంపుగాని లేనివానికి, బుద్ధి విషయములందుగాని కర్మలందుగాని అంటనివానికి ఈ ప్రాణులన్నిటిని వధించినను, వధించనట్లేయనియు, పాపముచే నతడు చుట్టుకొనబడడనియు, ఆతడు బంధింపబడడనియు ఇచట తెలుపబడెను. ఈ శ్లోకార్థమును బహుజాగ్రత్తగ యోచనచేయవలయును. లేకున్న మనుజుడు అజ్ఞానమను అఖాతమున పడిపోవు ప్రమాదము గలదు.

కర్మబంధమునకు కారణము కర్మలందు కర్తృత్వబుద్ధి గలిగియుండుట, బుద్ధి ఆ యా విషయములకు, కర్మలకు అంటుకొనుట (సంగము) అయియున్నది. కర్తృత్వబుద్ధి లేకుండ కర్మలు చేయువానికిగాని, విషయములందు బుద్ధి అంటకుండ (సంగములేకుండుట) కర్మలు చేయువానికిగాని, ఆ కర్మజనిత సుఖదుఃఖములుగాని పుణ్యపాపములుగాని అంటవు. ఆ సత్యమే యిచట చెప్పబడినది. అంతియేకాని ప్రాణులను చంపుమనిగాని, చంపుట యుక్తమనిగాని యిచట బోధింపబడలేదు. పైగా సమస్తమును ఆత్మరూపముగ వీక్షించువాడు, కర్తృత్వములేనివాడు, అసంగుడై యుండువాడు, తాను మనస్సుగాదని తలంచువాడు, ఆత్మయందే స్థితిగలిగియుండును గావున అట్టివాడు సమస్తప్రాణులందును తన ఆత్మనే చూచుటవలన ఒక ప్రాణి కెట్లు బాధకలుగజేయగలడు? కాబట్టి అట్టి అసంగభావము గలవాడు, ఆత్మస్థితుడు జనులకుపకారము చేయునేకాని, అపకారము చేయడు. ప్రాణులను హింసింపడు. ఒకవేళ హింసించినచో అతని కింకను ఆత్మజ్ఞానము కలుగలేదనియే ఊహించవలసియుండును.

మనుజుడు వాస్తవముగ దేహముగాని, మనస్సుగాని కాదు; ఆత్మయే. కర్తృత్వము, అహంభావము లేనివాడు ఆత్మయందే స్థితి గల్గియుండును. అట్టివారు బుద్ధిచేగావింపబడు కర్మలతోగాని, తజ్జనిత బంధముతోగాని ఏ సంబంధమును లేకుండును. కాబట్టి యతడు ఒకప్రాణినేకాదు, అన్నిప్రాణులను ఒకవేళ చంపినను, బుద్ధితో సంగము లేకుండుటవలన, కర్తృత్వము లేకుండుటవలన, ఆత్మయందేయుండుటవలన ఆతడు చంపనట్లేయగుచున్నాడు. మఱియు ఆ వధవలన కలుగుపాపముచే, బంధముచే అంటబడక నుండుచున్నాడు. ఇచట ఆత్మయొక్క, ఆత్మస్థితునియొక్క నిర్లేపత్వమును గూర్చిన ఒకానొక సిద్ధాంతము, సత్యము చెప్పబడినదేకాని హింసాప్రేరణము కాదు. వాస్తవముగ అట్టి నిర్లేపత్వమును బడసినవాడు, ఆత్మయందున్నవాడు నిరంతరము ప్రాణికోట్లకు మేలుచేయునే కాని, వానినేమాత్రము బాధింపడు. ఈ విషయమును ముముక్షువులు ముఖ్యముగ జ్ఞప్తియందుంచుకొనవలెను.

పుణ్యపాపములకు కారణము కర్తృత్వము, సంగము, ఆసక్తి; అనగా జీవుడు తన ఆత్మస్థానమునువదలి, దిగివచ్చి దృశ్యముతో, బుద్ధితోజేరి 'నేను చేయుచున్నాను' అని తలంచుటయే. కాని యెపు డట్టి సంగము (ఆసక్తి), కర్తృత్వములేదో అత్తఱి ఆ పుణ్యపాపములతోగాని, తజ్జనితసుఖదుఃఖములచే గాని, బంధమోక్షములతోగాని మనుజునకు సంబంధముండదు. కావుననే అట్టివాడు అందఱిని చంపినను, చంపనివాడే యని చెప్పబడుటకు కారణము. 'ఎంతపాపమైనను అంటదు' – అనుదానికి ఒక తార్కాణముగ, 'అతడొకవేళ అందఱిని చంపినను చంపనివాడేయగునని' వచింపబడినదేకాని వారిని చంపుమని బోధింపబడలేదు.

మఱియు అర్జునుడు క్షత్రియుడు. దుష్టశిక్షణ ప్రభువుకు ధర్మము, కర్తవ్యము. కౌరవులు అధర్మమునుజేబట్టి దుష్టులుగ తయారైరి. ''కావున అట్టివారినందఱిని ఓ అర్జునా! అసంగబుద్ధిగల్గి, నిరహంకారముతో నీవు వధించినను వధింపనట్లేయగు'' నని భగవానుడు అర్జునునకు తెలియజేయుచున్నాడనియు భావించవచ్చును. బుద్ధినిదాటి, అహంభావమునుదాటి ఆత్మయందు నెలకొనియుండువానికి ఆ బుద్ధితో ఏది చేసినను చేయనట్లేయగునుగదా! అయితే అట్టి స్థితియందుండువారు అసభ్యమైన, అధర్మయుతమైన, హింసాకరమైన, పీడాకరమైన క్రియలెవ్వియును జేయరు. 'ఇమాన్ లోకాన్' అని అర్జునునకు చెప్పినందువలన 'ఈ యెదుటనున్న కౌరవరాజులు మున్నగువారు' అనియు తలంచవచ్చును. ప్రభువులు దుష్టులకు, ద్రోహులకు గావించు శిక్ష పాపముగా పరిగణింపబడదు. కావున అది వారిని బంధింపదు. పైగా అట్టి క్రియను అసంగబుద్ధితో నాచరించునపుడు ఇంకను ఏ మాత్రము బంధప్రభావమును కలుగజేయదు.

కాబట్టి భగవానుడు తెలిపిన ఈ శ్లోకమందలి భావమును చాల లోతుగ విచారించి, పరప్రాణికి ఏమియు బాధ కలుగజేయక, ఆత్మయందు స్థితుడై అసంగబుద్ధితో ఆ యా కార్యముల నెరవేర్చుచు, బంధవిముక్తుడై వెలయవలెను.

ప్ర:– పాపమునకు, బంధమునకు కారణమేమి?

ఉ:– (1) అహంభావము ('నేను కర్తను' అనుభావము) (2) బుద్ధియొక్క సంగము (విషయాదులతో, కర్మాదులతో అంటుకొనుట).

ప్ర:– పాపము, బంధము తొలగుటకు ఉపాయమేమి?

ఉ:– అట్టి సంగ కర్తృత్వాదులు లేకుండుట. అత్తఱి కార్యములనుజేసినను వానిచే నతడు బంధింపబడడు.

అ॥ కర్మకు కారణమును, ఆధారమును తెలుపుచున్నాడు –

18. జ్ఞానం జ్ఞేయం పరిజ్ఞాతా త్రివిధా కర్మచోదనా
కరణం కర్మకర్తేతి త్రివిధః కర్మసఙ్గ్రహః.

టీక:– కర్మచోదనా = కర్మమునకు (కర్మమును నడిపించుటకు) హేతువు (కర్మప్రవర్తనము), జ్ఞానమ్ = తెలివి, జ్ఞేయమ్ = తెలియబడదగినవస్తువు, పరిజ్ఞాతా = తెలియువాడు (అని), త్రివిధా = మూడువిధములుగనున్నది, కర్మసంగ్రహః = కర్మమున కాధారమున్ను. కరణమ్ = ఉపకరణము (సాధనము, బాహ్యాభ్యంతరేంద్రియములు), కర్మ = క్రియ, కర్తా = చేయువాడు, ఇతి = అని, త్రివిధః = మూడువిధములుగ నున్నది.

తా:– కర్మమునకు హేతువు తెలివి, తెలియదగిన వస్తువు, తెలియువాడు అని మూడువిధములుగ నున్నది. అట్లే కర్మ కాధారమున్ను, ఉపకరణము (సాధనము), క్రియ, చేయువాడు – అని మూడు విధములుగ నున్నది.

ప్ర:— కర్మమునకు హేతు వెన్ని విధములుగ నున్నది? అవియేవి?

ఉ:— మూడువిధములుగ. అవి (1) ఉపకరణము (2) క్రియ (3) కర్త (చేయువాడు) అయియున్నవి.

అ॥ జ్ఞానము, కర్మ, కర్త - అనువానియొక్క సాత్త్విక, రాజస, తామసరూపములను తెలియజేసెదనని భగవానుడు పలుకుచున్నాడు -

19. జ్ఞానం కర్మ చ కర్తా చ త్రిధైవ గుణ భేదతః
ప్రోచ్యతే గుణసఙ్ఖ్యానే యథావచ్ఛృణు తాన్యపి.

టీక:— *గుణసంఖ్యానే* = గుణములనుగూర్చి విచారణచేయుసాంఖ్యశాస్త్రమునందు, *జ్ఞానమ్* = జ్ఞానము, *కర్మచ* = కర్మమును, *కర్తాచ* = కర్తయును, *గుణభేదతః* = సత్త్వాదిగుణములయొక్క భేదము ననుసరించి, *త్రిధా ఏవ* = మూడువిధములుగానే, *ప్రోచ్యతే* = చెప్పబడుచున్నవి, *తాని అపి* = వానినిగూడ, *యథావత్* = యథారీతి (శాస్త్రమునందు చెప్పబడిన ప్రకారము), *శృణు* = వినుము.

తా:— గుణములనుగూర్చి విచారణచేయు సాంఖ్యశాస్త్రమునందు జ్ఞానము, కర్మము, కర్త అనునివియు సత్త్వాదిగుణములయొక్క భేదముననుసరించి మూడువిధములుగనే చెప్పబడుచున్నవి. వానినిగూడ యథారీతి (శాస్త్రోక్తప్రకారము) చెప్పెదను వినుము.

ప్ర:— భగవానుడు గుణభేదముననుసరించి మూడువిధములుగ వేనినిగుఱించి చెప్పదలంచెను?

ఉ:— (1) జ్ఞానము, (2) కర్మ, (3) కర్త - అను ఈ మూడింటినిగూర్చి.

ప్ర:— వానినిగుఱించి యెచట తెలుపబడినది?

ఉ:— సాంఖ్యశాస్త్రమునందు.

అ॥ అందు మొదట జ్ఞానము నెత్తుకొని సాత్త్వికజ్ఞానముయొక్క స్వరూపమును తెలియజేయుచున్నాడు -

20. సర్వభూతేషు యేనైకం భావమవ్యయమీక్షతే
అవిభక్తం విభక్తేషు తజ్జ్ఞానం విద్ధి సాత్త్వికమ్.

టీక:— *విభక్తేషు* = విభజింపబడి వేఱువేఱుగనున్న, *సర్వభూతేషు* = సమస్త (చరాచర) ప్రాణికోట్లయందును, *ఏకమ్* = ఒక్కటైన, *అవ్యయమ్* = నాశరహితమగు, *భావమ్* = ఆత్మవస్తువును (లేక దైవముయొక్క ఉనికిని), *యేన* = ఏ జ్ఞానముచేత, *అవిభక్తమ్* = విభజింపబడక (ఏకముగ) నున్నట్లుగ, *ఈక్షతే* = చూచుచున్నాడో (ఎఱుంగుచున్నాడో), *తత్ జ్ఞానము* = ఆ జ్ఞానము, *సాత్త్వికమ్* = సాత్త్వికమని, *విద్ధి* = తెలిసికొనుము.

తా:— విభజింపబడి వేఱువేఱుగనున్న సమస్త చరాచర ప్రాణులందును, ఒక్కటైన నాశరహితమగు

ఆత్మవస్తువును (దైవముయొక్క ఉనికిని) విభజింపబడక (ఏకముగ) నున్నట్లు ఏ జ్ఞానముచేత నెఱుంగుచున్నాడో అట్టి జ్ఞానము సాత్త్వికమని తెలిసికొనుము.

వ్యాఖ్య:– అజ్ఞానుల దృష్టికి, (స్థూలదృష్టికి భౌతికనేత్రమునకు) ఈ ప్రపంచము, సమస్తపదార్థములు, సమస్తప్రాణులు విభజింపబడియున్నట్లు, వేఱువేఱుగానున్నట్లు కానుపించును. కాని జ్ఞానులదృష్టికి అంతయు అవిభక్తముగను, సర్వత్ర నాశరహితమగు ఒకే ఆత్మవస్తువు (పరబ్రహ్మము) వ్యాపించియున్నట్లును గోచరించును. ఏ జ్ఞానముచే అట్టి అవిభక్తము వారికి అనుభూతమగునో అట్టి జ్ఞానము సాత్త్వికమైనదని యిచట పేర్కొనబడెను.

'సర్వభూతేషు' – అని చెప్పినందువలన భగవంతుడు (ఆత్మ) సమస్తచరాచర ప్రాణికోట్లయందును వ్యాపించియున్నాడని తెలియుచున్నది. కావున ఎట్టి నికృష్టజీవి అయినప్పటికిని, తనవెనుకనున్న పరమాత్మను తెలిసికొని, తనయథార్థరూపమునుఅవగతమొనర్చుకొని తరించుటకు అవకాశము కలదు. తరంగము చిన్నదైనను దాని కాధారభూతమైన సముద్రమును భావించి దానిలో లీనమగుటకు, సముద్రరూపమగుటకు అర్హానికి హక్కుగలదు. కావున ఎట్టి అల్పవ్యక్తి అయినప్పటికిని ఎవరును ఇక అధైర్యపడవలసిన పనిలేదు. హృదయమును పవిత్రమొనర్చుకొని తన నిజరూపమగు ఆత్మను తెలిసికొనిన చాలును తరించిపోవును.

అనేకతరంగములున్నప్పటికిని వాని నామరూపములను వదలి జలమును మాత్రము చూచువానివలెను, పెక్కుకుండలను చూచియు వానియందలి మృత్తికనే వీక్షించువానివలెను, పుష్పమాలలోని అనేకపుష్పములలోనగల దారమును చూచువానివలెను ప్రపంచమున అనేక జీవరాసులను, భిన్నభిన్న పదార్థములను చూచినను వాని ఉపాధిరూపమును, నామరూపములను వదలి అన్నిటియందును అనుస్యూతమైయున్న అవిభక్తమగు ఏకమైన ఆత్మనే చూచువాడు సాత్త్విక జ్ఞానయుతుడని చెప్పబడును. అనగా అనేకత్వములో ఏకత్వమును, నాశములో అవినాశిత్వమును, విభజిత వస్తువులను అవిభక్తత్వముగ వీక్షింపగల్గుటయే ఉత్తమజ్ఞానమని భావము. దీనినిబట్టి ప్రపంచమున అనేకత్వమును జూచుటకేవలము అజ్ఞానమేయని తేలుచున్నది.

ఈ శ్లోకమున ఆత్మవస్తువునకు మూడు విశేషణములు చెప్పబడినవి – అది (1) ఏకమైనది (2) అవ్యయమైనది (3) అవిభక్తమైనది – అని. ప్రపంచవస్తువులకును ఆత్మకును భేదము ఈ క్రింద తెలుపబడుచున్నది.

	ప్రపంచవస్తువులు	ఆత్మ (దైవము)
(1)	అనేకములైనవి	ఏకమైనది (ఏకమ్)
(2)	నాశవంతములు	నాశరహితమైనది (అవ్యయమ్)
(3)	విభాగముతో గూడినవి	అవిభక్తమైనది (అవిభక్తమ్)

లోకమున పెక్కు జ్ఞానములు కలవు – సంగీతజ్ఞానము, సాహిత్యజ్ఞానము, రాజకీయజ్ఞానము, మున్నగునవి. కాని ఏ జ్ఞానమువలన అనేకత్వములో ఏకత్వమును, మృత్యువులో అమృతత్వమును, విభాగములో అవిభాగమును గాంచగల్గునో అదియే అన్ని జ్ఞానములలోను శ్రేష్ఠమైనదని, అదియే

సాత్త్వికజ్ఞానమని భగవానుడు తెలిపెను. అదియే అధ్యాత్మవిద్య. కాబట్టి విజ్ఞులు ఈ భగవద్వాక్యమునందు విశ్వాసముకలవారై ఉత్తమోత్తమజ్ఞానమునే బడసి ధన్యులయ్యెదరుగాక! దీనినిబట్టి ప్రపంచములో ఎందఱో మేధాసంపన్నులు, కళాకుశలురు ఉన్నప్పటికిని ఇట్టి సర్వభూతాత్మభావము, సర్వాత్మజ్ఞానము, అవిభక్తదైవభావము లేనిచో వారందఱును భగవద్దృష్టిలో వాస్తవజ్ఞానసహితులే యగుదురు. కావున లౌకికములగు ఇతర విద్యలు, జ్ఞానములు ఎన్నియున్నప్పటికిని ప్రతివారును భగవత్ప్రోక్తమగు ఈ సాత్త్వికజ్ఞానమును అవలంబించి సర్వాత్మదృష్టిగలవారై జీవితమును తరింపజేసికొనవలెను. అట్లుకాక, లోకములో భిన్నత్వమును కాంచుచో, అందులకు ఫలితము సంసారబంధమే, మృత్యువే, జననమరణదుఃఖమే. ఉపనిషత్తు లీయర్థమునే ఈప్రకారముగ తెలుపుచున్నవి –

'మృత్యోస్సమృత్యు మాప్నోతి య ఇహనానేవ పశ్యతి'. కావున ప్రపంచములో ఏ ప్రాణిని చూచినప్పటికిని అతని దేహముపైగాని, గుణముపైగాని దృష్టినుంచక లోనగల ఆత్మపైననే దృష్టినుంచవలెను. దేహదృష్టిమాత్రము గలిగియుండువారు అధములు. మనోదృష్టి గలిగియుండువారు, అనగా ఒకప్రాణిని జూచినపుడు అతని గుణములను మాత్రము పరికించువారు మధ్యములు. ఆత్మదృష్టి, దైవదృష్టిగలవారు ఉత్తములు. ఈ భావమే ఈ శ్లోకమున వ్యక్తీకరింపబడినది. కావున అట్టి ఆత్మదృష్టికై సాత్త్వికజ్ఞానమునకై సర్వులును యత్నించవలెను.

ప్ర:– సాత్త్వికజ్ఞానముయొక్క లక్షణమేమి?

ఉ:– ఏ జ్ఞానముచే మనుజుడు వేఱువేఱుగనున్న సమస్త ప్రాణులందును, ఏకమై, నాశరహితమై, అవిభక్తమైనట్టి ఆత్మవస్తువును వీక్షింపగల్గునో అదియే సాత్త్వికజ్ఞానము.

ప్ర:– భగవంతు డెచటగలరు?

ఉ:– సమస్త చరాచర ప్రాణికోట్లయందును గలరు.

ప్ర:– ఆత్మయొక్క స్వరూపమేది?

ఉ:– అది (1) ఏకమైనది (2) నాశరహితమైనది (3) అవిభక్తమైనది.

ప్ర:– ఈ ప్రపంచమున అనేకత్వము సత్యమా?

ఉ:– కాదు. ఏకత్వమే సత్యమైనది (పూసలలో దారమువలె, తరంగములలో జలమువలె).

అ॥ రాజసజ్ఞానమును చెప్పుచున్నాడు –

21. పృథక్త్వేన తు యజ్జ్ఞానం నానాభావాన్పృథగ్విధాన్ వేత్తి సర్వేషు భూతేషు తజ్జ్ఞానం విద్ధి రాజసమ్.

టీక:– యత్ జ్ఞానమ్ = ఏ జ్ఞానమును, సర్వేషు = సమస్తమైన, భూతేషు = ప్రాణులందును, పృథగ్విధాన్ = వేఱువేఱు విధములుగనున్న, నానాభావాన్ = అనేకములగుజీవులను, పృథక్త్వేనతు =

వేఱువేఱుగా, వేత్తి = తెలిసికొనుచున్నదో, తత్ జ్ఞానమ్ = అట్టిజ్ఞానము, రాజసమ్ = రాజసజ్ఞానమని, విద్ధి = ఎఱుంగుము.

తా:– ఏ జ్ఞానమువలన మనుజుడు సమస్తప్రాణులందును వేఱువేఱువిధములుగ నున్న అనేక జీవులను వేఱువేఱుగా నెఱుంగుచున్నాడో, అట్టి జ్ఞానమును రాజసజ్ఞానమని తెలిసికొనుము.

వ్యాఖ్య:– ప్రపంచమునగల ప్రాణులలో 'వీడువేఱు, వీడువేఱు' - అని యీప్రకారముగ అనేకత్వమునుజూచుట ఉత్తమజ్ఞానముకాదు. అది రాజసమేయగును. అట్టి జ్ఞానముకలవా రొకవ్యక్తిని చూచినపుడు ఆతని గుణమును పరికించుదురేకాని ఆత్మను కాదు. కనుకనే వారు వ్యక్తులలో భిన్నత్వమును జూచుదురు. ఇట్టి రాజసజ్ఞానమునే యిపుడు ప్రపంచమున పెక్కురు కలిగియుండుచున్నారు. ఏలయనగా వారు ప్రాణులలో భిన్నత్వమునే కాంచుచున్నారు. కావున అద్దానిని తొలగించుకొని అద్వైత భావమును సమదృష్టిని అవలంబించవలెను (దిండ్లపై గలీబులపై దృష్టినుంచక లోనగలదూదిపైననే దృష్టిగలిగి యుండునట్లు).

ప్ర:– రాజసజ్ఞానముయొక్క లక్షణమేమి?

ఉ:– ప్రపంచములో అనేకత్వమునుజూచుట, సర్వజీవులందును 'వీడు వేఱు, వీడు వేఱు' అను భేదభావము గలిగియుండుట.

అ॥ ఇక తామసజ్ఞానమును గూర్చి తెలుపుచున్నాడు -

22. యత్తు కృత్స్నవదేకస్మి న్కార్యేసక్తమహైతుకమ్
అతత్త్వార్థవదల్పం చ తత్తామసముదాహృతమ్.

టీక:– యత్ తు = ఏ జ్ఞానమైతే, ఏకస్మిన్ కార్యే = ఏదేని ఒక్క పనియందు (శరీరప్రతిమాదులందు), కృత్స్నవత్ = సమస్తమునందువలె (అంతయు అదియేయని), సక్తమ్ = తగుల్కొని యుండునో, అహైతుకమ్ = అందులకు తగిన హేతువులేకయుండునో, అతత్త్వార్థవత్ = తత్త్వమును (సత్యవస్తువును) తెలియక నుండునో, అల్పంచ = అల్పమైనదిగ (స్వల్పఫలములను గలిగినదిగ) నుండునో, తత్ = అట్టి జ్ఞానము, తామసం = తామసజ్ఞానమని, ఉదాహృతమ్ = చెప్పబడినది.

తా:– ఏ జ్ఞానమువలన మనుజుడు ఏదేని ఒక్కపనియందు (శరీర, ప్రతిమాదులందు) సమస్తమును అదియేయని తగుల్కొనియుండునో, అందులకు తగిన హేతువు లేకుండునో, తత్త్వమును (సత్యవస్తువును) తెలియకనుండునో, అల్పమైనదిగ (అల్పఫలము గలిగినదిగ) యుండునో అట్టి జ్ఞానము తామసజ్ఞానమని చెప్పబడినది.

వ్యాఖ్య:– తామసజ్ఞానము కలవాడు ఏదియో యొక దృశ్యవస్తువును పట్టుకొని ఏదియో మునిగిపోయినట్లు దానియందే ఆసక్తిగలిగి, అదియే సమస్తమని తలంచుచుండును. అతడు ఒకవ్యక్తియొక్క శరీరమును మాత్రమేచూచి, ఆ శరీరమే ఆత్మయని అదియే సమస్తమని భావించుచుండును. రాజసజ్ఞానము గలవాడు లోని గుణమును, మనోభావములను మాత్రమే చూచును. సాత్త్వికజ్ఞానముకలవాడు లోని

అవిభక్తమగు ఆత్మనే వీక్షించును. చంచలవస్తువులగు దేహము, మనస్సు రెండును వికారవంతములైనవి, అస్థిరములైనవి. కావున వాని నాశ్రయించువాడు, వానియెడల దృష్టిగలవాడు అస్థిరత్వమునే, వినాశమునే, జననమరణములనే పొందుచుండును. నిత్యమై, స్థిరమై, అవ్యయమైనట్టి ఆత్మనాశ్రయించువాడు, అట్టి ఆత్మదృష్టిగలవాడు నిత్య, పునరావృత్తి రహిత ఆత్మపదవినే పొందును. కాబట్టి రాజస, తామసజ్ఞానముల రెండిటిని వదలి సాత్త్వికజ్ఞానమునే విజ్ఞుడవలంబించవలెను.

ప్ర:— తామసజ్ఞాన మెట్టిది?

ఉ:— ఏదియో యొక దృశ్యవస్తువును పట్టుకొని దానియందే ఆసక్తిగలిగి, అదియే సమస్తమని భావించునది (దృష్టాంతమునకు శరీరమును జూచి అదియే ఆత్మయనిభావించుట) (2) అందులకు తగిన హేతువును జూపజాలనిది (3) తత్త్వమును, సత్యవస్తువును తెలియనిది (4) అల్పఫలము గలిగి యుండునది తామసజ్ఞానమనంబడును.

అ॥ ఇంతదనుక మూడు విధములైన జ్ఞానములనుగూర్చి తెలిపి ఇక మూడు విధములైన కర్మలను గుఱించి తెలుపబోవుచు మొట్టమొదట సాత్త్వికకర్మనుగూర్చి చెప్పుచున్నాడు –

23. నియతం సఙ్గరహిత మరాగద్వేషతః కృతమ్
అఫలప్రేప్సునా కర్మ యత్తత్సాత్త్వికముచ్యతే.

టీక:— *నియతమ్* = శాస్త్రముచే నియమింపబడిన, *యత్ కర్మ* = ఏకర్మము, *అఫలప్రేప్సునా* = ఫలాపేక్షలేనివానిచేత, *సఙ్గరహితమ్* = ఆసక్తిలేకయు (తాను కర్తయను అభిమానములేక), *అరాగద్వేషతః* = రాగద్వేషములు లేకుండగను, *కృతమ్* = చేయబడినదో, *తత్* = అది, *సాత్త్వికమ్* = సాత్త్వికకర్మయని, *ఉచ్యతే* = చెప్పబడుచున్నది.

తా:— శాస్త్రముచే నియమింపబడినదియు, ఫలాపేక్షగాని, ఆసక్తి (సంగము) అభిమానముగాని, రాగద్వేషములుగాని లేకుండ చేయబడునదియు సాత్త్వికకర్మయనంబడును.

వ్యాఖ్య:— కర్మను గుఱించి యెచట చెప్పవలసివచ్చినను 'నియతం' 'నియతం' అని భగవానుడు పదేపదే వాక్రుచ్చుచున్నారు. నియతమనగా వేదశాస్త్రాదులచే నియమింపబడినది అని యర్థము. వారివారికి తోచినదే సత్యమని భావించక జనులు శాస్త్రప్రమాణమునుగైకొని, దానితో తన యనుభవమును మేళవింపజేసికొని వ్యవహరింపవలెను. కనుకనే ఇష్టమువచ్చిన కర్మనుచేయక శాస్త్రనియతమగు కర్మనే చేయవలెనని యాదేశించుటకు కారణమైనది. 'నహికశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠత్యకర్మకృత్' అనునట్లు ప్రపంచములో కర్మచేయక ఎవడును ఉండలేడుగనుక, కర్మయనునది నిత్యజీవితములో సర్వులకును అవశ్యకర్తవ్యమైయుండుటవలన దానిరహస్యమును ఎల్లరును బాగుగ తెలిసికొనియుండుట భావ్యమై యున్నది. కాబట్టి సాత్త్వికకర్మనుగూర్చి భగవాను డిచట తెలిపిన ఈ భావములు సర్వులకును చాల ముఖ్యములైయున్నవి. కర్మ యేప్రకారముండవలెననగా –

(1) శాస్త్రనియతమై యుండవలెను.

(2) సంగరహితముగ (ఆసక్తి, అభిమానములేకుండ) గావింపబడవలెను.

(3) రాగద్వేషములులేకుండ చేయబడవలెను.

(4) ఫలాపేక్షలేక నొనర్చబడవలెను.

ఈ నాలుగు విధముల సరిపోయి ఆచరింపబడు కర్మ చిత్తశుద్ధికరమై, హృదయమాలిన్యనివారకమై, దోషభంజకమై, జ్ఞానదాయకమై, మోక్షప్రదమైయుండగలదు.

'సఙ్గరహితమ్' - 'బుద్ధిర్యస్య న లిప్యతే' అని ఇదివఱలో తెలుపబడినట్లు కర్మలందు బుద్ధి అంటుకొనకయుండుటయే అసంగత్వము. అనగా 'నేను చేయుచున్నాను'ను అభిమానముగాని, మమత్వముగాని, ఆసక్తిగాని యుండరాదు. అట్టివాడు కర్మపాశముచే 'న నిబధ్యతే -' బంధింపబడనేరడని గీతాశయము. కావున సంగరహితముగ, ఫలాపేక్షావర్జితముగ కార్యముల నాచరించుటను అభ్యసింపవలెను.

'అరాగద్వేషతః' - పదార్థములపై రాగద్వేషములులేనపుడే సంగరహితముగ కార్యమాచరించుటకు వీలుపడును. మఱియు ఫలాభిలాషను త్యజించుటకును అనుకూలపడును. కాబట్టి కర్మయొక్క శుద్ధత్వమున కీ రాగద్వేషరాహిత్యము అత్యంతావశ్యకమైయున్నది.

ప్ర:— సాత్త్వికకర్మయెట్టిది?

ఉ:— (1) శాస్త్రనియమితమైనది (2) సంగరహితముగ నాచరింపబడునది (3) రాగద్వేషవర్జితముగ నొనర్పబడునది (4) ఫలాభిలాషలేక గావింపబడునది - సాత్త్వికకర్మయనబడును.

అ॥ రాజసకర్మనుగూర్చి చెప్పుచున్నాడు -

24. యత్తు కామేప్సునా కర్మ సాహఙ్కారేణ వా పునః
క్రియతే బహులాయాసం తద్రాజసముదాహృతమ్.

టీక:— *కామేప్సునా* = ఫలాపేక్షగలవానిచేతగాని, *పునః* = మఱియు, *సాహంకారేణ వా* = (నేను కర్తయను) అహంకారముతోగూడినవానిచేగాని, *బహులాయాసమ్* = అధికప్రయాసకరమగు, *యత్ కర్మతు* = ఏ కర్మమైతే, *క్రియతే* = చేయబడుచున్నదో, *తత్* = అది, *రాజసమ్* = రాజసకర్మయని, *ఉదాహృతమ్* = చెప్పబడినది.

తా:— ఫలాపేక్షగలవానిచేతగాని, మఱియు అహంకారముతోగూడినవానిచేగాని అధిక ప్రయాసకరమగు కర్మ మేది చేయబడుచున్నదో, అది రాజసకర్మయని చెప్పబడినది.

వ్యాఖ్య:— (1) ఫలాపేక్షతోను (2) అహంకారముతోను గూడి చేయబడు కర్మ రాజసకర్మ మనబడును. 'ఆయాసమ్' అని చెప్పక 'బహులాయాసమ్' అని చెప్పుటవలన రాజసకర్మావలంబి అత్యంతప్రయాసతో గూడిన కార్యములను జేయుచుండునని తెలియుచున్నది. కాని అట్టి కర్మలవలన ఆతనికి ప్రయాసయే మిగులునుగాని, బంధనివృత్తి కలుగజాలదు. ఏలయనిన అయ్యవి అహంకారము, ఫలాపేక్షయను దోషములతో గూడి యున్నవి. అహంకారమే బంధము, కర్తృత్వమే బంధము. ఫలాకాంక్షయే బంధము. కాబట్టి విజ్ఞుడట్టి రాజసకర్మలజోలికిపోక, సాత్త్వికకర్మలనే నిష్కామబుద్ధితో నాచరించితరించవలెను.

ప్ర:— రాజసకర్మ యెట్టిది ?

ఉ:– (1) ఫలాపేక్షతోను (2) అహంకారముతోనుగూడి యాచరింపబడునది (3) అధికప్రయాసతో గూడినది.

అ॥ తామసకర్మను పేర్కొనుచున్నాడు -

25. అనుబన్ధం క్షయం హింసా మనపేక్ష్యచ పౌరుషమ్
మోహాదారభ్యతే కర్మ యత్తత్తామసముచ్యతే.

టీక:– అనుబన్ధమ్ = తానుజేయుకర్మకు మున్ముందు గలుగబోవు దుఃఖాదులను, క్షయమ్ = (ధనాదులయొక్క) నాశమును, హింసామ్ = (తనయొక్కయు, ఇతరులయొక్కయు శరీరాదులకు గల్గు) బాధను, పౌరుషమ్ = తన సామర్థ్యమును, అనపేక్ష్య = ఆలోచింపక, మోహాత్ = అవివేకమువలన, యత్ కర్మ = ఏ కర్మము, ఆరభ్యతే = ప్రారంభింపబడుచున్నదో, తత్ = అది, తామసమ్ = తామసకర్మయని, ఉచ్యతే = చెప్పబడుచున్నది.

తా:– తానుచేయుకర్మకు మున్ముందు కలుగబోవు దుఃఖాదులను (ధనాదుల) నాశమును, (తనయొక్క, ఇతరులయొక్క శరీరాదులకుగల్గు) బాధను, తన సామర్థ్యమును ఆలోచింపక, అవివేకముతో ప్రారంభింపబడు కర్మము తామసకర్మయని చెప్పబడుచున్నది.

వ్యాఖ్య:– తామసకర్మావలంబి ముందు వెనుకలు ఆలోచింపక కర్మలు ప్రారంభించును. ఆ కర్మవలనకలుగబోవు దుఃఖములనుగుఱించి విచారింపడు. ఇతరులకు దానివలన కలుగు బాధనుగూడ యోచింపడు. తనశక్తిసామర్థ్యములనుగూడ చూచుకొనడు. అవివేకముతో గ్రుడ్డిగా కర్మలుచేయ మొదలిడును. అట్టివాడు చేయుకర్మ మహాప్రమాదభూయిష్ఠమైయుండును గావున అది సర్వదా త్యాజ్యమేయగును.

మఱియు సామాన్యముగ భగవద్విముఖుడై, స్వార్థసాధనకొఱకు గావించు దృశ్యవిషయసంపాదనారూపమైన కర్మలన్నియు రాజస, తామస క్రియలక్రిందకే వచ్చును. ఏలయనిన, వానిచే తన ఆత్మకు కలుగు నష్టము (సంసారబంధము) నతడు ఆలోచించుటలేదు.

'మోహాత్' - అనుటవలన ఈ రాజస, తామసక్రియలన్నిటికిని మూలకారణము అవివేకము, అజ్ఞానము అయియున్నదని స్పష్టమగుచున్నది. కాబట్టి మొట్టమొదటవివేకమును సంపాదించి ఇట్టి రాజస తామసాది వృత్తులను త్యజించి జీవితమును సంస్కరించుకొనవలయును.

ప్ర:– తామసకర్మ యెట్టిది?

ఉ:– ముందు కలుగబోవు దుఃఖాదులను, (ధనాదుల) నాశమును, (దేహాదుల) బాధను తన సామర్థ్యమును ఆలోచింపక అవివేకముతో గ్రుడ్డిగా నాచరింపబడు కర్మము తామసకర్మమనబడును.

ప్ర:– ఇట్టి తామస ప్రవృత్తికి కారణమేమి?

ఉ:– అవివేకము.

అ॥ మూడు విధములగు కర్తలను గుఱించిచెప్పుచు మొదట సాత్త్విక కర్తయొక్క స్వభావమును తెలియజేయుచున్నాడు -

26. ముక్తసఙ్గోఽనహంవాదీ ధృత్యుత్సాహసమన్వితః
సిద్ధ్యసిద్ధ్యోర్నిర్వికారః కర్తా సాత్త్విక ఉచ్యతే.

టీక:– ముక్తసఙ్గః = సంగమును (ఫలాపేక్షను) విడిచినవాడును, అనహంవాదీ = 'నేను కర్తన'ను అభిమానము, అహంభావము లేనివాడును, ధృత్యుత్సాహసమన్వితః = ధైర్యము, ఉత్సాహము - వీనితో గూడియున్నవాడును, సిద్ధ్యసిద్ధ్యోః = కార్యము సిద్ధించునప్పుడును, సిద్ధింపకుండునప్పుడును, నిర్వికారః = వికారమును జెందనివాడును నగు, కర్తా = కర్త, సాత్త్వికః = సాత్త్వికకర్తయని, ఉచ్యతే = చెప్పబడుచున్నాడు.

తా:– సంగమును (ఆసక్తిని, ఫలాపేక్షను) విడచినవాడును, 'నేను కర్తను' అను అభిమానము, అహంభావము లేనివాడును, ధైర్యముతోను, ఉత్సాహముతోను గూడియున్నవాడును, కార్యము సిద్ధించినను, సిద్ధింపకున్నను వికారమును జెందనివాడునునగు కర్త సాత్త్వికకర్తయని చెప్పబడుచున్నాడు.

వ్యాఖ్య:– నిత్యజీవితములో మనుజుడు నిరంతరము ఏదియోయొక కర్మను చేయవలసియే యుండుటవలన కర్తకుండవలసిన ఈ లక్షణములను తెలిసికొనినచో చక్కగ వ్యవహరించుటకు వీలగును. ఇచట కర్తకు నాలుగు ఉత్తమ లక్షణములు పేర్కొనబడినవి - అందు మొదటిది సంగము లేకుండుట. అనగా కార్యముచేసినను ఫలాపేక్షను విడచిపెట్టి కార్యమునందు తగుల్కొనక అసంగుడై యుండవలెను. రెండవది, 'అహం' భావము లేకుండుట. అనగా 'నేను కర్తన'ను అభిమానము లేకుండవలెను. ఇక మూడవది ధైర్యోత్సాహములతో గూడియుండుట. పిరికితనమునకును, నిరుత్సాహమునకును అధ్యాత్మక్షేత్రమున చోటే లేదు. అవికలవాడు ఒక్క అడుగైనను పరమార్థరంగమున ముందునకు వేయలేడు. తాను కేవలము నిత్యశుద్ధబుద్ధముక్తఆత్మస్వరూపుడే యని తలంచుకొనుచుండినచో అపరిమిత ధైర్యము, ఉత్సాహము మనుజునకు కలుగుచుండును. వాస్తవముగ తానట్టి నిర్మలాత్మయేకావున ఇక అధైర్యమును, నిరుత్సాహమును పారద్రోలి సాధనలందు ప్రయత్నశీలుడు కావలెను. సాత్త్వికకర్తయొక్క నాల్గవలక్షణము కార్యముయొక్క సిద్ధి, అసిద్ధులందు నిర్వికారుడైయుండుట. కార్యమునందు అపజయమును పొందినచో, లేక కార్యము విఫలమైనచో జయము కొఱకై, సఫలత్వము కొఱకై తిరిగి యత్నించవలసినదేకాని ఏవిధమైన మనోవికారమును బొందగూడదు. ద్వంద్వములకును ఏమాత్రము జంకగూడదు. ఈ జగత్తంతయు మిథ్యాభూతమని యెంచియు, తాను సాక్షియగు సత్యఆత్మస్వరూపుడని భావించియు, ద్వంద్వములందు సమబుద్ధిగలిగి వర్తించవలెను.

ప్ర:– సాత్త్వికకర్తయొక్క లక్షణము లేవి?

ఉ:– (1) సంగమును (ఫలాపేక్షను) విడచుట (2) 'నేను కర్తన' ను అహంభావము లేకుండుట (3) ధైర్యోత్సాహములు గలిగియుండుట (4) కార్యము సఫలమైనను, విఫలమైనను, ఏవిధమైన వికారమును జెందకుండుట.

అ॥ రాజసకర్తనుగూర్చి చెప్పుచున్నాడు -

27. రాగీ కర్మఫలప్రేప్సు ర్లుబ్ధో హింసాత్మకోఽశుచిః
హర్షశోకాన్వితః కర్తా రాజసః పరికీర్తితః.

టీక:— రాగీ = అనురాగము (బంధ్వాదులం దభిమానము) గలవాడును, కర్మఫలప్రేప్సుః = కర్మఫలము నాశ్రయించువాడును, లుబ్ధః = లోభియు, హింసాత్మకః = హింసాస్వభావముకలవాడును, అశుచిః = శుచిత్వములేనివాడును, హర్షశోకాన్వితః =(కార్యము సిద్ధించినపుడు) సంతోషముతోను (కార్యము చెడినపుడు) దుఃఖముతోను గూడియుండువాడునగు, కర్తా = కర్త, రాజసః = రాజసకర్తయని, పరికీర్తితః = చెప్పబడియున్నాడు.

తా:— అనురాగము (బంధ్వాదులం దభిమానము) గలవాడును, కర్మఫలము నాశించువాడును, లోభియు, హింసాస్వభావము కలవాడును, శుచిత్వము లేనివాడును, (కార్యము సిద్ధించినపుడు) సంతోషముతోను, (చెడినపుడు) దుఃఖముతోను గూడియుండువాడునగు కర్త రాజసకర్తయని చెప్పబడును.

వ్యాఖ్య:— ఈ పై లక్షణములు గలవాడు రాజసకర్తయని చెప్పబడుటవలన, ఉత్తముడగువాడు ఆ లక్షణములను త్యజించివేయవలెననుట సుస్పష్టము. అనగా బంధ్వాదులందును, ఇతర ప్రాపంచిక పదార్థములందును అనురాగము (అభిమానము) లేకుండవలెను. కర్మఫలమును కోరరాదు. ఏప్రాణిని హింసింపరాదు. అశుభ్రతను త్యజించవలెను. కార్యముయొక్క సిద్ధి, అసిద్ధులందు హర్షశోకములను మనోవికారములు లేకుండ సమచిత్తుడై, ద్వంద్వసహిష్ణువై యుండవలెను. ప్రతివాడును తన హృదయమును పరిశోధించుకొని ఈ పైనదెలిపిన రాజసకర్తయొక్క లక్షణములున్నచో వానిని ప్రయత్నపూర్వకముగ విడనాడి సాత్త్వికకర్తయే అయియుండులాగున చూడవలెను.

ప్ర:— రాజసకర్త యెట్టివాడు?

ఉ:— (1) (బంధ్వాదులందు) అనురాగముగలవాడును (2) కర్మఫలము నాశించువాడును (3) లోభియు (4) హింసాస్వభావముగలవాడును (5) శుచిత్వములేనివాడును (6) (కార్యసిద్ధియందు) సంతోషముతోను, (కార్యవైఫల్యమునందు) దుఃఖముతోను గూడియుండువాడును రాజసకర్తయనబడును.

అ॥ ఇక తామసకర్తయొక్క లక్షణములను వివరించుచున్నాడు -

28. అయుక్తః ప్రాకృతః స్తబ్ధ శ్శఠో నైష్కృతికో ఽలసః★
విషాదీ దీర్ఘసూత్రీ చ కర్తా తామస ఉచ్యతే.

టీక:— అయుక్తః = మనోనిగ్రహము (లేక, చిత్తైకాగ్రత) లేనివాడును, ప్రాకృతః = పామరస్వభావముగలవాడును (అవివేకియు), స్తబ్ధః = వినయములేనివాడును, శఠః = మోసగాడును, నైష్కృతికః = ఇతరులను వంచించి వారికార్యములను పాడుచేయువాడును, అలసః = సోమరితనముగలవాడును, విషాదీ = ఎల్లప్పుడు దిగులుతో నుండువాడును, దీర్ఘసూత్రీ చ = స్వల్పకాలములో చేయవలసినదానిని దీర్ఘకాలమునకైనను పూర్తిచేయనివాడును నగు, కర్తా = కర్త, తామసః = తామసకర్తయని, ఉచ్యతే = చెప్పబడుచున్నాడు.

తా:— మనోనిగ్రహము (లేక చిత్తైకాగ్రత) లేనివాడును, పామర స్వభావము గల వాడును (అవివేకము), వినయము లేనివాడును, మోసగాడును, ఇతరులనువంచించి వారిజీవనములను

★ నైకృతో ఽలసః - పాఠాన్తరము.

పాడుచేయువాడును, సోమరితనముగలవాడును, ఎల్లప్పుడు దిగులుతో నుండువాడును, స్వల్పకాలములో చేయవలసినదానిని దీర్ఘకాలమునకైనను పూర్తిచేయనివాడును నగు కర్త తామసకర్త యని చెప్పబడుచున్నాడు.

వ్యాఖ్య:– 'అయుక్తః' – మనస్సు బహిర్ముఖముగాను, చంచలముగాను నుండువాడు, ఆత్మయందు నిలుకడలేనివాడు, ఏకాగ్రత, నిగ్రహము లేకయుండువాడు అయుక్తుడనబడును. ఆత్మతో, భగవంతునితో గూడియుండనివాడు అయుక్తుడు. అట్టివాని మనస్సు నిగ్రహములేక బయటనే తిరుగాడుచుండును.

'ప్రాకృతః' – ప్రకృతిగుణములు కలవాడు ప్రాకృతుడు. సంస్కారము లేనివాడు పామరుడని అర్థము. ప్రతివాడును తనయందలి ప్రకృతిగుణములను తొలగించుకొని అప్రాకృతుడుగ, దైవస్వరూపుడుగ మారవలెను.

'నైష్కృతికః' – ఇతరుల కార్యములను చెడగొట్టువాడు. ఇతరులను వంచించువాడు. సామాన్యముగ జనులు నాలుగు రకములుగ నుందురు. (1) తన సుఖమునుగూడ చూడక ఇతరులకు మేలుచేయువాడు (2) తన సుఖము చూచుకొనుచు ఇతరులకు హితమొనర్చువాడు (3) తనసుఖము కొఱకు పరులకు కీడుచేయువాడు (4) అనవసరముగా ఇతరులకు కీడుచేయువాడు. మొదటివాడు ఉత్తముడు. రెండవవాడు మధ్యముడు. మూడవవాడు అధముడు. నాల్గవవాడు అధమాధముడు. ఈశ్లోకమున తెలుపబడిన 'నైష్కృతికులు' చివరి రెండు తరగతులకు జెందినవారు.

'అలసః' – సోమరి – భగవానుడు సోమరితనమును తామసగుణముగజెప్పదానిని పారద్రోలవలసినదిగా బోధించుచున్నారు. సోమరి ఏరంగమందును వృద్ధికి రానేరడు. అధ్యాత్మరంగమున సోమరులకు చోటేలేదు.

'విషాదీ' – తామసకర్త ప్రతికార్యమందును ఏడుపుమొగము పెట్టుకొని యుండును. వాస్తవముగ అనంతానందపరిపూర్ణుడగు మానవుడు విషాదయుక్తుడై మూలుగుచుండుట కేవలము అజ్ఞానమువలననే యగును. కావున గంభీరమగు స్వస్వరూపము నెఱింగి విషాదమును పారద్రోలవలెను.

'దీర్ఘసూత్రీ' – మందకొడిగ ప్రవర్తించువాడు. తాబేలు నడకవంటి గమనము గలిగి చిన్నపనిని గంటలతరబడి చేయుచు, లేక అసలేచేయక 'వాయిదా' వేయుచునుండును. తామసకర్త 'తరువాత చూచెదములే' అను ప్రమత్తతతో గూడిన భావము గలిగియుండును. మహాభారతములోని శాంతిపర్వమున భీష్ముడు ధర్మరాజునకు 'దీర్ఘదర్శి, ప్రాప్తకాలజ్ఞుడు, దీర్ఘసూత్రి' అను మూడు చేపలనుగూర్చి బోధించిన విషయమీసందర్భమున జ్ఞప్తికి తెచ్చుకొనుట యుక్తము. ఆ మూడు చేపలలో దీర్ఘదర్శి దూరపు ఆలోచనగలది. ప్రాప్తకాలజ్ఞుడు కొంత ప్రయత్నలోపముగలది. దీర్ఘసూత్రి ఏ ప్రయత్నము చేయని సోమరి. (కథలో అది బెస్తవాని వలలోపడి మరణించును). కాబట్టి ఇట్టి దీర్ఘసూత్రత్వమును, అలసత్వమును, సోమరితనమును ముముక్షువులు దరికిచేర్చరాదు. అమూల్యమగు మానవజన్మను బడసి భగవత్ప్రాప్తికై యత్నింపక సోమరిగ కాలము గడుపుట మహాప్రమాదకరమని యెఱుంగవలెను.

ప్ర:– తామసకర్త యెట్టివాడు?

ఉ:– (1) మనోనిగ్రహము (చిత్తైకాగ్రత) లేనివాడు (2) పామరుడు (3) మొద్దు, వినయము లేనివాడు

(4) మోసగాడు (5) ఇతరుల కార్యములను చెడగొట్టువాడు (6) సోమరి (7) ఎల్లప్పుడు ఏదియోచింతతో దుఃఖముతో గూడియుండువాడు (8) పనులను తెమల్చక దీర్ఘకాలము కొనసాగించువాడు - తామసకర్త యనబడును.

అ॥ బుద్ధి, ధైర్యము - అనువానియొక్క సత్త్వాది త్రివిధరూపములను వేఱువేఱుగ తెలుపబోవుచున్నాడు -

29. బుద్ధేర్భేదం ధృతేశ్చైవ గుణతస్త్రివిధం శృణు
ప్రోచ్యమానమశేషేణ పృథక్త్వేన ధనఞ్జయ!.

టీక:- *ధనంజయ* = ఓ అర్జునా!, *బుద్ధేః* = బుద్ధియొక్కయు, *ధృతేః చ ఏవ*= ధైర్యముయొక్కయు, *భేదమ్* = భేదమును, *గుణతః* = గుణములనుబట్టి, *త్రివిధమ్* = మూడు విధములుగా, *పృథక్త్వేన* = వేఱ్వేఱుగాను, *అశేషేణ* = సంపూర్ణముగాను, *ప్రోచ్యమానమ్* = చెప్పబడుచున్నదానిని, *శృణు* = వినుము.

తా:- ఓ అర్జునా! బుద్ధియొక్కయు, ధైర్యముయొక్కయు భేదమును గుణములనుబట్టి మూడువిధములుగా వేఱ్వేఱుగను, సంపూర్ణముగను చెప్పబడుచున్నదానిని (నీ విపుడు) వినుము.

అ॥ మొట్టమొదట సాత్త్వికబుద్ధిని గూర్చి చెప్పుచున్నాడు -

30. ప్రవృత్తిం చ నివృత్తించ కార్యాకార్యే భయాభయే
బన్ధం మోక్షం చ యా వేత్తి బుద్ధిస్సా పార్థ! సాత్త్వికీ.

టీక:- *పార్థ* = ఓ అర్జునా!, *యాబుద్ధిః* = ఏబుద్ధి, *ప్రవృత్తించ* = ధర్మమందు ప్రవృత్తిని (లేక ప్రవృత్తిమార్గమగు కర్మమార్గమును), *నివృత్తిం చ* = అధర్మమునుండి నివృత్తిని (లేక నివృత్తిమార్గమగు సన్న్యాసమార్గమును), *కార్యాకార్యే* = చేయదగుదానిని,చేయగూడనిదానిని, *భయాభయే* = భయమును, అభయమును (నిర్భయత్వమును), *బంధమ్* = బంధమును, *మోక్షం చ* = మోక్షమును, *వేత్తి* = తెలిసికొనుచున్నదో, *సా* = అట్టిబుద్ధి, *సాత్త్వికీ* = సాత్త్వికమైనది యగును.

తా:- ఓ అర్జునా! ఏ బుద్ధి ధర్మమందు ప్రవృత్తిని (లేక ప్రవృత్తిమార్గమగు కర్మమార్గమును), అధర్మమునుండి నివృత్తిని (లేక నివృత్తిమార్గమగు సన్న్యాసమార్గమును), చేయదగుదానిని, చేయదగనిదానిని భయమును, అభయమును, బంధమును, మోక్షమును తెలిసి కొనుచున్నదో అట్టి బుద్ధి సాత్త్వికమైనది యగును.

వ్యాఖ్య:- సాత్త్వికబుద్ధి మంచి చెడ్డల రెండిటినిగూర్చి తెలిసికొని మంచిని గ్రహించి చెడ్డను వదలివేయుచుండును. అట్లే బంధము, మోక్షము రెండిటిని తెలిసికొని బంధమును పరిత్యజించి మోక్షమునుగూర్చి యత్నించును. అదేవిధమున భయరూపమగు ఈ దృశ్యసంసారస్థితినిజూచి, దానియెడల విరక్తిగలిగి, అభయరూపమగు నిత్యానంద పరమాత్మనే ఆశ్రయించి తరించును. అట్టి సాత్త్వికబుద్ధియే ఉత్తమోత్తమమైనది. కాబట్టి అట్టి బుద్ధి తమకు కలదాయని ప్రతివారును యోచించుకొని భగవద్దృష్టిలో

'బుద్ధిమంతులై' వర్తించుటకు ప్రయత్నించవలెను. ఇట్టి లక్షణములుగల బుద్ధిలేనిచో ఎంతటి పాండిత్యము, లౌకికప్రజ్ఞ యున్నప్పటికిని జనులు బుద్ధికొఱవడినవారే యగుదురు.

ప్ర:– సాత్త్వికబుద్ధి యెట్టిది?

ఉ:– (1) ధర్మప్రవృత్తిని (లేక ప్రకృతిమార్గమును) (2) చేయదగినదానిని, జేయదగనిదానిని (3) భయమును, అభయమును (4) బంధమును, మోక్షమును – వీనిని చక్కగ తెలిసికొనగల బుద్ధియే సాత్త్వికబుద్ధియనబడును.

అ॥ రాజసబుద్ధిని తెలుపుచున్నాడు –

31. యయా ధర్మమధర్మం చ కార్యం చాఽకార్య మేవ చ
అయథావత్ప్రజానాతి బుద్ధిస్సా పార్థ! రాజసీ.

టీక:– పార్థ = ఓ అర్జునా!, యయా = ఏ బుద్ధిచేత, ధర్మమ్ = ధర్మమును, అధర్మమ్ చ = అధర్మమును, కార్యం చ = చేయదగినదానిని, అకార్యం ఏవ చ = చేయరానిదానిని, అయథావత్ = ఉన్నది యున్నట్లుగాక (మఱియొక విధముగ, పొరపాటుగ), ప్రజానాతి = తెలిసికొనుచున్నదో, సా బుద్ధిః = ఆ బుద్ధి, రాజసీ = రాజసమైనది (రజోగుణసంబంధమైనది) యగును.

తా:– ఓ అర్జునా! ఏ బుద్ధిచేత మనుజుడు ధర్మమును, అధర్మమును, చేయదగినదానిని, చేయరానిదానిని, ఉన్నదియున్నట్లుకాక (మఱియొకవిధముగ, పొరబాటుగ) తెలిసికొనుచున్నాడో ఆ బుద్ధి రాజసబుద్ధియైయున్నది.

వ్యాఖ్య:– కొందఱిబుద్ధి ధర్మాధర్మములను, కర్తవ్యాకర్తవ్యములను శాస్త్రములందు బోధింపబడిన రీతిగగాక, పెద్దలగు గురువులు తెలిపినరీతిగాగాక మఱియొక విధముగ పొరబాటుగ గ్రహించును. అట్టిబుద్ధి రాజసమైనది. దానిని సంస్కరించి సాత్త్వికబుద్ధిగా ప్రయత్నముచే మార్చుకొనవలెను.

ప్ర:– రాజస బుద్ధి యెట్టిది?

ఉ:– ధర్మమును, అధర్మమును, కర్తవ్యమును, అకర్తవ్యమును ఉన్నది ఉన్నట్లుకాక పొరబాటుగా తెలిసికొను బుద్ధి రాజసబుద్ధియైయున్నది.

అ॥ ఇక తామసబుద్ధినిగూర్చి వచించుచున్నాడు –

32. అధర్మం ధర్మమితి యా మన్యతే తమసాఽఽవృతా
సర్వార్థాన్విపరీతాంశ్చ బుద్ధిస్సా పార్థ! తామసీ.

టీక:– పార్థ = ఓ అర్జునా!, యా = ఏ బుద్ధి, తమసా = అవివేకముచేత, ఆవృతా = కప్పబడినదై, అధర్మం = అధర్మమును, ధర్మమ్ ఇతి = ధర్మమనియు, సర్వార్థాన్ = సమస్త పదార్థములను , విపరీతాన్ చ = విరుద్ధములుగాను, మన్యతే = తలంచుచున్నదో, సా బుద్ధిః = అట్టిబుద్ధి, తామసీ = తామసమైనది (తమోగుణసంబంధమైనది) యగును.

తా:– ఓ అర్జునా! ఏ బుద్ధి అవివేకముచేత కప్పబడినదై అధర్మమును ధర్మమని యెంచునో, మఱియు సమస్తపదార్థములను విరుద్ధములుగా తలంచునో, అట్టి బుద్ధి తామసబుద్ధియైయున్నది.

వ్యాఖ్య:– తామసబుద్ధి గలవానికి అంతయు తలక్రిందుగనే కనుపించును. వికారమైన అద్దములో ముఖము వికృతముగ గనుపించునట్లును, నీటిలో ప్రతిబింబము తలక్రిందులుగ భాసించునట్లును, తామసబుద్ధియుతున కంతయు విపరీతముగ తోచును. 'సర్వార్థాన్' అని చెప్పినందువలన ఒకవిషయము కాదనియు, నిత్యజీవితములో ప్రతివిషయమున్ను అతనికి విరుద్ధముగ గన్పట్టుననియు తెలియుచున్నది. దీనికంతటికిని కారణమేమి? – 'తమసాఽఽవృతా' – బుద్ధి అవిద్యచే, అజ్ఞానముచే, అవివేకముచే గప్పబడుటయే కారణము. కల్లుత్రాగినవానికి లోకము తిరుగుచున్నట్లు గోచరించు విధమున, మాయామోహమదిరాపానముచే మత్తుడైయున్న అజ్ఞాని కీ జగత్తంతయు వాస్తవముగ గోచరించును. దృష్టాంతమునకు –

(1) లేని దేహము, జగత్తు వారికి ఉన్నట్లు చూపట్టును. ఉన్న ఆత్మ (దైవము) లేనట్లు కన్పించును.

(2) దుఃఖభూయిష్ఠములైన విషయభోగములు వారికి సుఖకరములుగ తోచును. పరమానందదాయక మగు ఆత్మ (దైవము) వారికి రుచింపకయే యుండును.

(3) రక్తమాంసమయమగు క్షణికదేహమందు వారు సౌందర్యబుద్ధి గలిగి యుందురు. సచ్చిదానందఘనమగు శాశ్వతపరమాత్మయందు హేయబుద్ధిని జూపుదురు.

వెయ్యేల, ధర్మమును అధర్మముగ జూచుదురు, అధర్మముగ భావించుచుందురు. దీనికంతటికిని కారణము అవివేకమేయని ఇదివఱలో తెలుపబడియున్నది. కావున ఏ బుద్ధియందు అట్టివిద్య, తమస్సు, కాపురముండునో ఆ బుద్ధి మహానికృష్టమైనదియే యగును – అతడెంతటి భౌతికబలయుతుడైనను, విజ్ఞానసంపన్నుడైనను సరియే. కాబట్టి వివేకము నాశ్రయించి ప్రయత్నపూర్వకముగ అట్టి తమస్సును బుద్ధినుండి పారద్రోలి, సత్యమును సత్యముగను గ్రహించు శక్తిని సంపాదించి కృతార్థుడుకావలయును.

ప్ర:– తామసబుద్ధి యెట్టిది?

ఉ:– అవివేకముచే గప్పబడినదై అధర్మమును ధర్మముగను సమస్త పదార్థములను విరుద్ధములుగను గ్రహించునట్టి బుద్ధియై యున్నది.

అ|| మూడు విధములగు ధైర్యమునుగూర్చి చెప్పబోవుచు మొదట సాత్త్వికధైర్యమును వివరించుచున్నాడు –

33. ధృత్యా యయా ధారయతే మనః ప్రాణేన్ద్రియక్రియాః
యోగేనావ్యభిచారిణ్యా ధృతిస్సా పార్థ! సాత్త్వికీ.

టీక:– *పార్థ* = ఓ అర్జునా!, *అవ్యభిచారిణ్యా* = చలింపని, *యయా ధృత్యా (యుక్తః)* = ఏ ధైర్యముతోగూడినవాడై, *మనఃప్రాణేన్ద్రియక్రియాః* = మనస్సుయొక్కయు, ప్రాణులయొక్కయు, ఇంద్రియములయొక్కయు క్రియలను, *యోగేన* = యోగసాధనచేత (లేక, చిత్తైకాగ్రతచేత), *ధారయతే* =

(విషయములనుండి త్రిప్పి), ఆత్మధ్యానమున, లేక శాస్త్రక్తమార్గమున నిలబెట్టుచున్నాడో, సా ధృతిః = ఆ ధైర్యము, సాత్త్వికీ = సాత్త్వికమైనది.

తా:– ఓ అర్జునా! చలింపని (విషయములందు ప్రవర్తింపని) ఏ ధైర్యముతో గూడిన వాడై మనస్సుయొక్కయు, ప్రాణముయొక్కయు, ఇంద్రియములయొక్కయు క్రియలను యోగసాధనచేత (విషయములనుండి త్రిప్పి ఆత్మధ్యానమున, లేక శాస్త్రోక్తమార్గమున) నిలబెట్టుచున్నాడో, అట్టి ధైర్యము సాత్త్వికమైనది.

వ్యాఖ్య:– ప్రపంచములో ధైర్యముగలవా రనేకులుందురు. కొందఱు యుద్ధమున ధైర్యముతో పోరాడుదురు. కొందఱు ధైర్యముతో నిశీథసమయమున భీకరారణ్యములలో సంచరించుదురు. కొందఱు ధైర్యముతో మహోన్నత పర్వత శిఖరముల నధిరోహించుదురు. సముద్రములను లంఘించుదురు. కాని ఆ ధైర్యములన్నిటికంటెను ఉపరిస్థానమునన్నున్న ధైర్యమొకటి యిచ్చోట చెప్పబడినది. అదియే సాత్త్వికధైర్యము. అనగా ఏధైర్యముచే మనుజుడు తనమనస్సును, ఇంద్రియములను విషయభోగములనుండి నిరోధించునో, దృశ్యవ్యామోహమునుండి నివృత్తుడగునో, ఆదియే గొప్పధైర్యమని భగవానుడిచట సెలవిచ్చెను. కాబట్టి తక్కిన ధైర్యములు కలిగియున్నను, జన్మసాఫల్యకారణమగు ఈ పారమార్థిక ధైర్యమునుగూడ మనుజుడు తప్పక గలిగియుండవలెను.

అయితే ఆ ధైర్యము చపలముగనుండరాదు. ఈ రోజున ఉండి రేపు అదృశ్యముకారాదు. కనుకనే 'అవ్యభిచారిణ్యా' (నిశ్చలమైన) అని చెప్పబడినది. ఏలయనగా కొందఱు ముముక్షువులు ఏదియో యొక ఆవేశములో ధైర్యము కలిగి తమ ఇంద్రియాదులను నిగ్రహించినవారై, మఱల పరిస్థితుల ప్రాబల్యముచే క్రమముగ ఆ ధైర్యమును సడలించి, విషయములందు ప్రవర్తించుట కానంబడుచున్నది. అది 'అవ్యభిచారిణీ ధైర్యము' కాదు. కాబట్టి స్థిరముగ నుండునట్టి ధైర్యమునే అవలంబించవలెను.

ప్ర:– సాత్త్వికధైర్య మెట్టిది?

ఉ:– ఏ నిశ్చలధైర్యముతో గూడి యోగసాధనచే మనుజుడు ఇంద్రియాదులను విషయముల నుండి నిరోధింపగల్గునో అట్టిధైర్యము సాత్త్వికమని చెప్పబడును.

అ॥ రాజసధైర్యమునుగూర్చి చెప్పుచున్నాడు -

34. యయా తు ధర్మకామార్థా న్ధృత్యా ధారయతేఽర్జున!
ప్రసఙ్గేన ఫలాకాంక్షీ ధృతిస్సాపార్థ! రాజసీ.

టీక:– పార్థ = ఓ అర్జునా!, యయా ధృత్యా తు = ఏ ధైర్యముచేత, ఫలాకాఙ్క్షీ = ఫలాపేక్షగలవాడై, ధర్మకామార్థాన్ = ధర్మమును, కామమును, అర్థమును, ప్రసఙ్గేన = మిగులయాసక్తితో, ధారయతే = అనుష్ఠించుచున్నాడో, సా ధృతిః = ఆ ధైర్యము, రాజసీ = రాజసమైనది.

తా:– ఓ అర్జునా! ఏ ధైర్యముతో మనుజుడు ఫలాపేక్షగలవాడై ధర్మమును, అర్థమును, కామమును మిగుల యాసక్తితో అనుష్ఠించుచుండునో, అట్టి ధైర్యము రాజసమై యున్నది.

వ్యాఖ్య:– పురుషార్థములు నాలుగు – (1) ధర్మము (2) అర్థము (3) కామము (4) మోక్షము. ఈ చతుర్విధ పురుషార్థములలో మొదటిమూడుమాత్రమే యిచట తెలుపబడినవి. నాల్గవది యగు మోక్షము చెప్పబడలేదు. దీనినిబట్టి రాజసధైర్యయుతులు మోక్షమునుగూర్చి అంతగా పట్టించుకొనరని విదితమగు చున్నది. కాబట్టి ఈ ధైర్యము పరమార్థదృష్టిలో అంత ఉత్తమమైనదిగాదని తేలుచున్నది. ఇంద్రియములను నిరోధించుటద్వారా మోక్షముకొఱకు యత్నింపజేయునట్టి సాత్త్వికధైర్యమే ఉత్కృష్టమైనది.

ధర్మార్థకామములను మూడు పురుషార్థముల నన్వేషించువారికంటె, నాల్గవపురుషార్థమగు మోక్షము నన్వేషించువాడే శ్రేష్ఠుడు. అయితే చతుర్విధపురుషార్థములందలి మొదటిదియగు ధర్మమున కర్థము సామాన్యధర్మమనియే గ్రహించవలెను. విశేషధర్మము పరమాత్మావలంబనమే, దైవనిష్ఠయే, ఆత్మజ్ఞానమే యగును.

'సఙ్గేన' అని చెప్పక 'ప్రసఙ్గేన' యని చెప్పుటచే అట్టివారా పురుషార్థములందు మిక్కుటమగు నాసక్తిని జూపుదురని తెలియుచున్నది.

ప్ర:– రాజసధైర్య మెట్టిది?

ఉ:– ఏ ధైర్యముచే మనుజుడు ఫలాపేక్షగలవాడై ధర్మార్థకామములను మిగులయాసక్తితో ననుష్ఠించుచుండునో అయ్యది రాజసధైర్యమనబడును.

అ॥ ఇక తామసధైర్యమును పేర్కొనుచున్నాడు –

35. యయా స్వప్నం భయం శోకం విషాదం మదమేవ చ
న విముఞ్చతి దుర్మేధా ధృతిస్సా పార్థ! తామసీ.

టీక:– పార్థ = ఓ అర్జునా!, యయా = ఏ బుద్ధిచేత, దుర్మేధాః = దుర్బుద్ధిగలవాడు, స్వప్నమ్ = నిద్రను, భయమ్ = భయమును, శోకమ్ = దుఃఖమును, విషాదమ్ = సంతాపమును (దిగులును), మదం ఏవ చ = మదమును, న విముఞ్చతి = విడువకయుండునో, సా ధృతిః = ఆ ధైర్యము, తామసీ = తామసమైనది.

తా:– ఓ అర్జునా! ఏ బుద్ధిచేత దుర్బుద్ధియగు మనుజుడు నిద్రను, భయమును, దుఃఖమును, సంతాపమును (దిగులును), మదమును విడువకయుండునో, అట్టి ధైర్యము తామసమైనది.

వ్యాఖ్య:– ధైర్యము గొప్పసుగుణమే. కాని అది దుర్విషయములందు వినియోగింపబడునపుడు నిష్ఫలమైపోవును. తమోగుణయుతుడు ఒకానొక ధైర్యమవలంబించి తన అతినిద్రను, భయమును, దుఃఖమును, దిగులును, మదమును వదలకయే యుండును. ధైర్యమను గొప్ప సుగుణము అట్టి నిద్రాభయాది నికృష్టవస్తుసంపాదనమున వినియోగింపబడుటచే నిరర్థకమైపోయినది. కాబట్టి ఆ ధైర్యమునే సద్వస్తుసంపాదనమునకు, సచ్ఛీలసముపార్జనకు, మోక్షప్రాప్తికి, దైవకరుణను సంపాదించుటకు వినియోగించుట ఉత్తముని ధర్మమైయున్నది. వాల్మీకికి అపారధైర్యము, పట్టుదల కలదు. కాని మొట్టమొదట ఆ ధైర్యమును, పట్టుదలను దుర్వృత్తులందు, పరమహింసాకార్యములందు ఉపయోగించివిఫలుడయ్యెను.

కాని మహనీయుల సాంగత్య ప్రభావముచే తిరిగి ఆ ధైర్యమునే రామనామజపమందును, దైవధ్యానమందును వాడుకొని ధన్యుడయ్యెను.

'దుర్మేధా' - అనిచెప్పుటవలన అతనికి మేధ (తెలివి) యున్నప్పటికిని దానిని వక్రమార్గమున ప్రవేశపెట్టెనని భావము.

'స్వప్నమ్' - (నిద్ర) ఇచట నిద్రయని చెప్పినచోట 'అతినిద్ర' యని భావించుకొనవలెను. ఏలయనిన మితనిద్ర సర్వులకును అవసరమే అయియున్నది.

ప్ర:– తామసధైర్య మెట్టిది?

ఉ:– ఏ ధైర్యముచే దుర్బుద్ధిగలవాడు నిద్రను, భయమును, శోకమును, దిగులును, మదమును విడువకయుండునో అది తామసధైర్యమని చెప్పబడును.

అ॥ ఇక సాత్త్వికసుఖము, రాజససుఖము, తామససుఖము - అను మూడు సుఖములనుగూర్చి వర్ణించుచున్నాడు -

36. సుఖం త్విదానీం త్రివిధం శృణు మే భరతర్షభ!
అభ్యాసాద్రమతే యత్ర దుఃఖాన్తం చ నిగచ్ఛతి.

టీక:– *భరతర్షభ* = భరతకులశ్రేష్ఠుడవగు ఓ అర్జునా!, *యత్ర* = దేనియందు, *అభ్యాసాత్* = అభ్యాసమువలన, *రమతే* = ఆనందమునొందుచున్నాడో, *దుఃఖాన్తం చ* = దుఃఖనాశనమునుగూడ, *నిగచ్ఛతి* = లెస్సగ పొందుచున్నాడో, (*తత్* = అ), *సుఖమ్ తు* = సుఖమునైతే, *ఇదానీమ్* = ఇప్పుడు, *త్రివిధమ్* = మూడువిధములుగా, *మే* = నాయొక్క, (*వచనాత్* = వాక్యములవలన), *శృణు* = వినుము.

తా:– భరతకుల శ్రేష్ఠుడవగు ఓ అర్జునా! దేనియొక్క అభ్యాసముచే మనుజుడు ఆనందము నొందుచుండునో, దుఃఖశాంతినిగూడ లెస్సగ బడయుచుండునో, అట్టి సుఖమిపుడు మూడువిధములుగా నాచే తెలుపబడుచున్నది. వినుము -

వ్యాఖ్య:– 'అభ్యాసాత్' - సాత్త్వికసుఖము, దైవసుఖము, బ్రహ్మానందము అభ్యాసమువలననే జీవునకు లభించగలదని భగవాను డిచట తెలియజేయుచున్నాడు. అధ్యాత్మవిద్య మాటలచే, 'వాచా' జ్ఞానముచే కలుగునదికాదు. అది అనుభవవిద్య (Practical Science). అందలి ప్రతిసిద్ధాంతమును అనుభవములోచూచుకొనవలెను. అపుడే జీవునకు ప్రత్యక్ష సుఖము లభించును. చాలమంది 'మాకు సాక్షాత్కార మెట్లు కలుగును, దుఃఖ మెట్లు తొలగును, సుఖ మెట్లుకలుగును?' అని ప్రశ్నించుచుందురు. భగవాను డందులకు 'అభ్యాసముచేయుడు, మీకవి లభించును' అని యిచట చెప్పుచున్నాడు. ప్రయత్నము చేయక, సాధింపక, ఒడ్డునకూర్చొని మాటలు చెప్పుటద్వారా పరమార్థానుభవమెన్నటికిని కలుగనేరదు. పెరుగును చిలికిననే వెన్నవచ్చును. నువ్వులను పిండిననే నూనెవచ్చును. చెఱకును నమలిననే మాధుర్యమనుభూతమగును. అట్లే అభ్యాసముచేతనే 'దుఃఖాంతము,' సుఖావిర్భావము జీవునకు కలుగగలదు.

'దుఃఖాన్తం చ నిగచ్ఛతి' - ఈ ప్రపంచమున ప్రతిజీవియు కోరునది దుఃఖరాహిత్యము,

దుఃఖాంతము. జీవిత మందలి అతిముఖ్యమైన, క్లిష్టతరమైన సమస్య ఈ దుఃఖాంతసంపాదనమేయగును. ప్రతివానిని ఈ సమస్యయే బాధించుచున్నది. చీమయు ఈ దుఃఖాంతమునకే, అనగా దుఃఖమును పోగొట్టుకొనుటకొఱకే యత్నించుచున్నది. దోమయు దానికొఱకే యత్నించుచున్నది. చతుర్ముఖబ్రహ్మ దానికొఱకే యత్నించుచున్నాడు. దుఃఖముయొక్క అంతమును (దుఃఖరాహిత్యమును) ప్రాణియెచట పొందగలదు? ఈ మహాసంసారిక బాధలన్నియు ఎచ్చోట నుపశమించగలవు? దుఃఖములేనిచోటు ఏది? ప్రపంచములో ఎచట వెతకినను అట్టిచోటు లభించగలదా? శాశ్వతసుఖము నొసంగగల వస్తువు ఈ దృశ్యసమూహమందుకలదా? లేదు. దుఃఖముయొక్క అంత మొక ఆత్మయందే, దైవమందే కలదు. ఆత్మసుఖమందే, సాత్త్వికానందమందే దుఃఖముయొక్క అంతమును జీవుడు పొందగల్గుచున్నాడని ఈ శ్లోకమున చెప్పబడినది. ఈ భగవద్వాక్యమువలన ప్రతి ప్రాణిని వేధించుచున్న 'దుఃఖనివారణసమస్య' తీరిపోయినది. దుఃఖనివారణ కుపాయము సాత్త్వికసుఖసంపాదనమే, ఆత్మానందప్రాప్తియే. కాబట్టి ఆత్మసుఖమునే, దైవసుఖమునే అన్వేషింపవలయును. అది యెట్లు లభ్యమగును? అభ్యాసమువలన, సాధన చతుష్టయరూపసంపత్తిచేత, అమానిత్వాదిగుణములచేత, 'నిగచ్ఛతి' అని చెప్పుటవలన అభ్యాసముచే నట్టి దుఃఖరాహిత్యస్థితిని జీవుడు లెస్సగ బడయగలడని తెలియుచున్నది.

ప్ర:– సుఖ మెన్ని విధములు?

ఉ:– మూడువిధములు. (1) సాత్త్వికసుఖము (2) రాజససుఖము (3) తామససుఖము - అని.

ప్ర:– దుఃఖరాహిత్యము ఎట్లు కలుగును?

ఉ:– అభ్యాసముద్వారా ఉత్తమ (సాత్త్విక) సుఖమును బొందుటచే దుఃఖము సంపూర్ణముగ తొలగిపోగలదు.

అ॥ సాత్త్వికసుఖముయొక్క లక్షణమును వచించుచున్నాడు -

37. యత్తదగ్రే విషమివ పరిణామేఽమృతోపమమ్
తత్సుఖం సాత్త్వికం ప్రోక్త మాత్మబుద్ధిప్రసాదజమ్.

టీక:– యత్ తత్ = ఏ సుఖము, అగ్రే = ఆరంభములో, విషమివ = విషమువలెను, పరిణామే = పర్యవసానమందు (చివరకి), అమృతోపమమ్ = అమృతమును బోలినదిగను నుండునో, ఆత్మబుద్ధి ప్రసాదజమ్ = తన బుద్ధియొక్క నైర్మల్యముచే గలుగునట్టి (లేక ఆత్మవిషయకమైన బుద్ధియొక్క నిర్మలత్వముచే గలుగునట్టి), తత్ సుఖమ్ = ఆ సుఖము, సాత్త్వికమ్ = సాత్త్వికమని, ప్రోక్తమ్ = చెప్పబడినది.

తా:– ఏ సుఖము ప్రారంభమునందు విషమువలెను, పర్యవసానమందు అమృతమును బోలినదిగను నుండునో, తన బుద్ధియొక్క నిర్మలత్వముచే గలుగునట్టి ఆ సుఖము సాత్త్వికమని చెప్పబడినది.

వ్యాఖ్య:– అధ్యాత్మక్షేత్రమున సాధకునకు అభ్యాసకాలమందు ప్రారంభమున బ్రహ్మనిష్ఠ, ధ్యాన, వైరాగ్యాదులు ఒకింత కష్టముగా తోచవచ్చును. కాని అభ్యాసము, సాధన పూర్తియగుకాలమున అమృతతుల్యముగ నుండును. ఆత్మసుఖము నవి కలుగచేయును - అని యిచట వచింపబడినది. కావున

సాధనదశలోగాని, అభ్యాసకాలములోగాని ఎవరికైనను కష్టముకలిగినచో, విసుగు జనించినచో, అధైర్యపడక, అది వాస్తవమగు బాధ కాదనియు, పరిణామమున అనంతానందము కలుగుననియు నిశ్చయించి సాధనను విడనాడక ధైర్యముతో కొనసాగించవలెను. కనుకనే 'విషమివ' అని చెప్పిరేకాని 'విషమ్' అని చెప్పలేదు. అనగా ఆ ప్రారంభకష్టము విషమువలె తోచునేగాని వాస్తవముగ విషముకాదని భావము. ఇచట ప్రయోగించిన 'ఇవ' అను పదమునందు. గొప్ప అర్థముకలదు. 'బాధవలె తోచునేకాని బాధకాద'ని ఆ పదమువలన స్పష్టమగుచున్నది. ఆ తాత్కాలిక బాధకైనను కారణము జన్మార్జితములైన పాపవాసనలకును, అధునిక పుణ్యవాసనలకును, మధ్యగలుగు సంఘర్షణమే యగును. పుణ్యవాసనలు బలమై, పాప వాసనలను తొలగద్రోయునపుడు అవి వెడలి పోవుచు పోవుచు జీవుని గిల్లిపోవును. ఆనొప్పియే ఈ 'విషమివ' అనుదాని యర్థము. అదియే జీవుని ప్రారంభబాధ. వాస్తవముగ అది బాధకాదు. అనుపమ సుఖమునకు నాందియే యగును.

ఒకానొక రోగమునకు 'వేపఉండ' అను మందు ఇచ్చుదురు. అది చేదుగా నున్నను ఆరోగ్యమును గలుగజేయును. ఔషధము సేవించునపుడు అప్రీతిగానున్నను, బలవంతముగా నైనను సేవించవలసినదే ఆరోగ్యముకొఱకు. ఒక ఱాయి దేవవిగ్రహముగా మారుటకు మొదట ఉలిదెబ్బలు తినునట్లును, బంగారము శిరోభూషణముగా మారుటకు స్వర్ణకారుని సుత్తిదెబ్బలు తినునట్లును, అనంతమగు బ్రహ్మానందము ననుభవించుటకుముందు జీవుడొకింత త్యాగము చేయవలసియుండును. అట్లు అల్పసుఖమును వదలునప్పుడు ఒకింత దుఃఖము కలుగవచ్చును. అనేక జన్మలనుండి ఆ విషయసుఖములను బంధువులు జీవుని హృదయగేహములో నివసించుచున్నారు. వారు పోవునపుడు బంధువియోగమందువలె తాత్కాలిక ఆవేదన కొంతకలుగును. అంతమాత్రముతో సాధకుడు బెదరిపోరాదు. కొంత ఓపికబట్టి సాధనను విడువక కొనసాగించినచో ఆ కష్టకాలము తొలగిపోయి సుఖకాల మేతెంచును.

ఒక విద్యార్థిదశలో రేయింబవళ్లు కష్టపడి చదువును. తదుపరి ఉద్యోగకాలమందు సుఖించును. అట్లే అధ్యాత్మరంగమున ఇంద్రియాదులను నిగ్రహించునపుడు, అంతర్యుద్ధఫలితముగ కొంత ప్రయాస కలిగినపుడు దానిని సహించుకొని ముందునకు సాగిపోవలెను. అంతియేకాని భయపడి సాధనను విరమించరాదు. కనుకనే భగవానుడిచట సాత్త్వికసుఖముయొక్క నిజస్థితిని తెలుపుచున్నారు. విషరూపదుఃఖములో అమృతరూప సుఖముయొక్క బీజములున్నవని సెలవిచ్చిరి. తాత్కాలికకష్టరూపమగు ఆ విషము నెట్లెనను దిగమ్రింగివేసినచో వానిలోనగల అమృతబీజము లపుడు మొలకెత్తును. ఇది విషమువలె నున్నదికదాయని పారవేసినచో దానిలోని అమృతబీజములనుగూడ జనులు పోగొట్టుకొనినవారగుదురు. కాబట్టి సాధకు లివ్విషయమున కడుజాగరూకులై యుండి భగవానుని ఈ అమూల్యోపదేశము జ్ఞప్తియందుంచుకొని అనంతాత్మసుఖము తమకై వేచియున్నదని భావించి, కష్టసహిష్ణువులై, త్యాగశీలురై, సాధనను విడువకుండ చేయుచునే యుండవలెను. కనుకనే 'కశ్చిద్ధీరః' - ఏ ఒకానొక ధీరుడో (అన్నికష్టముల నోర్చుకొని) ప్రత్యగాత్మను చూడగలడని ఉపనిషత్తులలో చెప్పబడినది. శ్రీ బుద్ధదేవుడు, శ్రీ రామకృష్ణపరమహంస మున్నగువారి సాధనకాలజీవితములను చూచినచో ఈ సత్యము బోధపడగలదు. మఱియు 'అమృతోపమమ్' - 'అమృతమునుబోలి' అని యిచట చెప్పుటయు చాల సమంజసముగా నున్నది. ఏలయనిన, ఆత్మసుఖము, దైవసుఖమును దేవతల అమృతమును పోలినదేకాని, జడమగు ఆ దేవతల అమృతముకాదు. దానికంటె ఎన్నికోట్ల రెట్లో అధికశక్తివంతమైనదది. దేవతల యొద్దగల అమృతము స్థూలదేహమునకు కొంతకాలము మృతిలేకుండ నివారించును. కాని ఈ ఆత్మసుఖరూపమగు అమృతము శాశ్వతముగ జననమరణ సంసారప్రవాహమునుండి జీవుని తప్పించివేయును.

'ఆత్మబుద్ధి ప్రసాదజమ్' - ఆ సాత్త్వికసుఖము (ఆత్మసుఖము) యెట్లు కలుగగలదు? బుద్ధి నిర్మలముగానున్నచో, విషయదోషము లెవ్వియు లేకయుండినచో, నిర్మలదర్పణమున ప్రతిబింబమువలె ఆత్మసుఖము అందు గోచరింపగలదు. అనుభూతము కాగలదు. కాబట్టి సుఖము నపేక్షించువారు మొట్టమొదట తమబుద్ధిని నిర్మలముగా నొనర్చుకొనవలెను. 'మోక్షమెచటనున్నది, సుఖమెచటనున్నది' అని కొందఱు ప్రశ్నించుదురు. దానికి భగవాను డిచట సమాధాన మొసంగిరి. మోక్షము, దైవసుఖము ఆకాశములో లేదు. పాతాళములో లేదు. నిర్మలమగు తనబుద్ధియందే కలదు. ఈ యర్థమునే శ్రీ వసిష్ఠమహర్షియు శ్రీరామచంద్రున కిట్లు బోధించిరి -

న మోక్షో నభసః పృష్ఠే పాతాలే న చ భూతలే
మోక్షో హి చేతో విమలం సమ్యగ్జ్ఞానవిబోధితం (శ్రీ వసిష్ఠగీత)

ప్ర:- సాత్త్వికసుఖముయొక్క లక్షణమేమి?

ఉ:- ప్రారంభములో (అభ్యాసకాలములో) విషమువలె కష్టముగదోచి తుదకు అమృతమువలె సుఖదాయకముగ నుండునది సాత్త్వికసుఖము.

ప్ర:- అట్టి సాత్త్వికసుఖము జీవున కెట్లుకలుగును?

ఉ:- నిర్మలబుద్ధినుండి ఆ సుఖము జనించును. కావున సుఖాభిలాషి బుద్ధిని నిర్మలమొనర్చుకొనవలయును.

ప్ర:- కాబట్టి జీవుని కర్తవ్యమేమి?

ఉ:- ఆధ్యాత్మికసాధనలు గావించునపుడు కలుగు కష్టములకు జంకక భగవంతునిపై పూర్ణ విశ్వాసముంచి, సాధనను ధైర్యముతో కొనసాగించి, బుద్ధియందు విషయదోషమెద్దియు లేకుండ అద్దానిని సునిర్మలముగా గావించవలెను. అత్తఱి మహత్తరమగు ఆత్మసుఖ మాతనికి అనుభూతము కాగలదు. అదియే మోక్షము.

అ॥ రాజససుఖమును వివరించుచున్నాడు -

38. విషయేన్ద్రియసంయోగా ద్యత్తదగ్రేఽమృతోపమమ్
పరిణామే విషమివ తత్సుఖం రాజసం స్మృతమ్.

టీక:- *యత్తత్* = ఏ సుఖము, *విషయేన్ద్రియసంయోగాత్* = విషయములు, ఇంద్రియములు కలిసికొనుటవలన (వాని సంబంధమువలన), *అగ్రే* = మొదట, *అమృతోపమమ్* = అమృతమును బోలియుండునదియు, *పరిణామే* = పర్యవసానమందు (అనుభవానంతరమున), *విషమ్ ఇవ* = విషమువలె నుండునదియు, (*భవతి* = అగుచున్నదో), *తత్ సుఖమ్* = ఆ సుఖము, *రాజసమ్* = రాజసమని, *స్మృతమ్* = చెప్పబడెను.

తా:- ఏ సుఖము విషయేంద్రియసంబంధమువలన మొదట అమృతమును బోలియు,

పర్యవసానమందు (అనుభవానంతరమున) విషమువలెను నుండుచున్నదో అట్టి సుఖము రాజసమని చెప్పబడినది.

వ్యాఖ్య:— విషయ సుఖము తాత్కాలికమైనది; క్షణికమైనది. ఇంద్రియములకు విషయములకు సంయోగము కలిగినపుడే ఆ సుఖ ముదయించును. మఱల వెంటనే పోవును. మఱియు ప్రారంభములో అమృతముపగిది సుఖముగా తోచినను, పర్యవసానమున విషమువలె దారుణ దుఃఖరూపముగ పరిణమించునని ఇచట తెలుపబడినది. దీనినిబట్టి రాజససుఖము ప్రారంభమున జీవులకు అమృతమువలెతోచుసుఖము అమృతము కాదనియు, పయోముఖవిషకుంభస్థవిషమే యనియు తెలియుచున్నది. విషరూపమగు ఆ అమృతము మహాప్రమాదకరమైనవస్తువు. ఏలయనిన ఆ అమృతములోన విషబీజములు కాపురముండును. ఆ సుఖమందు దుఃఖబీజములు నివసించును. కాబట్టి అట్టి అమృతమును విడనాడనిచో, దానిలో దాగియున్న విషబీజములనుగూడ స్వీకరించవలసివచ్చును. కావున ముముక్షువులు దృశ్యవిషయములద్వారా తమకేదైన సుఖము గలిగినపుడు అది దుఃఖగర్భితమని, చేపయొక్క ఎరలోపలనుండు గాలమువంటిదని నిశ్చయించి దానిని త్యజించివేయవలెను. ఆ సుఖము ఈ జీవితమునేకాక అనేక భావికాల జీవితములనుగూడ నాశనముచేయును. కనుకనే భగవానుడు కరుణించి సాధకులకిచట హెచ్చరికచేయుచున్నారు. ఆ దృశ్యసుఖములయొక్క అసలురంగును గీతాచార్యులు బయటపెట్టుచున్నారు. 'మోసపోకుడు' అని సలహానిచ్చుచున్నారు. అజ్ఞాను లీసత్యము నెఱుగక తృణావృతకూపములమాడ్కికానవచ్చు శబ్దాదిదృశ్యవిషయములనే సేవించి అగాధసంసారకూపములో పడిపోవుచున్నారు.

భగవానుని ఈవాక్యములు జీవులకు అంధకారమునందు వెలుగునిచ్చుచున్నవి. జగత్తుయొక్క వాస్తవస్వరూపమును బోధించుచున్నవి. పైపై తళుకుబెళుకులకు మోసపోగూడదను విషయమును తెలియబఱచుచున్నవి. కావున ముముక్షువులు విషయసుఖమువలన కలుగు ఈ కీడును గుర్తెఱిగి, ఇంద్రియములకు మనస్సునకు ఆ యా విషయములతో నేమాత్రము సంయోగము కలుగకుండ చూచుచుండవలెను. ఒకవేళ జన్మాంతరసంస్కారప్రాబల్యముచే ఇంద్రియములు బయటకు విషయములపై పరుగెత్తినను, వానిని వివేకముతోనే వెనుకకు లాగి ప్రత్యాహరించి ఆత్మయందు నెలకొల్పవలెను.

ప్ర:— రాజససుఖముయొక్క లక్షణమేమి?

ఉ:— మొదట అమృతమువలె మహాసుఖముగ కానుపించి, తుట్టతుదకు (అనుభవానంతరమున) విషమువలె దారుణ దుఃఖరూపముగ పరిణమించుటయే రాజససుఖలక్షణము.

అ॥ ఇక తామససుఖమునుగూర్చి వర్ణించుచున్నాడు –

39. యదగ్రే చానుబన్ధే చ సుఖం మోహనమాత్మనః
నిద్రాలస్యప్రమాదోత్థం తత్తామసముదాహృతమ్.

టీక:— నిద్రాలస్యప్రమాదోత్థమ్ = నిద్ర, సోమరితనము, ప్రమత్తత అనువానివలన బుట్టినదై, యత్ సుఖమ్ = ఏ సుఖము, అగ్రే చ = ఆరంభమందును, అనుబన్ధే చ = అంతమందును (అనుభవించిన తరువాతను), ఆత్మనః = తనకు, మోహనమ్ = మోహమును (అజ్ఞానమును, భ్రమను) గలుగజేయుచున్నదో, తత్ = అది, తామసమ్ = తామససుఖమని, ఉదాహృతమ్ = చెప్పబడినది.

తా:– నిద్ర, సోమరితనము, ప్రమత్తత – అనువానివలన బుట్టినదై, ఏ సుఖము ఆరంభమందును, అంతమందును (అనుభవించిన మీదటను) తనకు మోహమును (అజ్ఞానమును, భ్రమను) గలుగజేయుచున్నదో అది తామససుఖమని చెప్పబడినది.

వ్యాఖ్య:– అతినిద్ర, సోమరితనము (బద్ధకము), ప్రమత్తత – అనువాని వలన కలుగునదియే తామససుఖము. ఇది ఆరంభమునను, మధ్యమునను, అంతమునను గూడ జీవునకు మోహమును (అజ్ఞానమును, భ్రమను) గలుగజేయునదియే యగుటచే అత్యంత నికృష్టమైనది. ఇది జీవుని అజ్ఞానకూపమున ఇంకను అధికముగ త్రోసివేయునది యగుటచే మహాప్రమాదకరమైనది యగును. కావున అతినిద్రతోను, సోమరితనముతోను గూడి అమూల్యమగు ఈ మానవజీవితకాలమును వ్యర్థముగ గడపి వేయువారు సంసారదుఃఖ సౌధప్రాంగణమున అడుగిడినవారేయగుదురు. జననమరణ పరంపరారూపమగు ఈ సంసారమునకు హేతువైన అజ్ఞానరూపబీజము తామస సుఖావలంబులందు నశింపకయేయుండి ఇంకను బలపడుచుండునుగావున అట్టి సుఖము అత్యంత ప్రమాదజనకమైనదియగుటచే సర్వదా త్యాజ్యమేయగును. కాబట్టి భగవానుని ఈ సద్బోధలను గ్రహించి ముముక్షువు లిట్టి తామసిక, రాజసిక సుఖముల రెండిటిని విడిచివేసి సాత్త్వికసుఖమునే అవలంబించి శ్రేయము నొందవలెను.

ప్ర:– తామససుఖముయొక్క లక్షణమేమి?

ఉ:– (1) నిద్ర, సోమరితనము, ప్రమత్తత – వీనివలన కలుగునదియు, (2) ఆరంభమున, అంతమున (అనుభవానంతరమున) గూడ తనకు మోహమును (భ్రమను, అజ్ఞానమును) గలుగజేయునదియు తామససుఖమనబడును.

అ॥ ఈ సత్త్వాది త్రిగుణములతో గూడియుండని వస్తు వీ ముల్లోకములందును ఏదియులేదని వచించుచున్నాడు –

40. న తదస్తి పృథివ్యాం వా దివి దేవేషు వా పునః
సత్త్వం ప్రకృతిజైర్ముక్తం యదేభిస్స్యాత్త్రిభిర్గుణైః.

టీక:– ప్రకృతిజైః = ప్రకృతి (మాయ) నుండి పుట్టినవగు, ఏభిః త్రిభిః గుణైః = ఈ మూడుగుణములచేత, ముక్తమ్ = విడువబడిన, సత్త్వమ్ = వస్తువు, యత్ స్యాత్ = ఏదికలదో, తత్ = అది, పృథివ్యాం వా = భూలోకమందుగాని, పునః = తిరిగి, దివి = స్వర్గమునగాని, దేవేషు వా = దేవతలయందు గాని, న అస్తి = లేదు.

తా:– ప్రకృతి (మాయ) నుండి పుట్టినవగు ఈ మూడుగుణములతో గూడియుండని వస్తు వీభూలోకమునగాని, స్వర్గమందుగాని, దేవతలయందుగాని ఎచటనులేదు.

వ్యాఖ్య:– ముల్లోకములందలి ప్రతివస్తువున్ను సత్త్వరజస్తమస్సులను ఈమూడుగుణములతో గూడియుండుననియు, ఆ గుణములతో గూడియుండని వస్తువు (జీవన్ముక్తుడు తప్ప) ఏదియు ఈ ప్రపంచమున లేదనియు చెప్పుచున్నారు. జీవన్ముక్తులగు మహనీయులుతప్ప తక్కినవారందఱు ఏదియో యొక గుణముతోకాని, గుణములతో గాని గూడియున్నవారే. స్వర్గలోకములో నున్నవారున్ను

త్రిగుణములతో గూడినవారేయనియు, వానినుండి విడుదలపొందినవారు కాదనియు ఈ శ్లోకమున భగవానుడు చెప్పిరి. కాబట్టి వారున్ను బంధముననున్నవారే. వారున్ను ఎప్పటికైనను జ్ఞానాదులను బడసి గుణరహితులు, ముక్తులు కావలసియున్నారు.

'ప్రకృతిజైః' - అని చెప్పినందువలన ఈ మూడు గుణములకు ఉత్పత్తిస్థానము ప్రకృతి, లేక మాయ (అజ్ఞానము) అని స్పష్టమగుచున్నది. ఈ మూడు గుణములలో ఏది యున్నను వారింకను ప్రకృతితో గూడియున్నవారేయని తాత్పర్యము. కావున రజస్తమస్సులను ప్రయత్నాతిశయముచేతను, అభ్యాసప్రాబల్యముచేతను దాటి సత్త్వగుణముయొద్దకు వచ్చి, క్రమముగ గుణాతీత ఆత్మస్థితిని బడయవలెను. అదియే మోక్షము.

ప్ర:– సత్త్వాది త్రిగుణములు దేనినుండి పుట్టినవి?

ఉ:– ప్రకృతినుండి (మాయనుండి, అజ్ఞానమునుండి).

ప్ర:– ఈ గుణములతో గూడని వస్తువేదైన ఈ ప్రపంచమున గలదా?

ఉ:– లేదు (జీవన్ముక్తుడు తప్ప).

ప్ర:– ఇట్టిస్థితి ఈ లోకమందేనా? లేక తదితర లోకములందుగూడనా?

ఉ:– స్వర్గాది ఇతర లోకములందును, దేవతలందును ఇదియే పరిస్థితి.

అ॥ లోకములో జనులకు వారి వారి గుణములనుబట్టి కర్మములు విభజింపబడినవని తెలుపుచున్నాడు -

41. బ్రాహ్మణ క్షత్రియవిశాం శూద్రాణాం చ పరన్తప!
కర్మాణి ప్రవిభక్తాని స్వభావప్రభవైర్గుణైః.

టీక:– పరన్తప = శత్రువులను తపింపజేయు ఓ అర్జునా!, బ్రాహ్మణక్షత్రియవిశామ్ = బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులకు, శూద్రాణాం చ = శూద్రులకును, కర్మాణి = కర్మములు, స్వభావప్రభవైః = వారి వారి (జన్మాంతర సంస్కారము ననుసరించిన) స్వభావము (ప్రకృతి) వలనబుట్టిన, గుణైః = గుణములనుబట్టి, ప్రవిభక్తాని = వేఱువేఱుగా విభజింపబడినవి.

తా:– శత్రువులను తపింపజేయు ఓ అర్జునా! బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులకు వారి వారి (జన్మాంతర సంస్కారము ననుసరించిన) స్వభావము (ప్రకృతి) వలన పుట్టిన గుణములనుబట్టి కర్మలు వేఱువేఱుగా విభజింపబడినవి.

వ్యాఖ్య:– ఇదివఱలో 4వ అధ్యాయమున 13వ శ్లోకమందు చాతుర్వర్ణ్యములవారు వారివారి గుణములనుబట్టి కర్మలనుబట్టి సృష్టింపబడిరని భగవానుడు చెప్పియుండిరి*. ఇప్పుడును ఆ భావమునే

* చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మ విభాగశః (4-13)

వ్యక్తీకరించుచు వారివారి జన్మాంతర సంస్కారము వలన నేర్పడిన గుణముల ననుసరించియే వారివారికి ఆ యా కర్మలు, (వానిననుసరించి ఆ యా వర్ణములు) విభజింపబడినవని తెలియజేయుచున్నారు. దీనినిబట్టి పుట్టుకతోనే జాతి ఏర్పడుటలేదనియు, వారి వారి గుణములనుబట్టియే జన్మ, కర్మలు ఏర్పడుచున్నవనియు స్పష్టమగుచున్నది. ఇట్టి పరిస్థితియందు ప్రతివానికిని ఊర్ధ్వస్థితికి బోవుటకు అవకాశము లభించుచున్నది. అనగా జన్మనా నీచజాతియందు పుట్టినప్పటికి తమ తమ కర్మలయొక్క శుద్ధత్వముచే, పారమార్థిక సాధనాతిశయముచే, పవిత్రతచే ఉత్తమవర్ణస్థులుగా తయారుకావచ్చును. ఈ ప్రకారముగ సర్వులకును ఆధ్యాత్మిక ఉన్నతశిఖరముల నధిరోహించుటకు అవకాశములు కల్పించుట గీతయొక్క ఒకానొక విశిష్టతయై యున్నది.

ప్ర:— బ్రాహ్మణాది వర్ణములు దేనిచే నేర్పడినవి?

ఉ:— వారి వారి గుణములచే.

ప్ర:— చాతుర్వర్ణ్యములవారికి కర్మ లేప్రకారముగ విభజింపబడినవి?

ఉ:— వారి వారి (జన్మాంతర సంస్కారము ననుసరించిన) స్వభావమువలన పుట్టిన గుణములను బట్టి ఆ యా కర్మలు వారికి విభజింపబడినవి.

ప్ర:— పుట్టుకచే జాతి ఏర్పడినదా?

ఉ:— కాదు. వారి వారి కర్మలచే.

అ॥ అట్లు స్వభావమువలన కలుగు ఆ యా కర్మలను పేర్కొనుచున్నాడు -

42. శమో దమ స్తపశ్శౌచం క్షాన్తి రార్జవమేవ చ
జ్ఞానం విజ్ఞానమా స్తిక్యం బ్రాహ్మం కర్మ స్వభావజమ్.

టీక:— *శమః* = అంతరింద్రియనిగ్రహము (మనోనిగ్రహము), *దమః* = బాహ్యేంద్రియనిగ్రహము, *తపః* = తపస్సు, *శౌచమ్* = శుచిత్వము, *క్షాన్తిః* = ఓర్పు, *ఆర్జవమ్ ఏవ చ* = ఋజుత్వము (కపటములేకుండుట, ఋజుమార్గవర్తనము), *జ్ఞానమ్* = శాస్త్రజ్ఞానము, *విజ్ఞానమ్* = అనుభవజ్ఞానము, *ఆస్తిక్యమ్* = దైవమందు, గురువునందు, శాస్త్రమందు నమ్మకము (అనునవి), *స్వభావజమ్* = స్వభావమువలన పుట్టిన, *బ్రాహ్మంకర్మ* = బ్రాహ్మణకర్మయై యున్నది.

తా:— అంతరింద్రియ నిగ్రహము (మనోనిగ్రహము), బాహ్యేంద్రియ నిగ్రహము, తపస్సు, శుచిత్వము, ఋజుమార్గవర్తనము, శాస్త్రజ్ఞానము, అనుభవజ్ఞానము, దైవమందు, గురువునందు, శాస్త్రమందు నమ్మకము గలిగియుండుట (అనునివి) స్వభావము వలన పుట్టిన బ్రాహ్మణకర్మయైయున్నది.

వ్యాఖ్య:— జ్ఞాన, విజ్ఞానముల రెండిటిని ముముక్షువు తప్పక గలిగియుండవలెనని భగవానుడు గీతయందు పెక్కుతావుల పేర్కొనుచున్నారు. కేవలము శాస్త్రజ్ఞానముచాలదు. అనుభవముగూడ నుండవలెను. అనుభవమువలననే మనుజునకు హృదయపరిణామము, ఆనందము కలుగుచుండును. మఱియు జనులకు పరమార్థవిషయములపై విశ్వాసమున్ను ఉదయించుచుండును. కాబట్టి ప్రతివారును

శాస్త్రజ్ఞానముతోబాటు అనుభవజ్ఞానమున్ను సంపాదించవలెను. ఈశ్లోకమున శమదమాదులను తొమ్మిది కర్మలు చెప్పబడియున్నవి. ఆ సత్కర్మల ననుష్ఠించువాడు బ్రహ్మణుడే యగునని భావము. ఇచట 'తపస్సని' చెప్పబడినదాని కర్థము 17వ అధ్యాయమున తెలుపబడిన శారీరక, వాచిక, మానసికతపస్సులే యని గ్రహించునది.

ప్ర:– ఏయే కర్మలు బ్రాహ్మణులకు స్వభావముగ నుండును? (లేక ఏయే కర్మలు బ్రాహ్మణత్వమును నిర్ణయించును)?

ఉ:– (1) అంతరింద్రియ నిగ్రహము (మనోనిగ్రహము) (2) బాహ్యేంద్రియ నిగ్రహము (3) తపస్సు (4) (బాహ్యాభ్యంతర) శుచిత్వము (5) ఓర్పు (6) ఋజుప్రవర్తన (7) శాస్త్రజ్ఞానము (8) అనుభవజ్ఞానము (9) ఆస్తికభావము (దేవునియందు, గురువునందు, శాస్త్రములందు విశ్వాసము) – అను ఈ తొమ్మిది కర్మలున్ను బ్రాహ్మణులకు స్వభావముగ నుండును. లేక, ఇవి కలవాడే బ్రాహ్మణుడనబడును.

అ॥ క్షత్రియుల కర్మలను వివరించుచున్నాడు –

43. శౌర్యం తేజో ధృతిర్దాక్ష్యం యుద్ధేచాప్యపలాయనమ్
దానమీశ్వరభావశ్చ క్షాత్రం కర్మ స్వభావజమ్.

టీక:– *శౌర్యమ్* = శూరత్వము (పరాక్రమము), *తేజః* = తేజస్సు, (*కీర్తి* = ప్రతాపము), *ధృతిః* = ధైర్యము, *దాక్ష్యమ్* = సామర్థ్యము, *యుద్ధే* = యుద్ధమునందు, *అపలాయనమ్ అపి చ* = పాఱిపోకుండుటయు, *దానమ్* = దానము, *ఈశ్వరభావః చ* = (ధర్మపూర్వక) ప్రజాపరిపాలనా శక్తియు (శాసకత్వము), *స్వభావజమ్* = స్వభావమువలన పుట్టిన, *క్షాత్రం కర్మ* = క్షత్రియకర్మ (అయియున్నది).

తా:– శూరత్వము, తేజస్సు (కీర్తి, ప్రతాపము), ధైర్యము, సామర్థ్యము, యుద్ధము నందు పాఱిపోకుండుట, దానము, (ధర్మపూర్వక) ప్రజాపరిపాలనాశక్తి (శాసకత్వము) – ఇయ్యవి స్వభావమువలన పుట్టిన క్షత్రియకర్మయైయున్నది.

వ్యాఖ్య:– 'యుద్ధేచాప్యపలాయనమ్' యుద్ధమునందు పాఱిపోవుట క్షత్రియుని ధర్మముకాదనియు తెలుపబడినది. అయితే బాహ్యయుద్ధ మెపుడో యొకపుడు సంభవించును. కాని అంతర్యుద్ధము మోక్షపర్యంతము సర్వజీవులయందును జరుగుచునే యుండును. మంచికి చెడ్డకు, ధర్మమునకు అధర్మమునకు, దైవసంపదకు అసురసంపదకు సంగ్రామము హృదయమున నిరంతరము సాగుచునే యుండును. బలవత్తరమగు మాయతో జరుగు అట్టి యుద్ధమున ప్రతిమనుజుడు ఇట్టి క్షాత్రమునే ప్రదర్శించ వలసియుండును. అనగా మాయ (ప్రకృతి)తో జరుగుయుద్ధమున వెన్నుచూపరాదు. ముందు వేసిన అడుగును వెనుకకు త్రిప్పరాదు. బాహ్యయుద్ధమున క్షత్రియులు చూపు, ధైర్య, పరాక్రమములకంటె అధికతరములగు ధైర్యసాహసములను మనుజుడు తన అంతర్యుద్ధమున జూపవలసియుండును. అపుడే విజయము కరతలామలకమై జీవుడు మోక్షసామ్రాజ్యాభిషిక్తుడు కాగల్గును. కావున బ్రహ్మతేజము, క్షాత్రవీర్యము – అను నీ రెండిటిని జీవుడు సంపాదించవలసియున్నది. మఱియు లక్ష్యమగు ఆత్మసాక్షాత్కారము, జీవన్ముక్తి పొందువఱకు మనుజుడు వెనుకకు మఱలరాదు. ఇవ్విధమున 'యుద్ధేచాప్య

పలాయనమ్' అను ఈ క్షత్రియ ధర్మసూత్రమును ప్రతివాడును తన అంతర్యుద్ధమున అవలంబించి కృతార్థుడు కావలయును.

ప్ర:– క్షత్రియుని స్వభావజనిత కర్మలెవ్వి?

ఉ:– (1) శూరత్వము (2) తేజస్సు (కీర్తి, ప్రతాపము) (3) ధైర్యము (4) సామర్థ్యము (5) యుద్ధమునందు వెనుకకు మఱలకుండుట (6) దానము (7) ప్రజాపరిపాలనాశక్తి (శాసకత్వము) ఇవి క్షత్రియుని కర్మములు.

అ॥ వైశ్య, శూద్రుల స్వభావజనిత కర్మలను నిరూపించుచున్నాడు –

44. కృషి గోరక్షవాణిజ్యం★ వైశ్యం కర్మ స్వభావజమ్
పరిచర్యాత్మకం కర్మ శూద్రస్యాపి స్వభావజమ్.

టీక:– కృషి = వ్యవసాయము, *గోరక్ష* = గోసరంక్షణము, *వాణిజ్యం* = వర్తకము, స్వభావజమ్ = స్వభావమువలనపుట్టిన (స్వభావసిద్ధమైన), వైశ్యంకర్మ = వైశ్యునికర్మమైయున్నది, అపి = మఱియు, పరిచర్యాత్మకమ్ = సేవారూపమైన, కర్మ = కర్మము, శూద్రస్య = శూద్రునకు, స్వభావజమ్ = స్వభావసిద్ధమైనది.

తా:– వ్యవసాయము, గోసంరక్షణము, వర్తకము వైశ్యునకు స్వభావజనితములగు కర్మలైయున్నవి. అట్లే సేవారూపమైన కర్మము శూద్రునకు స్వభావసిద్ధమై యున్నది.

ప్ర:– వైశ్యుని స్వభావజనిత కర్మలెవ్వి?

ఉ:– (1) వ్యవసాయము (2) గోసంరక్షణము (3) వర్తకము.

ప్ర:– శూద్రుని స్వాభావిక కర్మలెవ్వి?

ఉ:– సేవ.

అ॥ వారి వారి స్వాభావిక కర్మలను చక్కగ నాచరించుటవలన జనులు జ్ఞానయోగ్యతారూపసిద్ధిని బడయగల్గుచున్నారని వచించుచున్నాడు –

45. స్వే స్వే కర్మణ్యభిరత స్సంసిద్ధిం లభతే నరః
స్వకర్మ నిరతస్సిద్ధిం యథా విన్దతి తచ్ఛృణు. 45

టీక:– స్వే స్వే కర్మణి = (పైనదెల్పిన) తన తన స్వాభావిక కర్మమునందు, అభిరతః = ఆసక్తి (శ్రద్ధ) గల, నరః = మనుజుడు, సంసిద్ధిమ్ = జ్ఞానయోగ్యతారూపసిద్ధిని, లభతే = పొందుచున్నాడు, స్వకర్మనిరతః = స్వకీయకర్మమునం దాసక్తిగలవాడు, యథా = ఏ ప్రకారముగా, సిద్ధిమ్ = జ్ఞానయోగ్యతారూపసిద్ధిని, విన్దతి = పొందుచున్నాడో, తత్ శృణు = దానిని వినుము.

★ కృషిగౌరక్ష్యవాణిజ్యం – పాఠాన్తరము

తా:- తన తన స్వాభావిక కర్మమునందాసక్తి (శ్రద్ధ) గల మనుజుడు జ్ఞానయోగ్యతారూపసిద్ధిని బొందుచున్నాడు. స్వకీయకర్మయందాసక్తిగలవాడు జ్ఞానయోగ్యతారూపసిద్ధిని యెట్లు పడయగల్గునో దానిని చెప్పెదను వినుము.

వ్యాఖ్య:- వారివారి స్వాభావిక కర్మలను ఈశ్వరార్పితముగ, (లేక, ఫలాభిలాషా రహితముగ) చేయుటవలన మనుజుడు జ్ఞానయోగ్యతారూపసిద్ధిని పొందగలడని యిట వచింపబడినది. కర్మచే మోక్షసిద్ధి యెట్లు కలుగగలదని చాలమందికి సందేహము కలదు. ఆ సందేహమును భగవాను డిచటను, రాబోవు శ్లోకమందును తీర్చివైచిరి. కర్మను నిష్కామముగ నాచరించుటవలన చిత్తశుద్ధి కలుగగా దానిచే జ్ఞాన మావిర్భవింప మనుజుడు మోక్షసిద్ధిని పొందగల్గుచున్నాడు. ఈ ప్రకారముగ కర్మ (పరంపరారూపమున) మోక్షసిద్ధికి హేతువగుచున్నది. కర్మయోగమందలి ఈగొప్ప రహస్యమును భగవాను డీప్రకారమగు గీతయందు ప్రస్ఫుట మొనర్చిరి.

ప్ర:- జ్ఞానయోగ్యతారూపసిద్ధిని మనుజుడెట్లు పొందగలడు?

ఉ:- తన తన స్వాభావిక కర్మను ఫలాభిసంధిరహితముగ, ఈశ్వరార్పణముగ, నిష్కామముగ నాచరించుటచే చిత్తశుద్ధి గలుగగా, దానిచే జ్ఞానయోగ్యత లభించుచున్నది.

అ॥ స్వకీయ కర్మాచరణచే మనుజుడు జ్ఞానయోగ్యతారూపసిద్ధిని ఎట్లు బడయుగలడో వివరించుచున్నాడు -

46. యతః ప్రవృత్తి ర్భూతానాం యేన సర్వమిదం తతమ్
స్వకర్మణా తమభ్యర్చ్య సిద్ధిం విన్దతి మానవః.

టీక:- యతః = ఎవనివలన, భూతానామ్ = ప్రాణులకు, ప్రవృత్తిః = ఉత్పత్తి మొదలగు ప్రవర్తనము (ప్రవృత్తి) - కలుగుచున్నదో), యేన = ఎవనిచేత, ఇదం సర్వం = ఈ సమస్తప్రపంచము, తతమ్ = వ్యాపింపబడియున్నదో, తమ్ = ఆతనిని (పరమాత్మను), మానవః = మనుజుడు, స్వకర్మణా = తనకర్మముచేత, అభ్యర్చ్య = ఆరాధించి, సిద్ధిమ్ = జ్ఞానయోగ్యతారూపసిద్ధిని, విన్దతి = పొందుచున్నాడు.

తా:- ఎవరివలన ప్రాణులకు ఉత్పత్తి మొదలగు ప్రవర్తనము (ప్రవృత్తి) కలుగుచున్నదో, ఎవరిచేత ఈ సమస్తప్రపంచము వ్యాపింపబడియున్నదో, వారిని (అట్టి పరమాత్మను), మనుజుడు స్వకీయ కర్మముచే నారాధించి జ్ఞానయోగ్యతారూపసిద్ధిని పొందుచున్నాడు.

వ్యాఖ్య:- 'యతః ప్రవృత్తిర్భూతానామ్' - ఎవరినుండి సమస్త ప్రాణికోట్లకు ఉత్పత్తి మొదలగునవి కలుగుచున్నవో. అని చెప్పుటవలన, సమస్తజీవులకును ఆధారభూతుడు ఆ పరమాత్మయే యని స్పష్టమగుచున్నది. జడమైన వస్తువు చైతన్యముయొక్క సహాయములేనిదే ఏమియు చేయజాలదు. జడమగు ప్రకృతి చిద్రూప పరమాత్మవలననే స్పందించుచున్నది. (మయాధ్యక్షేణప్రకృతిస్సూయతే స చరాచరమ్). కాబట్టి జీవులు తమ సమస్తమునకును కారణభూతుడైన ఆ పరాత్పరునియెడల అపారభక్తిశ్రద్ధలు గలిగి వారినే యారాధించుచు పరమశ్రేయము నొందవలెను.

'యేన సర్వమిదం తతమ్' - ఇదే వాక్యము గీతయందు మూడు పర్యాయములు ప్రయోగింపబడినది. 'దేనిచేత ఈ సమస్తప్రపంచము వ్యాపింపబడియున్నదో' అని దానియర్థము. పరమాత్మ సర్వవ్యాపకులై యుండుటవలన ఈ ప్రపంచమున వారు లేనిచోటు లేదని నిశ్చితమగుచున్నది. పాలలో వెన్నవలె వారు సర్వత్రవ్యాపించియున్నారు. స్థూలనేత్రమునకు వారు గోచరముకాకున్నను, జ్ఞానేనేత్రమునకు సర్వత్ర గోచరించుదురు. ఈ ప్రకారముగ అణువణువునందును భగవంతుడు వ్యాపించియుండుటచే, సర్వ సాక్షియై సమస్తము పరికించుచుండుటచే జీవులాతని సాన్నిధ్యమును సర్వత్ర యనుభూతమొనర్చుకొనుచు, పాపకృత్యము లెవ్వియు చేయక, భక్తిభావ సమన్వితులై యుండవలెను.

'స్వకర్మణా తమభ్యర్చ్య' - మనుజుడు మోక్షసిద్ధిని కర్మాచరణముద్వారా ఎట్లు పొందగలడను ప్రశ్నకు భగవాను డిచట చక్కగ సమాధానమొసంగిరి - 'నీవు నీ కర్మ చేసికొనుచు దైవమును ఆరాధించుచుండుము, స్మరించుచుండుము, ఈశ్వరార్పణముగా నీ కర్మముల నాచరింపుము. అనగా నీ కర్మలద్వారా పరమాత్మను ఆరాధింపుము. అట్టిచో నీవు జ్ఞానసిద్ధిని, తద్ద్వారా మోక్షసిద్ధిని బడయగలవు' - అని భగవానుడిచట బోధించిరి. ఈ ప్రకారముగ కర్మను ఈశ్వరార్పణబుద్ధితో చేయునపుడే చిత్తశుద్ధిద్వారాయది జ్ఞానావిర్భావమునకు హేతువై మోక్షప్రదమగును. అట్లుకాక ఫలాభిలాషతో చేసినచో కర్మ మోక్షహేతువు కానేరదు. 'కర్మనుచేయుము కాని ఫలమును ఈశ్వరార్పణము గావింపుము' - ఇదియే కర్మద్వారా ఈశ్వరుని యారాధించుట. అనగా భగవత్ప్రీత్యర్థము కర్మలనాచరించవలెనని భావము.

కర్మచే మోక్షము లభించునా యని కొందఱు ప్రశ్నించుదురు. 'లభించును, కాని, దానిని చేయవలసిన పద్ధతిలో చేసిననే లభించును' అని తెలియవలెను. ఆపద్ధతి యేదియనిన, ఆ కర్మచే భగవంతుని అర్చించవలెను. అనగా ఆ కర్మనాచరించి తత్ఫలితమును భగవంతున కర్పించవలెను. నిష్కామముగ (భగవదర్పితముగ) కర్మాచరణ చేయవలెనని భావము. అత్తఱి కర్మయందలి దోషము తొలగిపోయి చిత్తశుద్ధిద్వారా యది మోక్షసాధనముగ పరిణమించును. ఇదియే కర్మమార్గమందుగల కీలకము. ఆ కీలకమును, ఆకర్మరహస్యమును భక్తులపై కరుణచే భగవంతు డిచట వెల్లడిచేసివైచిరి. 'ఓ జీవుడా!, కర్మ చేయుము. కాని ఈశ్వరార్పణబుద్ధితో చేయుము. ఆ కర్మచే ఈశ్వరుని యారాధించుము. ఫలితములను కోరకుము. కర్మచేయుటయే నీ వంతు. ఫలితమును భగవంతునకే అర్పింపుము' అని యిచట చక్కగ బోధింపబడినది. ఈ పద్ధతిద్వారా కర్మ తనకర్మత్వమును పోగొట్టుకొని, తన బంధరూపమును తొలగించుకొని మోక్షహేతువుగా మారిపోవుచున్నది. దీనినిబట్టి కర్మ నింద్యముకాదనియు, కర్మమార్గము నికృష్టముకాదనియు, దాని నాచరించుపద్ధతిని తెలిసికొనినచో అది తక్కిన భక్తిజ్ఞానాదులవలె పరమ పవిత్రమగు ఒకానొక మోక్షసాధనము కాగలదనియు ఈశ్లోకముద్వారా స్పష్టమగుచున్నది.

కాని 'స్వకర్మణా తమభ్యర్చ్య' (స్వకీయకర్మచే భగవంతుని ఆరాధించుట) - అను ఈ పద్ధతిని జనులు సరిగా గమనించక, దైవార్పితముగ కర్మలు చేయుట మాని కామ్యబుద్ధితో జేయుచున్నారు. అందువలన కర్మ బంధనరూపముగా మారిపోవుచున్నది. భగవానుడో, కర్మను మోక్షరూపముగ మార్చవచ్చునని తెలిపి దాని కిచట ఉపాయమునుగూడ సెలవిచ్చిరి. కాబట్టి ముముక్షువులెల్లరు ఈ సత్యమును జ్ఞాపకము నందుంచుకొని, ఈ భగవద్వాక్యములపై విశ్వాసముంచి తాము చేయు సమస్తకర్మలను ఈశ్వరార్పణబుద్ధితో, భగవత్కైంకర్యబుద్ధితో చేయవలయును. అట్లు చేసినచో 'సిద్ధింవిన్దతి మానవః' అనునట్లు మానవుడు జ్ఞానసిద్ధిని, మోక్షసిద్ధిని తప్పక బడయగలడని గీతాచార్యులు ఘంటాపథముగ తెలుపుచున్నారు.

ఈ శ్లోకమున కర్మ, భక్తి, జ్ఞానములయొక్క సముచ్చయము తెలుపబడినది. ఎట్లనిన -

1. కర్మనాచరించుట - (కర్మ)
2. దానిద్వారా భగవంతుని ఆరాధించుట (భక్తి)
3. అట్లు ఆరాధించుటచే చిత్తశుద్ధికలుగ జ్ఞానమావిర్భవించుట (జ్ఞానము)

కర్మయను ప్రమిదలో భక్తియను తైలమునుపోసి ధ్యానమను వత్తినిబెట్టి జ్ఞానమను జ్యోతిని వెలిగించవలెను.

ప్ర:- సమస్త ప్రాణికోట్లు ఎవనినుండి ఉత్పత్తిని బొందుచున్నవి?

ఉ:- పరమాత్మనుండి.

ప్ర:- ఈ ప్రపంచమంతయు ఎవనిచే వ్యాప్తమైయున్నది?

ఉ:- పరమాత్మచే.

ప్ర:- జీవుడు మోక్షసిద్ధిని యెట్లు పడయగలడు?

ఉ:- స్వకీయకర్మచే భగవానుని ఆరాధించినచో, అనగా ఈశ్వరార్పణబుద్ధితో (నిష్కామముగ) కర్మలను ఆచరించినచో చిత్తశుద్ధిద్వారా జ్ఞానమును, దానిచే మోక్షమును బడయును.

అ॥ స్వధర్మాచరణము చాల ఉత్తమమైనదని వచించుచున్నాడు -

47. శ్రేయాన్స్వధర్మో విగుణః పరధర్మాత్స్వనుష్ఠితాత్
స్వభావనియతం కర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషమ్.

టీక:- *స్వధర్మః* = తనయొక్క ధర్మము, *విగుణః (అపి)* = (తన అవివేకముచే) గుణము లేనిదిగ కనబడినను (లేక, అసంపూర్ణముగ అనుష్ఠితమైనను), *అనుష్ఠితాత్* = చక్కగా అనుష్ఠింపబడిన, *పరధర్మాత్* = ఇతరుల ధర్మముకంటె (లేక ఇతర ధర్మములకంటె), *శ్రేయాన్* = శ్రేష్ఠమైనది, *స్వభావనియతమ్* = స్వభావముచే ఏర్పడిన (తన ధర్మమునకు తగిన), *కర్మ* = కర్మమును, *కుర్వన్* = చేయుచున్నయెడల, *కిల్బిషమ్* = పాపమును, *న ఆప్నోతి* = పొందడు.

తా:- తనయొక్క ధర్మము (తన అవివేకముచే) గుణములేనిదిగ కనబడినను (లేక, అసంపూర్ణముగ అనుష్ఠింపబడినను) చక్కగా అనుష్ఠింపబడిన ఇతరుల ధర్మముకంటె (లేక, ఇతర ధర్మములకంటె) శ్రేష్ఠమైనదే యగును. స్వభావముచే ఏర్పడిన (తన ధర్మమునకు తగిన) కర్మమును చేయుచున్నయెడల మనుజుడు పాపమును పొందనేరడు.

వ్యాఖ్య:- స్వకీయకర్మ, లేక తన ధర్మము ఆచరించుట ఒకింత కఠినమైనను, తేలికగా ఆచరింపబడినట్టి ఇతరుల కర్మను గ్రహించుటకంటె అది ఎంతయో మేలని చెప్పబడినది. కావున నిజధర్మమును ఒకింత కష్టమైనను వదలరాదు. స్వకీయ కర్మను పైశ్లోకమందు తెలుపబడిన చందమున ఈశ్వరార్పణబుద్ధితో చేసినచో మనుజుడు పాపమును బొందకుండును.

(లేక, ఇచట స్వధర్మమనగా ఆత్మకు సంబంధించిన ధర్మమనియు చెప్పవచ్చును. ఆత్మచింతనాదులు, ఆత్మధ్యానాదులు ఒకింత ప్రయాసముగా తోచినను, పరధర్మములైన దృశ్యవస్తుధర్మములను, లేక, దృశ్యవస్తుచింతనమును గ్రహించుటకంటె ఎంతయో మేలైనవి. ఆత్మచింతనాదులు (స్వధర్మము) ప్రారంభమున ఒకింత కష్టముగ తోచినను తుదకు అనంత సౌఖ్యమును ప్రసాదించును. దృశ్యవస్తువులు (పరధర్మము) ప్రారంభమున సుఖవంతములుగ తోచినను తుదకు పరమదుఃఖమునే కలుగజేయును. కావున పరధర్మముకంటె స్వధర్మమే మేలని చెప్పబడినది.)

ప్ర:– జీవునకు ఏ కర్మము, ఏ ధర్మము శ్రేష్ఠమైనది?

ఉ:– ఒకింతకష్టముగా తోచినను స్వకీయకర్మమే శ్రేష్ఠమైనది.

ప్ర:– దేనిచే మనుజుడు పాపమును బొందకుండును?

ఉ:– స్వభావముచే ఏర్పడిన కర్మమును, స్వధర్మమును (ఈశ్వరార్పణబుద్ధితో) చక్కగ నాచరించినపుడు పాపమును బొందకుండును.

అ॥ స్వకీయకర్మము (స్వధర్మము) ఒకవేళ దోషముతో గూడియున్నదైనప్పటికిని దానిని వదలరాదని చెప్పుచున్నాడు –

48. సహజం కర్మ కౌన్తేయ! సదోషమపి న త్యజేత్
సర్వారమ్భా హి దోషేణ ధూమేనాగ్నిరివావృతాః.

టీక:– కౌన్తేయ = ఓ అర్జునా!, సహజమ్ = స్వభావసిద్ధమైన, కర్మ = కర్మము, సదోష మపి = దోషముతో గూడినదైనను (దృశ్యరూపమైనను, లేక, త్రిగుణాత్మకమైనను), న త్యజేత్ = విడువగూడదు, ధూమేన = పొగచేత, అగ్నిః ఇవ = నిప్పువలె, సర్వారమ్భాః = సమస్తకర్మములు, దోషేణ = (త్రిగుణములయొక్క) దోషముచేత, ఆవృతాః హి = కప్పబడియున్నవికదా!

తా:– ఓ అర్జునా! స్వభావసిద్ధమగు కర్మము దోషయుక్తమైనను (దృశ్యరూపమైనను, లేక త్రిగుణాత్మకమైనను) దానిని వదలరాదు. పొగచేత అగ్ని కప్పబడునట్లు సమస్తకర్మములును (త్రిగుణములయొక్క) దోషముచేత కప్పబడియున్నవికదా!

వ్యాఖ్య:– కర్మ యనునది ఇంద్రియాదులచే చేయబడునదిగనుక దృశ్యమం దంతర్భూతమైనది. త్రిగుణాత్మకమైనది. ప్రకృతి (మాయ) యందు వర్తించునది. కనుకనే 'దోషేణ' అని చెప్పబడినది. కాబట్టి ఆత్మకాని దోషము, దృశ్యరూపమగు దోషము, త్రిగుణాత్మకమైన దోషము ప్రతికర్మయందును గలదు. అందుచేతనే 'సర్వారమ్భాహి' (సమస్తకర్మలును) అని తెలుపబడినది. కావున పొగచే అగ్ని కప్పబడి యుండునట్లు సమస్తకర్మలు (దృశ్యరూపములు కనుక) ఈ దృశ్యరూప దోషముచే గప్పబడియున్నవి. అయినను స్వభావసిద్ధములగు కర్మలను వదలరాదు. ఏలయనగా వానిని నిష్కామ బుద్ధితో, భగవదర్పితబుద్ధితో నాచరించినచో అవి చిత్తశుద్ధిద్వారా జ్ఞానమును, మోక్షమును గలుగజేయగలవు. అయితే పాపకార్యములను మాత్రము చేయరాదు. సమస్తకర్మములును 'మాయా' రూప దోషముచే

నావరింపబడియున్నప్పటికిని, అందు శుద్ధకర్మచే అశుద్ధకర్మను, పుణ్యకర్మచే పాపకర్మను, నిష్కామకర్మచే సకామకర్మను తొలగించివేసి ఆ పిదప క్రమముముగ సాధనాతిశయముచే ఇంకను పైకిపోయి నైష్కర్మ్యాత్మరూపమున చేరవలయును.

ఈ విషయమును మఱియొకదృష్టితోగూడ విచారించవచ్చును. వారువారు చేయుకొన్ని కార్యములందు పంచసూనాది అనివార్యదోషము లేర్పడుచుండును. జీవితయాత్రకై ఆ యా కార్యములను జనులు తప్పక చేయవలసియేయున్నారు. కావున ఆ యా దోషముల నివారణకై పంచవిధ ప్రాయశ్చిత్తము లేర్పడినవి.

దోషము (పంచసూనములు)	ప్రాయశ్చిత్తము (పంచమహాయజ్ఞములు)
1. ధాన్యమును ఉత్పత్తి చేయునపుడు సంభవించు ప్రాణిహింస	1. బ్రహ్మయజ్ఞము - వేదాధ్యయనాదులను జేయుట
2. విసరునపుడు	2. పితృయజ్ఞము - పితృదేవతలను తర్పణాదులచే తృప్తిపఱచుట
3. కట్టెలు నరకునపుడు వానిచే వంటవండునపుడు.	3. దేవయజ్ఞము - హోమము మున్నగునవి చేయుట
4. జలము తెచ్చునపుడు, కాచునపుడు	4. భూతయజ్ఞము - ప్రాణులకు అన్నాదుల నొసంగుట
5. ఊడ్చునపుడు	5. మనుష్యయజ్ఞము - అతిథులను, బ్రహ్మనిష్ఠులను, దీనులను భోజనాదులచే తృప్తిపఱచుట.

ఈ ప్రకారముగ కర్మలవలన గలుగు ఆ యా అనివార్యదోషములు పుణ్యకార్యములచే, నిష్కామకార్యములచే తొలగిపోగలవు. ఇంతియేకాక బ్రహ్మవిచారణ, ఆత్మధ్యానము మున్నగు మహోన్నత పవిత్రకార్యములచే జీవులందలి ప్రకృతి దోషములు లెస్సగ తుడిచిపెట్టుకొని పోగలవు. కావున వారి వారి స్వభావసిద్ధ కార్యమునందు ప్రకృతిజన్యములగు దోషములున్నప్పటికిని వానిని త్యజించక, నిష్కామబుద్ధితో వానినాచరించుచుండినచో క్రమముగ హృదయము నిర్మలమై జీవునకు జ్ఞానప్రాప్తి ఉత్తమ బ్రహ్మపదప్రాప్తి సిద్ధించగలవు.

అ॥ 41వ శ్లోకమునుండి ఇంతవఱకు కర్మయోగమును గూర్చిన విచారణ గావించి, ఇక ఇక్కడనుండి జ్ఞానయోగమును గూర్చిన (సాంఖ్యయోగమును, లేక సన్న్యాసయోగమును) గూర్చిన విచారణను గావించుచున్నాడు -

49. అసక్తబుద్ధిస్సర్వత్ర జితాత్మా విగతస్పృహః
నైష్కర్మ్యసిద్ధిం పరమాం సన్న్యాసేనాధిగచ్ఛతి.

టీక:- సర్వత్ర = సమస్తవిషయములందును, అసక్తబుద్ధిః = తగులుబాటు నొందని బుద్ధి గలవాడును (తనదనెడి అభిమానము లేనివాడును), జితాత్మా = మనస్సును జయించినవాడును (మనోనిగ్రహము గలవాడును), విగతస్పృహః = ఆశలేనివాడును (కోరికలు నశించినవాడును) (అగు మనుజుడు), సన్న్యాసేన = సంగత్యాగముచే (లేక కర్మఫలత్యాగముచే, లేక జ్ఞానమార్గముద్వారా), పరమామ్ = సర్వోత్కృష్టమైన, నైష్కర్మ్యసిద్ధిమ్ = నిష్క్రియమైన ఆత్మస్థితిని, అధిగచ్ఛతి = పొందుచున్నాడు.

తా:– సమస్తవిషయములందును తగులుబాటునొందని (అసక్తమగు) బుద్ధిగలవాడును, మనస్సును జయించినవాడును, కోరికలు లేనివాడునగు మనుజుడు సంగత్యాగముచే (జ్ఞానమార్గముచే) సర్వోత్కృష్టమైన నిష్క్రియాత్మస్థితిని పొందుచున్నాడు.

వ్యాఖ్య:– ఇంతవఱకు నిష్కామకర్మయోగమును ప్రతిపాదించుచువచ్చి ఇటనుండి జ్ఞానయోగ (సాంఖ్యయోగ) విచారణయందు **ప్రవేశించుచున్నారు.** కొన్ని సుగుణములు చెప్పి, అవి కలవాడు నిష్క్రియపరమాత్మస్థితిని బొందగల్గునని వచించుచున్నారు. అవి యేవియనగా (1) దేనియందును తగుల్కొనని బుద్ధిగలిగియుండుట (2) మనస్సును జయించుట (3) ఆశ లేకుండుట.

'సర్వత్ర' – అని చెప్పుటచే ఏవస్తువునందును, ఏ కాలమందును బుద్ధి తగుల్కొనరాదనియు, సర్వత్ర అసక్తుడై మెలగవలెననియు భావము. ఏలయనగా కొందఱు కొన్ని విషయములందు విరక్తులైయున్నను, కొన్నిటియందు ఆసక్తులై యుందురు. అట్లే కొందఱు ధ్యానకాలమందు అసక్తచిత్తులైయున్నను, బహిఃప్రపంచములో ప్రవేశించునపుడు విషయములందు సక్తత గలిగియుందురు. అట్టిదేమియు లేకుండుటకుగాను, 'సర్వత్ర' అని ఉపదేశింపబడినది.

'జితాత్మా' – తన మనస్సును జయించినవాడు ప్రపంచమునంతను జయించినట్లే. అట్లు మనస్సును జయించనివాడు ప్రపంచమునంతను జయించినను పరతంత్రుడేయగును. దుఃఖ మాతనిని వీడదు. కాబట్టి బయటి శత్రువులతోబాటు అంతఃశత్రువులనుగూడ జయించవలెను. లేనిచో 'భోక్తుర్గళే కణ్టకవత్ప్రతీతమ్' – అని శ్రీ శంకరులు చెప్పినట్లు, దుష్టమనస్సు 'భుజించువాని కంఠమున తగుల్కొనిన ముల్లువలె' బాధించును. కాబట్టి వివేకవంతులు మున్ముందు తన మనస్సును, ఇంద్రియములను ప్రయత్నపూర్వకముగ జయించవలెను.

'విగతస్పృహః' – దృశ్యపదార్థముల వేనియందును కోరిక, ఆశ యుండరాదు. అపుడే మనస్సు బయటకుపరుగెత్తక అంతర్ముఖమై ఆత్మయందు నెలకొనును. చంచల చిత్తముచే ఆత్మానుభూతి యెన్నటికిని కలుగదు. చిత్తము నిశ్చలముగా నుండవలెనినిన కోరికలు నశించవలెను. కనుకనే 'విగతస్పృహః' (ఆశ, కోరికలు లేకుండవలెను) అని చెప్పబడినది.

'నైష్కర్మ్యసిద్ధిమ్' – మోక్షము నిచట నైష్కర్మ్యస్థితియని వర్ణించిరి. అనగా సమస్తకర్మలు రహితమైన ఆత్మస్థితియని అర్థము. దేహము ఇంద్రియములు, మనస్సు అన్నిటిని దాటిన స్థితిగనుక అట్టి ఆత్మస్థితియందు కర్మ సంభవింపమి అద్దానిని నైష్కర్మ్యమని చెప్పిరి. అట్టి నైష్కర్మ్యరూపమగు ఆత్మస్థితి త్యాగము (సన్న్యాసము) చేతనే లభించునని ఇట తెలుపబడినది. దేని త్యాగము? కర్మఫలత్యాగము, విషయవాంఛా త్యాగము, సంగపరిత్యాగము. దీనినిబట్టి కర్మఫలత్యాగముచే, విషయాశాపరిత్యాగముచే క్రమముగ కర్మరహిత (నైష్కర్మ్య, లేక కర్మాతీత) మోక్షపదవి లభించగలదని స్పష్టమగుచున్నది.

'పరమామ్' – అని చెప్పుటచే ఆ యాత్మస్థితి అన్ని పదవులకంటెను, అన్ని సిద్ధులకంటెను శ్రేష్ఠతమమైనదని విదితమగుచున్నది.

ప్ర:– నైష్కర్మ్యసిద్ధియనగా నేమి?

ఉ:– నిష్క్రియ ఆత్మస్థితి, మోక్షము.

ప్ర:– అది యెట్లు లభ్యమగును?

ఉ:– (1) దేనియందును తగుల్కొనని బుద్ధిగలిగియుండుటచేతను (2) మనస్సును జయించుట చేతను (3) ఆశలు లేకుండుటచేతను (4) త్యాగబుద్ధి చేతను, (సర్వకర్మఫలత్యాగము, సంగపరిత్యాగముచేతను) అట్టి నైష్కర్మ్యరూపమోక్షస్థితి లభించును.

ప్ర:– ఆ మోక్షస్థితి యెట్టిది?

ఉ:– అన్ని సిద్ధులలోను, పదవులలోను ఉత్కృష్టమైనది.

ప్ర:– కర్మముచే నైష్కర్మ్యము (మోక్షము) నెట్లు పొందవచ్చును?

ఉ:– ఫలత్యాగపూర్వకముగ కర్మలనుచేయుటవలన చిత్తము శుద్ధమగుటచేతను, పైన దెల్పిన మనోనిగ్రహాదుల నభ్యసించుటచేతను జీవుడు క్రమముగ నైష్కర్మ్యస్థితిని (మోక్షమును) బొందగల్గుచున్నాడు.

50. సిద్ధిం ప్రాప్తో యథా బ్రహ్మ తథాஉఽప్నోతి నిబోధ మే
సమాసేనైవ కౌన్తేయ! నిష్ఠా జ్ఞానస్య యా పరా.

టీక:– కౌన్తేయ = ఓ అర్జునా! సిద్ధిమ్ = (నిష్కామకర్మయోగానుష్ఠానముచే కలుగు చిత్తశుద్ధిరూపమగు) కర్మసిద్ధిని, ప్రాప్తః = పొందినవాడు, యథా = ఏ ప్రకారముగ, బ్రహ్మ = పరమాత్మను, ఆప్నోతి = పొందుచున్నాడో, తథా = ఆ విధమును, జ్ఞానస్య = జ్ఞానముయొక్క, పరా = శ్రేష్ఠమైన, నిష్ఠా = (లేక పరాకాష్ఠ, పర్యవసానము), యా = ఏదికలదో (దానినిన్ని), సమాసేన ఏవ = సంక్షేపముగానే, మే = నా వలన, నిబోధ = తెలిసికొనుము.

తా:– ఓ అర్జునా! కర్మసిద్ధిని (నిష్కామకర్మలచే చిత్తశుద్ధిని) బడసినవాడు పరమాత్మ నే ప్రకారముగ పొందగలడో ఆవిధమును, మఱియు జ్ఞానముయొక్క శ్రేష్ఠమైననిష్ఠ (లేక పర్యవసానము) ఏది కలదో దానినిన్ని (జ్ఞాననిష్ఠను, లేక జ్ఞాన పరాకాష్ఠను) సంక్షేపముగ నావలన దెలిపికొనుము.

వ్యాఖ్య:– 'పరబ్రహ్మమును పొందు విధానమును, జ్ఞానముయొక్క పరాకాష్ఠను తెలుపబోవుచున్నానని భగవానుడు సెలవిచ్చుటవలనను గీత పరిసమాప్తము కాబోవుచున్నందున గీతాసారమంతయు సంక్షేపముగ (సమాసేనైవ) తెలుపబడనున్నందువలనను ఈ ఘట్టము అతిముఖ్యమైయున్నది. దీనిని ముముక్షువులు బహుజాగ్రతగ గమనింపవలయును. ఏలయనిన గీతసార మిచట తెలుపబడుచున్నది.

'సమాసేనైవ' – యుద్ధమారంభింపబడనున్నందున, ఇక అధికముగా చెప్పుటకు సమయము లేనందుచే సంక్షేపముగ తెలుపదలంచి యుండవచ్చును. లేక ఇంతవఱకు అనేక ధర్మరహస్యములను చెప్పెనుగావున, ఇక నధికముగ చెప్పనవసరములేదని యెంచి సారమంతను సంక్షేపముగ చెప్పదలంచి యుండవచ్చును. ఇపుడు చెప్పబోవు ఈ మూడుశ్లోకములున్ను 'గీతాసారమని', 'సంక్షిప్తగీత' యని ప్రసిద్ధికెక్కినవి.

అ॥ పరబ్రహ్మమును పొందు విధానమునుగూర్చి, జ్ఞాననిష్ఠనుగూర్చి మూడుశ్లోకములద్వారా తెలుపుచున్నాడు -

51. బుద్ధ్యా విశుద్ధయా యుక్తో ధృత్యాఽఽత్మానం నియమ్య చ
శబ్దాదీన్విషయాం స్త్యక్త్వా రాగద్వేషౌ వ్యుదస్య చ.

52. వివిక్తసేవీ లఘ్వాశీ యతవాక్కాయమానసః
ధ్యానయోగపరో నిత్యం వైరాగ్యం సముపాశ్రితః.

53. అహఙ్కారం బలం దర్పం కామం క్రోధం పరిగ్రహమ్
విముచ్య నిర్మమశ్శాన్తో బ్రహ్మభూయాయ కల్పతే.

టీక:– విశుద్ధయా = అతి నిర్మలమైన, బుద్ధ్యా = బుద్ధితో, యుక్తః = కూడినవాడును, ధృత్యా = ధైర్యముతో, ఆత్మానమ్ = మనస్సును, నియమ్యచ = నిగ్రహించి (స్వాధీనపఱచుకొని), శబ్దాదీన్ విషయాన్ = శబ్దస్పర్శాది విషయములను, త్యక్త్వా = విడిచిపెట్టి, రాగద్వేషౌ = రాగద్వేషములను, వ్యుదస్య చ = పరిత్యజించి, వివిక్త సేవీ = ఏకాంతస్థలములందు నివసించువాడును, లఘ్వాశీ = మితాహారమును సేవించువాడును, యతవాక్కాయమానసః = వాక్కును, శరీరమును, మనస్సును, స్వాధీనము చేసికొనినవాడును, నిత్యమ్ = ఎల్లప్పుడును, ధ్యానయోగ పరః = ధ్యానయోగతత్పరుడైయుండువాడును, వైరాగ్యమ్ = వైరాగ్యమును, సముపాశ్రితః = లెస్సగ నవలంబించినవాడును, అహంకారమ్ = అహంకారమును, బలమ్ = కామక్రోధాదులతో గూడిన బలమును (లేక మొండిపట్టును, లేక నేను బలవంతుడనను అభిమానమును, పశుబలమును), దర్పమ్ = డంబమును, కామమ్ = విషయాసక్తిని, క్రోధమ్ = కోపమును, పరిగ్రహమ్ = వస్తుసంగ్రహణమును, విముచ్య = బాగుగ వదలి, నిర్మమః = మమకారములేనివాడును, శాంతః = శాంతుడును (అయియుండువాడు), బ్రహ్మభూయాయ = బ్రహ్మస్వరూపుడగుటకు (బ్రహ్మైక్యమునకు), కల్పతే = సమర్థుడగుచున్నాడు.

తా:– అతినిర్మలమైన బుద్ధితోగూడినవాడును, ధైర్యముతో మనస్సును నిగ్రహించువాడును, శబ్దస్పర్శాది విషయములను విడిచిపెట్టువాడును, రాగద్వేషములను పరిత్యజించువాడును, ఏకాంతస్థలము లందు నివసించువాడును, మితాహారమును సేవించువాడును, వాక్కును, శరీరమును, మనస్సును స్వాధీనముచేసికొనినవాడును, ఎల్లప్పుడును ధ్యానయోగతత్పరుడై యుండువాడును, వైరాగ్యమును లెస్సగ నవలంబించినవాడును, అహంకారమును, బలమును (కామక్రోధాది సంయుక్తమగు బలమును లేక మొండిపట్టును), డంబమును, కామమును (విషయాసక్తిని), క్రోధమును, వస్తుసంగ్రహణమును, బాగుగ వదలివైచువాడును, మమకారము లేనివాడును, శాంతుడును అయియుండువాడు బ్రహ్మస్వరూపము నొందుటకు (బ్రహ్మైక్యమునకు, మోక్షమునకు) సమర్థుడగుచున్నాడు.

వ్యాఖ్య:– ఈ మూడు శ్లోకములున్ను గీతాసారమని చెప్పబడును. తరించుటకు కావలసిన సాధన సంపత్తియంతయు వీనియందుగలదు. ఈ మూడు శ్లోకములందును తెలుపబడిన సాధనలను చక్కగ అనుష్ఠించినచో మనుజుడు బ్రహ్మసాక్షాత్కారము (మోక్షమును) తప్పక పొందగలడు (బ్రహ్మభూయాయ

కల్పతే). సాధన విధానము, దానిఫలితమును రెండును ఇచట పేర్కొనబడినవి. బ్రహ్మైక్యరూపమగు మహోన్నత ఫలితమును గలుగజేయునవి యగుటవలన ముముక్షువు శ్రద్ధతో వానిని ఒక్కొక్కటిగ చక్కగ సాధించి, క్రమముగ అన్నిటిని సాధించవలెను.

'విశుద్ధయా' - 'శుద్ధయా' అని చెప్పక 'విశుద్ధయా' అని చెప్పుటవలన బుద్ధి ఒకింత శుద్ధముగానున్నచో చాలదనియు, మిక్కిలి శుద్ధముగా నుండవలెననియు స్పష్టమగుచున్నది. అత్యంతనిర్మలమైన అద్దమందే ముఖము స్పష్టముగ గోచరించునుగదా!

'ధృత్యా' - మనస్సు సామాన్యముగ లొంగునదికాదు. దానిని జయించుటకు, నిగ్రహించుటకు ఎంతయో ధైర్యమవసరము. ఆత్మ పిరికిపందలచే పొందబడునది కాదు.

'కశ్చిద్ధీరః' - అనునట్లు ధైర్యవంతుడే మనస్సును లొంగదీసికొని ఆత్మను బొందును.

'ఆత్మానం నియమ్య చ' - మనస్సును, ఇంద్రియములను నిగ్రహించనిచో అధ్యాత్మ క్షేత్రమున ఎవరును విజయశ్రీని జేబట్టజాలరు. సాధన క్రమములో మనస్సంయమము అత్యంత ప్రధానమైయున్నది. 'నియమ్య' అని చెప్పుటచే మనస్సును బాగుగ నిగ్రహించవలెనని ఆదేశించడమైనది.

'శబ్దాదీన్విషయాం స్త్యక్త్వా' - శబ్దాది దృశ్యవిషయములవెంట పరుగిడువారు ఆత్మానుభవము నెన్నటికిని బొందజాలరు. మనస్సు బహిర్ముఖత్వమునువీడి అంతర్ముఖమై ఆత్మధ్యానమందు నెలకొనియుండవలెను.

'వివిక్త సేవీ' - ఏకాంతస్థలమున నివసించవలెను. లేక గృహమందు ధ్యానమునకు ప్రతిబంధములేని ఒకానొక గదిని ఏర్పాటుచేసికొని అందు బ్రహ్మనిష్ఠాదులను జరుపుకొనవచ్చును. సాధనదశలో బహుజనమధ్యమున నుండినచో చిత్తమునకు విక్షేపము కలుగును. కావున ఏకాంతముగ ధ్యానాదులను శీలించవలెనని చెప్పబడినది.

'లఘ్వాశీ' - మితాహారమును గైకొనవలెను. అధికముగ భుజించుటవలన ఆరోగ్యము చెడుటయేగాక ధ్యానమున్ను సరిగా జరుగదు. శరీరము ఎంత తేలికగా నుండిన అంతమంచిది. అయితే కేవల శుష్కోపవాసాదులు పనికిరావు. యుక్తాహారవిహారుడై యుండవలెను. సాధకుడు ఆహారవిషయమై కడుజాగరూకుడై యుండవలెను. ఆహారము వలననే శరీరము, మనస్సు ఏర్పడునుకావున ధ్యానానుకూలమగు సాత్త్విక, మితాహారమునే సేవించవలెను. ఆధ్యాత్మిక సాధనరూప సౌధమునకు ఆహారనియమము పునాదివంటిది. కాబట్టి దానివిషయమైబహుజాగ్రతవహింపవలెను. ఇదివఱలో గీతయందు భగవానుడు దానిని గూర్చి పలుమార్లు హెచ్చరించియుండిరి. ఇపుడు గీత పరిసమాప్తమగుచున్నందువలన తిరిగి జ్ఞాపకముచేయుచున్నారు. గీతలోని 701 శ్లోకముల సారము 3 శ్లోకములలో ఇచట చెప్పబడుచున్నపుడు, ఆ శ్లోకములందు చేర్చబడు అంశములు (ఆహారసంయమాదులు) ఎంత ప్రధానమైనవో యోచించుకొనవచ్చును. కావున ఆహారవిషయమై జాగ్రతవహించుట చాల ముఖ్యమైనది.

'యతవాక్కాయమానసః' - వాక్కును, శరీరమును, మనస్సును అదుపులోనుంచుకొనవలయును. మదపుటేనుగును మావటివాడు అంకుశముచే స్వాధీనపఱచుకొనునట్లు సాధకుడు భక్తిజ్ఞానాదులచే, వివేకముచే పై మూడింటిని తన యధీనమందుంచు కొనవలెను. తాను చెప్పినట్లు అది నడువవలెనేకాని అదిచెప్పినట్లు తాను ఆడగూడదు.

'ధ్యానయోగపరోనిత్యం' - 'నిత్యం' అని చెప్పుటవలన, ఒకపుడు ధ్యానశీలుడై, దైవచింతనాపరుడై

మఱియొకపుడు దృశ్యవిషయాదులందు విచ్చలవిడిగ తిరుగరాదని ఆదేశించడమైనది. ఇట్టిస్థితి ప్రారంభములో సాధ్యముకాకున్నను అభ్యాసముచే క్రమముగ సిద్ధించును. ధ్యానమునుండి బయటకువచ్చినపుడుకూడ ఆ ధ్యానకాలస్థ ప్రశాంత సాత్త్వికవాతావరణమునే కాపాడుకొనవలెను.

'వైరాగ్యం సముపాశ్రితః' - శ్రితః - ఆశ్రయించినవాడు

ఆశ్రితః - బాగుగ ఆశ్రయించినవాడు

ఉపాశ్రితః - ఇంకను బాగుగ ఆశ్రయించినవాడు

సముపాశ్రితః - లెస్సగ సంపూర్ణముగ ఆశ్రయించినవాడు.

'సముపాశ్రితః' అని చెప్పుటవలన వైరాగ్యమును పరిపూర్ణముగ లెస్సగ నాశ్రయించవలెనని బోధింపబడినది. ఏలయనగా మందవైరాగ్యయుతుని మాయ ఒక్క ఊపులో పడగొట్టివైచును★.

'బలమ్' - ఇచట 'బలమ్' అని చెప్పబడిన దానియర్థము దైవబలము, పరమార్థబలమనికాదు. అసురబలము, పశుబలము, కామక్రోధాదులబలము అనియే. లేక తాను బలవంతుడనను అభిమానమనియు చెప్పవచ్చును. వీనిని త్యజించివేయవలెను. సత్కార్యముల కుపయోగించు బలము ఉత్తమమైనది కాని దుష్కార్యముల కుపయోగించునది కాదు. మొండిపట్టుదలతో చూపబడుబలము త్యాజ్యమేయగును. కావున వానిని వదలి దైవబలముచే సంపాదించవలెను.

'కామం క్రోధమ్' - ఈ రెండును గీతలో చాలచోట్ల అన్నదమ్ములవలె కలసి వచ్చుచున్నవి. ఒకదానినొకటి విడిచివచ్చినచోట్లు గీతలో చాల అరుదుగా నుండును. ఏలయనగా, క్రోధమునకు పుట్టిల్లు కామము (కామాత్క్రోధోఽభిజాయతే). ఆ కామక్రోధముల రెండిటిని సమూలముగ ఛేదించివేయవలెను.

'పరిగ్రహమ్' - పరిగ్రహమనగా ఇతరులనుండి వస్తువులను స్వీకరించుట. తన దేహపోషణకు అవసరమైన భిక్షాదులు తప్ప తదితరములను సాధకుడు ఒరులనుండి గ్రహింపరాదు. అట్లు గ్రహించుటయే ఆ యా వస్తువునుగూర్చిన ఆశాదులచే చిత్తమునకు విక్షేపము గలుగుటయు ఇతరులకర్మ తనకు తగుల్కొనుటయు, భోగసామగ్రిచే సాధన చెడుటయు సంభవించును. కావున పరిగ్రహమును వదలివేయవలెను. అహంకారాది దుర్గుణములలో 'పరిగ్రహము'న్ను చేర్చబడుటబట్టి అదియు తక్కినవానివలె ప్రమాదకరమనియు, అనుపాదేయమనియు స్పష్టమగుచున్నది.

'విముచ్య' - అని చెప్పుటవలన పైనదెల్పిన అహంకారాది దుర్గుణము లన్నిటిని సంపూర్ణముగ విడనాడవలెనని బోధించినట్లైనది.

'బ్రహ్మభూయాయ కల్పతే' - ఈ చెప్పబడిన సాధనయందారితేరువారు వారెవరైనను సరియే బ్రహ్మప్రాప్తికి, మోక్షమునకు అర్హులే యగుదురు. వారు తప్పక బ్రహ్మానుభూతిని బడయగలరు. కాబట్టి ముముక్షువులు ఆ బోధలన్నిటిని చక్కగ కార్యాన్విత మొనర్చి బ్రహ్మప్రాప్తి నొందవలయును.

★ ఆపాతవైరాగ్యవతో ముముక్షూన్ భవాబ్ధిపారం ప్రతియాతుముద్యతాన్
ఆశాగ్రహో మజ్జయతేఽన్తరాలే నిగృహ్య కంఠం వినివర్త్య వేగాత్. (వివేకచూడామణి - శ్రీ శంకరాచార్యులవారు)
మందవైరాగ్యముగల ముముక్షువులను సంసారసాగరమున ఆశ యను మొసలి గట్టిగ కంఠము పట్టుకొని శీఘ్రముగ ముంచివైచుచున్నది.

ఈ మూడు శ్లోకములును గీతాసారమగుటవలనను, అతిముఖ్యములైనవి యగుట వలనను వీనిని ముముక్షువులు బాగుగ కంఠస్థముచేసి అర్థమును సదా మననముచేయుచు వానిని చక్కగ కార్యాన్వితమొనర్చి (మోక్షప్రాప్తి నొందుటద్వారా) కృతార్థులు కావలయును. వీనియందు కొన్ని గ్రహించవలసిన గుణములు, కొన్ని త్యజించవలసిన గుణములుకూడ చెప్పబడినవి. అనగా ఔషధము, పథ్యము రెండును తెలుపబడినవి రెండును సమకూడినపుడే భవరోగము కుదురును.

ప్ర:– బ్రహ్మసాక్షాత్కారమునకు (మోక్షప్రాప్తికి) ఏ యే సాధనలను జేయవలెను? ఎట్లు ప్రవర్తించవలెను?

ఉ:– (1) బుద్ధిని మిగుల నిర్మలముగా నొనర్చుకొనవలెను.

(2) ధైర్యముచే ఇంద్రియమనంబులను స్వాధీనము చేసికొనవలెను.

(3) శబ్దస్పర్శాది విషయములను త్యజించవలెను.

(4) రాగద్వేషములను విడిచిపెట్టవలయును.

(5) ఏకాంతస్థలము నాశ్రయించవలెను.

(6) మితాహారమును సేవింపవలెను.

(7) వాక్కును, శరీరమును, మనస్సును స్వాధీనమునందుంచుకొనవలెను.

(8) నిరంతరము ధ్యానయోగతత్పరుడై యుండవలెను.

(9) వైరాగ్యమును లెస్సగ నాశ్రయించవలెను (తీవ్రవైరాగ్యము గలిగియుండవలెను).

(10) అహంకారమును, దుష్టకార్యముల కుపయోగించు బలమును (లేక బలాభిమానమును) దర్పమును, కామమును, క్రోధమును, పరిగ్రహమును బాగుగ వదలివేయవలెను.

(11) మమకారమును పోగొట్టుకొనవలెను.

(12) శాంతచిత్తుడై యుండవలెను.

ప్ర:– ఇంద్రియమనంబులను ఏ ప్రకారము నిగ్రహించవలెను?

ఉ:– ధైర్యముతో.

ప్ర:– బ్రహ్మప్రాప్తికి (మోక్షమునకు) ఎవడు అర్హుడు?

ఉ:– పైన దెల్పిన సుగుణములుకలవాడు (ఆతడెవడైనను సరియే).

అ॥ అట్లు బ్రహ్మరూపమును బొందిన మహనీయ డెట్లు ప్రవర్తించునో తెలుపుచున్నాడు –

54. బ్రహ్మభూతః ప్రసన్నాత్మా న శోచతి న కాంక్షతి
సమస్సర్వేషు భూతేషు మద్భక్తిం లభతే పరామ్.

టీక:– బ్రహ్మభూతః = బ్రహ్మరూపమును (లేక) (బ్రహ్మైక్యమును) బొందినవాడు (జీవన్ముక్తుడు), ప్రసన్నాత్మా = నిర్మలమైన (ప్రశాంతమైన) మనస్సుగలవాడు (అగు మనుజుడు), న శోచతి = దేనిని గూర్చియు దుఃఖింపడు, న కాఙ్క్షతి = దేనినికోరడు, సర్వేషు భూతేషు = సమస్తప్రాణులందును, సమః = సమబుద్ధిగలవాడై (వానిని తనవలెనే చూచుకొనుచు), పరామ్ = ఉత్కృష్టమైన, మద్భక్తిమ్ = నాయందలి భక్తిని (సమస్తము బ్రహ్మమను భావమును), లభతే = పొందుచున్నాడు.

తా:– బ్రహ్మరూపమును (బ్రహ్మైక్యమును) బొందినవాడు (జీవన్ముక్తుడు), నిర్మలమైన (ప్రశాంతమైన) మనస్సుగలవాడు నగు మనుజుడు దేనిని గూర్చియు దుఃఖింపడు. దేనిని కోరడు. సమస్త ప్రాణులందును సమబుద్ధిగలవాడై (వానిని తనవలెనే చూచుకొనుచు) నాయందలి ఉత్తమ భక్తిని పొందుచున్నాడు.

వ్యాఖ్య:– నిర్మలచిత్తుడే బ్రహ్మసాక్షాత్కారము నొందగలడు. మలినచిత్తుడు కాదు. కనుకనే 'ప్రసన్నాత్మా' అని చెప్పబడినది. ఈ శ్లోకమునందు బ్రహ్మసాక్షాత్కారము నొందినవా డెట్లు ప్రవర్తించునో చక్కగ తెలుపబడినది. అట్టివాడు నిర్మలచిత్తుడై యుండి దేనిని గూర్చి దుఃఖింపక, దేనిని కోరక సర్వభూతముల యెడల సమబుద్ధిగలిగి (భూతదయగలవాడై) పరాభక్తియుతుడై వెలయుచుండును.

'న శోచతి న కాఙ్క్షతి' - దృశ్యప్రపంచమంతయు తనయందే (స్వాత్మయందే) కల్పితమైయున్నదని యెఱింగినవాడుకాబట్టి అతడిక దేనిని వాంఛించును? దేనికొఱకు దుఃఖించును? ఈ సత్యమునే ఈ క్రింది ఈశావాస్యోపనిషన్మంత్రము తెలుపుచున్నది.

యస్మిన్ సర్వాణి భూతాని ఆత్మైవాభూద్విజానతః
తత్ర కో మోహః కః శోక ఏకత్వ మనుపశ్యతః. (ఈశావాస్యోపనిషత్)

'సమః సర్వేషు భూతేషు' - ఆత్మానుభూతి, బ్రహ్మానుభవము పొందినవానికి గుఱుతు సమస్తప్రాణికోట్లయందు సమభావముగల్గి తనవలెనే వానిని జూచుట. జ్ఞానప్రాప్తికి సర్వభూతదయ చిహ్నమైయున్నది. అదిలేనిచో పూర్ణజ్ఞానము, ఆత్మానుభవము ఇంకను కలుగలేదనియే అర్థము. కనుకనే బ్రహ్మప్రాప్తినొందిన మహనీయుడు సర్వప్రాణులందును సమబుద్ధి గల్గి, సర్వభూతహితుడై వర్తించుచుండునని భగవానుడు సెలవిచ్చిరి.

'మద్భక్తిం లభతే పరామ్' - అట్టి బ్రహ్మజ్ఞాని నాయొక్క పరాభక్తిని పొందుచున్నాడని చెప్పుటవలన భక్తియొక్క పరాకాష్ఠకు, జ్ఞానమునకు భేదములేదని తెలియుచున్నది.

భక్తి రెండు విధములు - (1) సామాన్యభక్తి (2) పరాభక్తి - అని. ఇందు రెండవదియగు పరాభక్తి కేవలము జ్ఞాననిష్ఠతో సమానము.

'స్వస్వరూపానుసంధానం భక్తి రిత్యభిధీయతే' - అను శంకరుల వచనప్రకారము ఆత్మతత్త్వానుసంధానమే పరాభక్తియొక్క లక్షణమగును. కావున పరాభక్తికి జ్ఞానమునకు భేదములేదు. మఱియు జ్ఞానమును పొందినవారికి అపరిమితమగు భక్తి ఉండియుండునను పరమసత్య మిచట వెల్లడియగుచున్నది. జ్ఞానికి ఆత్మదేవుని యెడల అనన్యభక్తి యుండును.

ప్ర:– బ్రహ్మసాక్షాత్కారమునొందిన మహనీయు డెట్లుండును?

ఉ:– (1) నిర్మల, శాంతమనస్కుడై యుండును. (2) దేనినిగూర్చి దుఃఖింపడు. (3) దేనిని కోరడు (4) సర్వభూతములందు (ప్రాణికోట్లయందు) సమభావముగలిగి వానిని తనవలెనే చూచుకొనుచుండును.

ప్ర:– అట్టి బ్రహ్మజ్ఞాని దేనిని పొందును?

ఉ:– ఉత్కృష్టమగు దైవభక్తిని (పరమాత్మయెడల అనన్యభక్తిని, పరాభక్తిని) పొందును.

అ॥ భక్తిచే జ్ఞానము కలుగునని, జ్ఞానముచే మోక్షము లభించునని తెలుపుచున్నాడు -

55. భక్త్యా మామభిజానాతి యావాన్యశ్చాస్మితత్త్వతః
తతో మాం తత్త్వతో జ్ఞాత్వా విశతే తదన న్తరమ్.

టీక:– భక్త్యా = భక్తిచేత, మామ్ = నన్ను, తత్త్వతః = యథార్థముగా, యావాన్ = ఎంతటివాడనో, యః చ అస్మి = ఎట్టివాడనో, అభిజానాతి = తెలిసికొనుచున్నాడు, తతః = దానినిబట్టి, మామ్ = నన్ను, తత్త్వతః = వాస్తవముగా, జ్ఞాత్వా = తెలిసికొని, తదనన్తరమ్ = తదుపరి, విశతే = (నాయందు) ప్రవేశించుచున్నాడు.

తా:– భక్తిచేత మనుజుడు 'నేనెంతటివాడనో, ఎట్టివాడనో' యథార్థముగ తెలిసికొనుచున్నాడు. ఈ ప్రకారముగ నన్నుగూర్చి వాస్తవముగా నెఱింగి అనంతరము నాయందు ప్రవేశించుచున్నాడు.

వ్యాఖ్య:– క్రిందటి శ్లోకమునందు జ్ఞానముచే భక్తికలుగుచున్నదని చెప్పబడెను. ఈశ్లోకమునందు భక్తిచే జ్ఞానముదయించుచున్నదని చెప్పబడుచున్నది. దీనినిబట్టి భక్తి జ్ఞానములు పరస్పర మొకదానినొకటి పరిపోషించుకొనుచున్నవని స్పష్టమగుచున్నది. భక్తి సర్వులకును సులభసాధ్యమగుటవలనను, భక్తిచే జ్ఞానముదయించుటవలనను గీతయందు దాదాపు ప్రతి అధ్యాయమందును భక్తిని గూర్చిన ప్రస్తావన చేయబడుచునేయున్నది. భక్తియను పుష్పమే జ్ఞానమను ఫలముగ మారుచుండును.

'మామభిజానాతి' - 'జానాతి' అని చెప్పక 'అభిజానాతి' యని చెప్పుటవలన భక్తిచే మనుజుడు భగవంతుని లెస్సగా తెలిసికొనగల్గుచున్నాడని భావము.

'తత్త్వతః' - భగవంతుని అనేకులు అనేకవిధములుగ నెఱింగుచున్నారుకాని యథార్థముగ నెఱుంగువారు చాల అరుదు. భక్తి చేతనో వారిని వాస్తవముగ తెలిసి కొనగల్గుచున్నారు.

'విశతే తదన్తరమ్' - భగవత్స్వరూపమును, లేక ఆత్మస్వరూపమును, భక్తి ద్వారా యథార్థముగ తెలిసికొనిన పిమ్మట మనుజుడు ఆ స్వరూపమందు ప్రవేశించుచున్నాడు. అనగా లయించిపోవుచున్నాడు. అత్తఱి ఉప్పుకల్లు సముద్రమున లయించుచున్నట్లు ఆతడు బ్రహ్మమందు లయించి బ్రహ్మరూపుడుగనే శేషించుచున్నాడు.

(జ్ఞాతుం ద్రష్టుం చ తత్త్వేన ప్రవేష్టుం చ పరన్తప) (11-54)

దీనినిబట్టి భగవంతుడెట్టివాడో బాగుగ తెలిసికొనిన పిదపయే వారియం దైక్యము సంభవించునుగాని అంతకుముందుకాదు అని 'అనన్తరమ్' అను పదముచే భగవానుడు స్పష్టపఱిచిరి. అట్టి యథార్థ భగవద్జ్ఞానమో భక్తివలననే సిద్ధించుచున్నది. దీనినిబట్టి రెండు ప్రధానములగు అంశములు బోధపడుచున్నవి

(1) జ్ఞానముచేతనే ముక్తిలభించును.

(2) ఆ జ్ఞానము భక్తిచేతనే లభించును - అని.

కాబట్టి మోక్షమునకై భగనద్భక్తి సర్వజీవులకును అత్యావశ్యకమని తెలుచున్నది.

ప్ర:— భగవంతు డెట్టివాడో మనుజుడు దేనిచే తెలుసికొనగలడు?

ఉ:— భక్తిచే.

ప్ర:— అట్లు తెలిసికొనినపిదప అతడైమి చేయును?

ఉ:— భగవంతునియందు ప్రవేశించును. (దైవమందు విలీనుడగును) బ్రహ్మైక్యమునుబొందును.

ప్ర:— దీనినిబట్టి బ్రహ్మైక్యము దేనిచే సిద్ధింపగలగదని తెలియుచున్నది?

ఉ:— భగత్తత్త్వపరిజ్ఞానముచే. అట్టి తత్త్వజ్ఞానమో భక్తివలన గలుగుచున్నది. కాబట్టి భక్తిచే జ్ఞానము, జ్ఞానముచే మోక్షము జీవునకు సిద్ధించుచున్నవి.

అ॥ భగవంతుని ఆశ్రయించువానికి భగవదనుగ్రహముచే శాశ్వత మోక్షపదవి లభించగలదని చెప్పుచున్నాడు -

56. సర్వకర్మాణ్యపి సదా కుర్వాణో మద్వ్యపాశ్రయః
మత్ప్రసాదాదవాప్నోతి శాశ్వతం పదమవ్యయమ్.

టీక:— సర్వకర్మాణి = సమస్తములైన కర్మములను, సదా = ఎల్లప్పుడు, కుర్వాణః అపి = చేయుచున్నవాడైనను, మద్వ్యపాశ్రయః = (కేవలము) నన్నే ఆశ్రయుంచువాడు (శరణుపొందియుండువాడు), మత్ప్రసాదాత్ = నాయనుగ్రహమువలన, అవ్యయమ్ = నాశరహితమగు, శాశ్వతం పదమ్ = శాశ్వతమోక్షపదమును, అప్నోతి = పొందుచున్నాడు.

తా:— సమస్తకర్మములను ఎల్లప్పుడును చేయుచున్నవాడైనను కేవలము నన్నే ఆశ్రయించువాడు (శరణుబొందువాడు) నా యనుగ్రహమువలన నాశరహితమగు శాశ్వత మోక్షపదమును పొందుచున్నాడు.

వ్యాఖ్య:— భక్తితోగూడి కర్మనాచరించుటవలన భగవదనుద్రహము లభ్యమై జీవునకు మోక్షపదవి చేకూరుచున్నదని యిచట తెలుపబడినది. 'సర్వకర్మాణ్యపి' అని చెప్పబడినదాని యర్థము విధ్యుక్తములగు సమస్తకర్మములనియే కాని, దోషయుక్తములగు కర్మములుకూడ అనికాదు. ఏలయనిన అవి మొదటనే నిషిద్ధములైయున్నవి. సర్వేంద్రియములచే ఏ యే కర్మలు చేయుచున్నను భగవంతుని సదా స్మరించుచునేయుండువాడు, లేక ఆ యా కర్మఫలములను భగవదర్పణముచేయుచు నుండువాడు భగవదనుగ్రహమునకు పాత్రుడు కాగల్గును. దానిచే మోక్ష మాతనికి సులభముగ లభించుచున్నది. దీనినిబట్టి భక్తితోగూడి కర్మచేయుచో ఆ కర్మయే మనుజుని మోక్షపదమునకు గొనిపోగలదని స్పష్టమగుచున్నది. భగవంతుని ఆశ్రయించినవాడు ఒక కార్యముకాదు అనేక కార్యములను చేసినను బంధింపబడడు. అదియు ఎపుడో ఒకపుడు కాదు, నిరంతరము చేసినను బద్ధుడుకాడు. పైపెచ్చు

భగవదనుగ్రహమును బడసి దానిచే అవ్యయమోక్షపదమును బొందును. శిరస్సుపై ఉదకకుంభముంచుకొని నృత్యమొనర్చుస్త్రీ, నోటితో పాటపాడినను, చేతులతోను కాళ్ళతోను నాట్యవిన్యాసములనుగావించినను, ఆమె మనస్సు మాత్రము శిరస్సుపైగల నీటికుండ పైననే యుండునట్లు, సమస్త కార్యములను సదా చేయుచున్నను ఎవని మనస్సు భగవంతునిపైననే యుండునో సమస్త కార్యములను సదా చేయుచున్నను ఎవని మనస్సు భగవంతునిపైననే లగ్నమైయుండునో అతడు భగవదనుగ్రహమునకు పాత్రుడై ముక్తినొందగలడని యిచట వచింపబడినది.

దీనినిబట్టి కర్మ దైవస్మృతితో చేయబడినపుడే, లేక ఈశ్వరార్పణబుద్ధితో చేయబడినపుడుమాత్రమే మోక్షహేతువగునుగాని తదితర సమయములందు గాదని స్పష్టమగుచున్నది. అట్లు భగవంతుని ఆశ్రయింపక, ఫలములను ఈశ్వరార్పణము గావింపక చేయు కామ్యకర్మాదులచే జీవుడు బద్ధుడై మోక్షమును పొందజాలకుండును. కావున కర్మమార్గము నవలంబించు సాధకు లీవిషయము చక్కగా నెఱుంగవలెను.

'మత్ప్రసాదాత్' – భగవంతుని యనుగ్రహములేనిచో ఈ మాయాబంధమునుండి యెవడును తప్పించుకొనజాలడు. మాయాధీనులగు జనులు మాయాధీశుడగు ఈశ్వరుని యనుగ్రహమును పొందనిదే మాయను దాటజాలరు. (మామేవ యే ప్రపద్యన్తే మాయామేతాం తరన్తి తే). కావున ఆతని యనుగ్రహమును మొట్టమొదట సంపాదించవలెను. అది యెట్లు లభించును? భగవదాశ్రయముచే. సమస్తకర్మములను ఈశ్వరార్పణబుద్ధితో గావించుటచే. అట్టివారిని అతడు కరుణించి అనుగ్రహించునేకాని తదితరులనుగాదు. ఇట భగవంతుని పక్షపాతమేమియులేదు. ఎవరాతని నాశ్రయించుదురో వారి నత డనుగ్రహించును. అట్టి భగవదనుగ్రహముచే నతనికి ముక్తిపదవి లభించుచున్నది. కాబట్టి సర్వులును మొట్టమొదట భగవదాశ్రయ పూర్వకముగ, భగవత్ప్రీత్యర్థముగ కర్మలను చేయవలెను.

దానిచే లభించు మోక్షపదవి యెట్టిది? శాశ్వతమైనది. నాశరహితమైనది. దృశ్యపదార్థమెద్దియు శాశ్వతముకాదు; అది యెంతటి గొప్పదైనను సరియే. అది దేశకాలములకు లోబడియే యుండును. కాబట్టి అట్టి మహోన్నత నిత్యపదవికై, సర్వోత్కృష్ట దైవపదమునకై సర్వులును నిష్కామకర్మ భక్త్యాదులద్వారా యత్నించవలయును.

ప్ర:– మోక్ష మెట్టిది?

ఉ:– శాశ్వతమైనది, నాశరహితమైనది.

ప్ర:– అదియెట్లు లభించును?

ఉ:– భగవదనుగ్రహముచే (మత్ప్రసాదాత్).

ప్ర:– భగవదనుగ్రహ మెట్లు లభించును?

ఉ:– సమస్తకార్యము లాచరించుచుండినను భదవంతుని ఆశ్రయించి భగవత్స్మరణగలిగి యుండినచో, లేక భగవత్ప్రీత్యర్థముగా ఆ యా కర్మలను చేయుచుండినచో లభించును.

ప్ర:– మోక్షమునొందుటకు కర్మలను వదలవలెనా?

ఉ:– లేదు. అన్ని కార్యములను నిరంతరము చేయుచున్నను, భగవంతునియందు మనస్సులగ్నమై యున్నచో వారి యనుగ్రహమువలన జీవునకు శాశ్వతమగు మోక్షము చేకూరగలదు కావున భగవద్భక్తి, నిష్కామకర్మాచరణము అవశ్యకములై యున్నవి.

ప్ర:– కర్మల నేప్రకార మాచరింపవలెను?

ఉ:– భగవంతుని ఆశ్రయించి కర్మలను భగవత్ప్రీతికరములుగ, నిష్కామముగ, ఈశ్వరార్పణముగ గావించవలెను.

ప్ర:– అట్టి భక్తిపూర్వక నిష్కామకర్మాచరణముచే ఏమి లభించును?

ఉ:– భగవదనుగ్రహము, అట్టి యనుగ్రహముచే మోక్షము లభించును.

అ॥ సమస్త కర్మములను భగవదర్పణముచేసి చిత్తమును సదా ఆ పరమాత్మ యందే నెలకొల్పవలెనని వచించుచున్నాడు –

57. చేతసా సర్వకర్మాణి మయి సన్న్యస్య మత్పరః
బుద్ధియోగముపాశ్రిత్య మచ్చిత్తస్సతతం భవ.

టీక:– సర్వకర్మాణి = సమస్తకర్మలను (కర్మఫలములను), చేతసా = వివేకముతోగూడిన బుద్ధిచేత, మయి = నాయందు, సన్న్యస్య = సమర్పించి, మత్పరః = నన్నే పరమప్రాప్యముగా నెంచినవాడవై, బుద్ధియోగమ్ = చిత్తైకాగ్రతతో గూడిన తత్త్వవిచారణము (లేక, ధ్యానయోగమును), ఉపాశ్రిత్య = అవలంబించి, సతతమ్ = ఎల్లప్పుడును, మచ్చిత్తః = నాయందే చిత్తమును జేర్చినవాడవు, భవ = కమ్ము.

తా:– సమస్త కర్మములను (కర్మఫలములను) వివేకయుక్తమగు బుద్ధిచేత నాయందు సమర్పించి, నన్నే పరమప్రాప్యముగా నెంచినవాడవై చిత్తైకాగ్రతతో గూడిన తత్త్వవిచారణను (లేక ధ్యానయోగమును) అవలంబించి ఎల్లప్పుడు నాయందే చిత్తమును నిల్పుము.

వ్యాఖ్య:– 'చేతసా' – శరీరముతో సమస్తకర్మలు చేయుచున్నను మనస్సుతో ఆ కర్మలన్నిటిని, భగవంతునికే అర్పించి వారియందే మనస్సును సంలగ్న పఱచవలెను. 'చేతసా' అని చెప్పుటవలన కర్మఫలసన్న్యాసమే ఇట బోధింపబడినది కాని కర్మసన్న్యాసము కాదు. శరీరము నిశ్చలముగానుండి ఏకర్మచేయకున్నను మనస్సు ప్రపంచములో తిరుగుచున్నచో దానివలన ఇసుమంతైనను ప్రయోజనములేదు. అట్లుకాక, శరీరముతో అనేక కర్మలు చేయుచున్నను మనస్సుతో ఆ కర్మలను, కర్మఫలములను ఈశ్వరార్పణముగావించినచో అది మోక్షహేతువగును. కనుకనే ఇచట 'చేతసా' (చిత్తముతో) అని చెప్పబడినది.

'బుద్ధియోగమ్' – ప్రీతితో భక్తిపూర్వకముగ తన్ను భజించువారికి 'బుద్ధి యోగము' నొసంగెదనని 10వ అధ్యాయమున భగవానుడు తెలిపియుండిరి. (దదామి బుద్ధియోగం తమ్). అనగా చిత్తైకాగ్రత, తత్త్వవిచారణాశక్తి ఆతనికి భగవత్కృపచే కలుగును. అద్దానిని లెస్సగ నాశ్రయించి నిరంతరము చిత్తమును ఆ పరమాత్మయందే నెలకొల్పుమని యిట చెప్పబడినది. 'సతతమ్' అని వచించుటవలన ఏకాలమందును

దైవవిస్మృతి కలుగనీయక నిరంతము చిత్తము ఆత్మయందే (దైవమందే) యుండులాగున ప్రయత్నించవలసియున్నది. ఏలయనిన, మాయ జీవుని పడగొట్టుటకు కాచుకొనియున్నది. అతడేమాత్రమొకింత అజాగ్రతగనున్నప్పటికిని అది యాతని నావరించివైచి తమస్సులో, (అజ్ఞానములో) విషయసుఖములలో పడవేయుటకు సిద్ధముగ నున్నది కావున సాధకులు 'సతతమ్' అను ఈ పదమును జ్ఞప్తియందుంచుకొని దైవవిస్మృతి ఏ మాత్రము కలుగకుండులాగున చూడవలెను.

'మత్పరః' - ప్రపంచమందలి సమస్త దృశ్యపదార్థములు నశ్వరములు. కావున విజ్ఞుడగువాడు శాశ్వతుడగు ఒక్క పరమాత్మనే పరమగమ్యముగ, పరమప్రాప్యముగ నెంచుకొనవలెను.

ప్ర:— పరమాత్మను పొందుటకై జీవు డేమి చేయవలెను?

ఉ:— (1) చిత్తముతో సమస్తకర్మములను భగవంతున కర్పించవలెను.

(2) వారినే పరమప్రాప్యముగ నెంచుకొనవలెను.

(3) బుద్ధియోగమును (చిత్తైకాగ్రతాపూర్వకవిచారణను) లెస్సగ నవలంబించవలెను.

(4) భగవంతునియందే నిరంతరము చిత్తమును సంలగ్న మొనర్పవలెను.

ప్ర:— భగవానుడు కర్మసన్న్యాసమును బోధించెనా, కర్మఫలసన్న్యాసమునా?

ఉ:— 'చేతసా' (చిత్తముతో సమస్త కర్మలను భగవంతునకర్పించి) అని చెప్పుటవలన శరీరముతో కర్మలను చేయుచున్నను, మనస్సుతో వానివాని ఫలములను ఈశ్వరార్పణముగావించవలెననియే బోధింపబడినదగును. కావున కర్మఫలసన్న్యాసమే ఇట వివక్షితముగాని కర్మసన్న్యాసముకాదు.

ప్ర:— మనుజుడు దేనిని పరమప్రాప్యముగ నెంచుకొనవలెను? ఎందుచేత?

ఉ:— పరమాత్మను; వారు శాశ్వతులు కనుక.

ప్ర:— నిరంతరము చిత్తము దేనియందు సంలగ్నమై యుండవలెను?

ఉ:— పరమాత్మయందు.

అ॥ ఈ ప్రకారముగ భగవంతునియందు చిత్తమును నెలకొల్పువారికి భగవదనుగ్రహముచే సమస్తదుఃఖములు తొలగిపోగలవని వచించుచున్నాడు -

58. మచ్చిత్తస్సర్వదుర్గాణి మత్ప్రసాదాత్తరిష్యసి
అథ చేత్త్వమహఙ్కారాన్న శ్రోష్యసి వినఙ్క్ష్యసి.

టీక:— మచ్చిత్తః = నాయందు చిత్తమును జేర్చినవాడవైతివేని, మత్ప్రసాదాత్ = నాయనుగ్రహమువలన, సర్వదుర్గాణి = సమస్త సాంసారికదుఃఖములను (దాటుటకు కష్టసాధ్యములైన కష్టములను, ప్రతిబంధములను), తరిష్యసి = దాటగలవు, అథ = ఇక (అట్లుగాక), త్వమ్ = నీవు,

అహంకారాత్ = అహంకారమువలన, న శ్రోష్యసి చేత్ = (నా యీ వాక్యములను) వినకుందువేని, వినజ్ఞ్యసి = చెడిపోదువు.

తా:– నాయందు చిత్తమును జేర్చినవాడవైతివేని నా యనుగ్రహమువలన సమస్త సాంసారికదుఃఖములను దాటగలవు. అట్లుగాక అహంకారమువలన నా యీ వాక్యములను వినకుందువేని చెడిపోదువు.

వ్యాఖ్య:– లోకములో ప్రతివారును తమకు దుఃఖములెవ్వియును కలుగగూడదనియు, సుఖములే కలుగవలెననియు వాంఛించుదురు. కాని అందులకై, ఏ సాధన చేయవలెనో దానినిమాత్రము చేయరు. ఆ సాధన యెద్దియో భగవానుడే యిచట భక్తులపై కరుణచే తెలిపివైచిరి. సర్వేశ్వరునియందు ఎవరు తమ చిత్తమును లగ్నమొనర్చుదురో అనగా ఎవరు తమ చిత్తమును దృశ్యమందుంచక, విషయములందు సంచరింపనీయక ఆత్మయందే (భగవంతునియందే) కేంద్రీకరించుదురో, అట్టివారికి భగవదనుగ్రహము వలన సమస్తదుఃఖములు, ఆటంకములును నశించిపోవును. 'సర్వ' అను పదమును ప్రయోగించుటవలన ఏవియో కొన్ని ఆపత్తులుమాత్రము నశించుటకాదనియు భగవద్భక్తులకు సమస్త ఆపదలు, దుఃఖములు తొలగిపోవుననియు భావము. ఇట్టి స్థితియేకదా ప్రతివారును కోరునది! జీవులపై కరుణచే భగవాను డీ ప్రకారముగ తెలియజేయుచున్నారు – 'ఓ జీవులారా! మీ చిత్తమును నాయందు (ఆత్మయందు, భగవంతునియందు) లగ్నము చేయుడు. దానికి ప్రతిఫలముగ నేను మీయొక్క సమస్తసాంసారికదుఃఖము లను, ఆటంకములను పారద్రోలెదను!' కాబట్టి భగవద్వాక్యములపై పరిపూర్ణవిశ్వాసముంచి మనుజులు భక్తిభావసమన్వితులై, దైవసంలగ్నచిత్తులై – మెలగవలయును.

'దుర్గాణి' – దుర్గమనగా కోట, ప్రతిబంధము అని అర్థము. మాయ జీవుని చుట్టును పెక్కు అడ్డుగోడలను, దుఃఖములను, ఆటంకములను, విఘ్నములను ఏర్పాటుచేసియుంచినది. సంసారశృంఖములచే జీవుని కట్టివైచినది. అట్టి దుర్గములను భేదించుటకు లౌకిక ఉపాయములు పనికిరావు. మాయను భేదింపవలెననిన మాయాధీశుడే శరణ్యము. కావున దుఃఖరాహిత్యమునకై సుఖానుభూతికై పరమాత్మయొక్క చరణారవిందములను పట్టుకొనుటయే, పరమాత్మను ధ్యానించుటయే జీవులకు ఏకైకమార్గము. వేఱుదారిలేదు.

'మత్ప్రసాదాత్' – నా యనుగ్రహముచే దుఃఖమును దాటగలవు. భగవానునకు అందఱును సమానులే అయియున్నప్పటికిని ఎవరు వారిని భక్తిపూర్వకముగ ధ్యానింతురో, సేవింతురో, అట్టివారియెడల మాత్రమే వారు తమయనుగ్రహమును జూపుదురు. గాలి అంతటను వీచుచున్నను ఎవరు తెరచాప నెత్తుదురో వారి పడవ మాత్రమే కదలును. చెట్టుక్రిందకు ఎవరు వెళ్లుదురో వారికిమాత్రమే చెట్టు నీడ యొసంగును. కాబట్టి సుఖానుభూతి కావలసియున్నచో భగవంతుని ఆశ్రయించుటతప్ప వేఱొక ఉపాయ మెద్దియును లేదు.

ఒకవేళ యెవ్వరైన అహంకారముచేగాని, ధనమదముచేగాని, అధికారగర్వముచేగాని భగవానుని ఈవాక్యములపై విశ్వాసము లేకయుండినచో, లేక ఈ వాక్యములను వినకుండినచో వారుచెడిపోవుదురనియు, సంసారకూపమునసే పడి నానాబాధల నొందుదురనియు నిచట తెలుపబడినది. కావున దైవవాక్యములపై శ్రద్ధగలిగి తదనురీతి యాచరించి తరించుట జీవుల కర్తవ్యము.

ప్ర:– జీవునకు సమస్త సాంసారికదుఃఖములు ఎట్లు నశించగలవు?

ఉ:– భగవంతునియందు చిత్తమును సంలగ్నపఱచి, భగవత్పరాయణుడై యున్నచో ఆపత్తులన్నియు అతనికి తొలగిపోగలవు.

ప్ర:– అట్లు భగవద్వాక్యములను విననిచో వారిగతి యేమగును?

ఉ:– వారు చెడుపోవుదురు. సంసారదుఃఖములపాల్బడుదురు.

ప్ర:– వారట్లు వినకుండుటకు కారణమేమి?

ఉ:– అహంకారముచే, గర్వముచే ప్రేరితులై వారట్లు వినకుందురు.

అ॥ ఒకవేళ అహంకారముచే నా వాక్యములను వినక 'నేను యుద్ధముచేయ' నని నీవు చెప్పినను ప్రకృతియే నీచే యుద్ధము చేయించునని భగవానుడు అర్జునునితో పలుకుచున్నాడు -

59. యద్యహఙ్కారమాశ్రిత్య★ న యోత్స్య ఇతి మన్యసే
మిథ్యైష వ్యవసాయ స్తే ప్రకృతిస్త్వాం నియోక్ష్యతి.

టీక:– యది = ఒకవేళ, అహంకారమ్ = అహంకారమును, ఆశ్రిత్య = అవలంబించి, న యోత్స్యే ఇతి = యుద్ధముచేయనని, మన్యసే (చేత్) = తలంచెదవేని, ఏషః తే వ్యవసాయః = ఈ నీ ప్రయత్నము, మిథ్యా = వ్యర్థమైనదియే యగును, ప్రకృతిః = నీ (క్షత్రియ) స్వభావమే, త్వామ్ = నిన్ను, నియోక్ష్యతి = (యుద్ధమున) నియోగింపగలదు.

తా:– ఒకవేళ అహంకారము నవలంబించి 'నేను యుద్ధముచేయను' అని నీవు తలంచెదవేని అట్టి నీ ప్రయత్నము వ్యర్థమైనదియే యగును. (ఏలయనిన) నీ (క్షత్రియ) స్వభావమే నిన్ను (యుద్ధమున) నియోగింపగలదు.

వ్యాఖ్య:– కర్తృత్వమునువీడి, క్షత్రియోచితమగు ధర్మయుద్ధమును గావింపుమని అర్జునునకు భగవాను డిదివఱలో తెలిపియుండిరి. ఇపుడు 'ఓ అర్జునా! అహంకారము వలన నా యీ వాక్యములను ఉల్లంఘించినచో అది నీయొక్క వ్యర్థప్రయత్నమే కాగలదు. ఏలయనిన, నీ క్షత్రియసంబంధ ప్రకృతియే, స్వభావమే బలాత్కారముగ నిన్ను యుద్ధమున దింపగలదు'. అని భవిష్యద్జ్ఞానముగల పరమాత్మ వచించిరి.

అ॥ మనుజుడు తానొకపనిని చేయగూడదనుకొనినను తన స్వాభావిక కర్మప్రభావముచే నద్దానిని చేసియే తీరునని వచించుచున్నాడు -

60. స్వభావజేన కౌన్తేయ! నిబద్ధస్స్వేన కర్మణా
కర్తుం నేచ్ఛసి యన్మోహా త్కరిష్యస్యవశోఽపి తత్.

టీక:– కౌన్తేయ = ఓ అర్జునా!, స్వభావజేన =స్వభావము (పూర్వజన్మసంస్కారము)చే గలిగిన (ప్రకృతిసిద్ధమైన), స్వేన = నీయొక్క, కర్మణా = కర్మముచేత, నిబద్ధః = లెస్సగ బంధింపబడినవాడవై,

★ యదహంకారమాశ్రిత్య = పాఠాన్తరము.

మోహాత్ = అవివేకమువలన, యత్ = దేనిని (ఏ యుద్ధమును), కర్తుమ్ = చేయుటకు, న ఇచ్ఛసి = ఇచ్ఛగింపవో, తత్ అపి = దానినిగూడ, అవశః అపి = పరాధీనుడవై (కర్మాధీనుడవై), కరిష్యసి = చేయగలవు.

తా:– ఓ అర్జునా! స్వభావము (పూర్వజన్మసంస్కారము) చే గలిగిన (ప్రకృతిసిద్ధమైన) నీయొక్క కర్మముచే లెస్సగ బంధింపబడినవాడవై దేనిని చేయుటకు అవివేకమున నిచ్ఛగింపకున్నావో దానిని పరాధీనుడవై (కర్మాధీనుడవై) తప్పక చేసియే తీరుదువు.

వ్యాఖ్య:– 'నిబద్ధః.' – మనుజుడు తన కర్మచేతనే తాను బంధింపబడియున్నాడు. 'బద్ధః' అనిచెప్పక 'నిబద్ధః' అని చెప్పుటవలన లెస్సగ బంధింపబడియున్నాడని భావము. పూర్వజన్మసంస్కారము అర్జుననకు యుద్ధముచేయునదిగా నుండియున్నదని త్రికాలజ్ఞులగు భగవానుడు తెలిసికొనిరి. కావుననే 'నేను యుద్ధముచేయను. అని నీవనుకొనినను సంస్కారప్రభావముచే 'యుద్ధము చేసియే తీరుదువు' అని అర్జుననకు ధైర్యముగ తెలియజేయగల్గిరి. ఇంతమాత్రముచేత పురుషప్రయత్నము వ్యర్థమని యెవరును తలంపరాదు. మనుజునకు (1) పూర్వజన్మసంస్కారము (2) ఇహజన్మ పురుషప్రయత్నము అని రెండుకలవు. ఈ రెండింటికిని నిరంతరము జీవునియందు సంఘర్షణ జరుగుచునే యుండును. అందు ఇహజన్మ పురుషప్రయత్నము అధికముగా నున్నచో పూర్వజన్మ సంస్కారము జయించివేయబడును. ప్రతివారికిని వారి పూర్వజన్మసంస్కార మెట్లున్నదో తెలియదు గనుక తీవ్రపురుషప్రయత్నముచే ఈ జన్మమందు దైవిక సంస్కారములనే అలవాటు చేసికొనినచో పూర్వదుస్సంస్కారము లేవైనయున్నచో అవియన్నియు వానిచే జయించివేయబడును. ఇప్పటి ప్రయత్నము అధికముగ లేనిచో పూర్వసంస్కారములే జయించును కావున జీవుడు బహుజాగరూకుడై ప్రయత్నపూర్వకముగ దైవసంస్కారములను అభ్యసించవలెను.

ప్ర:– మనుజుడు దేనిచేత బంధింపబడియున్నాడు?

ఉ:– తన పూర్వజన్మ కర్మచే.

ప్ర:– దేనిచే ముక్తుడగును?

ఉ:– ఇహజన్మయందలి సత్కర్మపూర్వక పురుషప్రయత్నముచే.

అ॥ ఈశ్వరుడు తనమాయచే సమస్తభూతములను కీలుబొమ్మలనువలె త్రిప్పుచున్నారని తెలుపుచున్నాడు –

61. ఈశ్వరస్సర్వభూతానాం హృద్దేశేఽర్జున! తిష్ఠతి
భ్రామయన్సర్వభూతాని యన్త్రారూఢాని మాయయా.

టీక:– అర్జున = ఓ అర్జునా!, ఈశ్వరః = జగన్నియామకుడగు పరమేశ్వరుడు (అంతర్యామి), మాయయా = మాయచేత, సర్వభూతాని = సమస్తప్రాణులను, యన్త్రారూఢాని *(ఇవ)* = యంత్రమునారోహించినవారివలె (కీలుబొమ్మలనువలె), భ్రామయన్ = త్రిప్పుచు (నియమించుచు), సర్వభూతానామ్ = సమస్తప్రాణులయొక్క, హృద్దేశే = హృదయప్రదేశమునందు, తిష్ఠతి = వెలయుచున్నాడు.

తా:– ఓ అర్జునా! జగన్నియామకుడు పరమేశ్వరుడు (అంతర్యామి) మాయచేత సమస్తప్రాణులయొక్క హృదయమున వెలయుచున్నాడు.

వ్యాఖ్య:- ఈశ్వరు డెచట నున్నారు? ఏమి చేయుచున్నారు? అను ప్రశ్నలకిచట సమాధానము చెప్పబడినది. ఈశ్వరుడు (భగవంతుడు) దూరముగనే యున్నాడని తలంచుట వెఱ్ఱి. వారు జీవులకు, అతిసమీపమున హృదయమందుగూడ (ఆత్మరూపమున) అధివసించుచున్నారు. కనుకనే 'సర్వభూతానాం హృద్దేశే' - అని చెప్పబడినది. కావున భగవత్సాన్నిధ్యమును ఎల్లపుడు ననుభవించుచు, పాపాచరణములేక, భక్తియుతులై మెలగవలెను. జీవులుచేయు సమస్తకార్యములను, సంకల్పించు సమస్త సంకల్పములను ఈశ్వరుడు సాక్షిమాత్రుడై సదా వీక్షించుచునేయుండునని ఎవరును మఱవరాదు. ఈశ్వరుడనగా ప్రభువు, శాసకుడు, నియామకుడు. రాజు ప్రజలను శాసించునట్లు వారు సమస్తప్రాణికోట్లను శాసించుదురు. వారివారికి కర్మానుకూలముగ ఫలముల నొసంగుదురు. రాజాజ్ఞను మీరినచో జనులకెట్లు దండనము లభించునో అట్లే ఈశ్వరుని ఆజ్ఞయగు ధర్మము నుల్లంఘించినచో మనుజుడు వారిచే శిక్షితుడై, తన దుష్కర్మఫలితమగు ఘోరదుఃఖము ననుభవించును. కావున హృదయమున, బాహ్యమున, సర్వత్ర ఈశ్వరసన్నిధిని సదా భావించుచు ధర్మమును, సత్యమును, ఎవరును ఉల్లంఘించరాదు.

భగవంతుడు ఏ ప్రదేశమందుండును? వైకుంఠమందా? కైలాసమందా? పాతాళమందా? ఇతరలోకమందా? వారెల్లెడల వసించుచుందురు. అతిసమీపమునగల హృదయప్రదేశమందును ఉండును. కావున అట్టి పరమాత్మను సదా భక్తితో గొల్చుచుండవలెను. 'సర్వభూతానామ్' అని చెప్పుటవలన ఏ ఒకానొక ప్రాణియందో కాదనియు సమస్త జీవకోట్లయందును భగవానుడు వెలయుచుండుననియు స్పష్టమగుచున్నది. కాబట్టి చీమయందును, దోమయందును, పశవునందును, చండాలునియందునుకూడ వారు నివసించుచున్నారు. కాని ఎవని చిత్తము నిర్మలముగా నుండునో ఆతనియందు లెస్సగ భాసించుచు, వ్యక్తమగును.

యన్త్రారూఢాని - ఈశ్వరుడు మాయద్వారా సమస్తజీవులను సంసారరూపయంత్రమున త్రిప్పుచున్నాడు. యంత్రముయొక్క పెద్దచక్రములపై చిక్కుకొనిన చీమగాని పురుగుగాని, ఆచక్రముతోబాటు తిరుగుచునేయుండును. అట్లే జీవులున్ను (ఈశ్వరునిచే మాయద్వారా త్రిప్పబడుచున్న) ఈ సంసారచక్రమున తగుల్కొని, ఆ చక్రముతోబాటు వివశులై తిరుగుచున్నారు. దానినుండి తప్పించుకొనుట కుపాయము రాబోవు శ్లోకమున తెలుపబడును. ఆ యంత్రమును త్రిప్పుచున్నవానిని (భగవంతుని) ఆశ్రయించుటయే ఆ యుపాయము.

'మాయయా' అని చెప్పుటవలన ఈశ్వరుడు ఈ సంసారచక్రమును త్రిప్పుచున్నప్పటికిని మాయద్వారా ఆ పరిభ్రమణమును గావించుటవలన వాస్తవముగ వారికేమియు కర్తృత్వము లేకయేయున్నది. వారు సాక్షిమాత్రులై వర్తించుచున్నారు.

ప్ర:- ఈశ్వరుడు ఎచట నివసించుచున్నాడు?

ఉ:- సమస్తప్రాణికోట్ల హృదయమందు.

ప్ర:- ఏమిచేయుచున్నాడు?

ఉ:- ఈ సంసారచక్రమున తగుల్కొనియుండు జీవులందఱిని త్రిప్పుచున్నాడు.

ప్ర:- దేనిద్వారా?

ఉ:– మాయాశక్తిచేత.

ప్ర:– ఏ ప్రకారముగ?

ఉ:– యంత్రమందు తగుల్కొనియుండు పురుగులవలె.

అ॥ జీవులు సంసారచక్రమున తగుల్కొని పరిభ్రమించుచున్నారని చెప్పబడినది గదా? మఱివారు శాంతిని, సుఖమును (మోక్షమును) ఎట్లు బొందగలరు? ఆ యుపాయము నీశ్లోకముద్వారా వచించుచున్నాడు –

62. తమేవ శరణం గచ్ఛ సర్వభావేన భారత!
తత్ప్రసాదాత్పరాం శాన్తిం స్థానం ప్రాప్స్యసి శాశ్వతమ్.

టీక:– భారత = ఓ అర్జునా!, సర్వభావేన = సర్వవిధముల, *తమ్ ఏవ* = (హృదయస్థుడగు) ఆ ఈశ్వరునే, *శరణం గచ్ఛ* = శరణుబొందుము, *తత్ ప్రసాదాత్* = అతని యనుగ్రహముచే, *పరామ్* = ఉత్కృష్టమైన, *శాన్తిమ్* = శాంతిని, *శాశ్వతమ్* = శాశ్వతమగు, *స్థానమ్* = మోక్షపదవిని, *ప్రాప్స్యసి* = పొందగలవు.

తా:– ఓ అర్జునా! సర్వవిధముల ఆ (హృదయస్థుడగు) ఈశ్వరునే శరణుబొందుము. వారి యనుగ్రహముచే సర్వోత్తమమగు శాంతిని, శాశ్వతమగు మోక్షపదవిని నీవు పొందగలవు.

వ్యాఖ్య:– క్రిందటిశ్లోకమున జీవులు సంసారచక్రమున తగుల్కొని పరిభ్రమించుచున్నారని చెప్పబడినది. మఱి వారు తప్పించుకొనుటెట్లు? జననమరణరూప సంసారదుఃఖములనుండి వారు విడివడుట యెట్లు అను ప్రశ్నల కీశ్లోకమున సమాధానము చెప్పబడుచున్నది. సకల జీవులయొక్క హృదయస్థానమున ఏ పరాత్పరుడు (ఏ పరమాత్మ, ఏ సర్వేశ్వరుడు) నివసించుచున్నాడో వారిని సర్వవిధముల శరణుబొందుటయే బంధవిముక్తికి ఏకైక ఉపాయమని ఇచట తెలుపబడినది. యంత్రమును ఆపవలెననిన, ఆ యంత్రమును త్రిప్పువానిని ఆశ్రయించవలెను. ఈసంసారరూపయంత్రమును త్రిప్పువాడో, సాక్షాత్ ఈశ్వరుడేయని క్రిందటి శ్లోకమున చెప్పబడినది. (ఈశ్వరఃభ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని). కాబట్టి ఆ ఈశ్వరునే జీవుడు శరణుబొందవలసియున్నది. లేకున్న మాయ అతనికి దారియివ్వదు. మాయయొక్క శక్తి ఒక్క భగవచ్ఛక్తికి తప్ప మఱిదేనికిని లోబడదు. ప్రాపంచిక శక్తులన్నియు మాయాశక్తికిన్ని, మాయాశక్తి దైవశక్తికిని (ఈశ్వరశక్తికిని) లోబడియున్నవి. కావున మాయాధీనులగు జీవులందఱున్ను మాయామోహమును, సంసారచక్రపరిభ్రమణ మును దాటివేయవలెననిన, మాయాధీశుడగు పరమాత్మను శరణుబొందవలయును. ఆ విషయమే ఈ శ్లోకమున తెలియజేయబడినది.

'సర్వభావేన' – అని చెప్పుటవలన ఆ హృదయస్థ పరమాత్మను సర్వవిధముల సంపూర్ణమనస్సుతో శరణుబొందవలెనని స్పష్టమగుచున్నది. శరీరవాఙ్మనంబులతో పరిపూర్ణముగ సేవించవలయునని అర్థము. అర్ధమనస్సుతో, అర్ధభావముతో దేవుని ప్రార్థించుట, సేవించుట చాలదు. మోక్షప్రాప్తికి పూర్ణమనస్సుతో భగవానుని ధ్యానింపవలెను. దృశ్యవిషయములపై మనస్సు పంపకము చేయబడరాదు.

'తత్ప్రసాదాత్ ' - మోక్షమునకు భగవదనుగ్రహము అత్యావశ్యకమై యున్నది. దానిని సంపాదించక తక్కినయెన్ని ఉపాయములను గావించినను మాయాబంధము తొలగదు. అది యెట్లు లభించునో ఈ శ్లోకముయొక్క మొదటిపాదమున తెలుపబడినది. భగవచ్ఛరణాగతిచేతను, సర్వవిధముల ఆ పరమాత్మను భక్తితో నాశ్రయించుట చేతను లభించును. భగవానుని నిర్మలభక్తితో సర్వవిధముల శరణుబొందుటచే వారి అనుగ్రహము కలుగును. ఆ యనుగ్రహమువలన జీవునకు సర్వోత్తమశాంతి, శాశ్వతమగు మోక్షపదము లభించుచున్నవి. ఓహో! ఎంతటి గొప్పఫలము! కావున జీవుని ప్రథమకర్తవ్యము ఈశ్వరునకు శరణాగతి నొందుటయే యగును.

'పరాం శాన్తిమ్' - ఆ మోక్షపదవి యెట్టిది? పరమ శాంతమైనది. దుఃఖరహితమైనది. పూర్ణశాంతి యెచట గలదు? దృశ్యములో లేదు. ఏ లోకమందును లేదు. చక్రవర్తిపదవియందుగాని, ఇంద్రపదవియందుగాని లేదు. దృక్స్వరూపమగు పరమాత్మయందే కలదు. కావున ప్రపంచములో శాంతినిగోరు ప్రతిమానవుడును అట్టి శాంతికి నిలయమైన భగవంతుని శరణుబొందవలెను. అత్తఱి యాతనికా శాంతి తప్పక లభించగలదని శ్రీకృష్ణమూర్తి యిచట ఘంటాపథముగ చెప్పివైచిరి (స్థానం ప్రాప్స్యసి). అయితే అట్టి సర్వోత్తమస్థానమును బొందుటకు తగిన మూల్యమును చెల్లించవలెను. దృశ్యవిషయాభిలాషను పరిత్యజించి పూర్ణభావముతో పరమాత్మను ఆశ్రయించుటయే ఆ మూల్యము.

'శాశ్వతమ్' - అని చెప్పుటచే దైవపదము కాలాతీతమై వెలయుచున్నదని, దానికి వినాశము లేనేలేదని స్పష్టమగుచున్నది. ప్రపంచములోని ప్రతివస్తువు అశాశ్వతమే అయియున్నది. కాలాధీనమే అయియున్నది. కావున అమూల్యమగు ఈ మానవజన్మను బడసి జన్మసార్థకత నొందుటకై అట్టి శాశ్వత దైవ (ఆత్మ) పదమునే సర్వులును పొందుటకు యత్నింపవలెను. భగవానుని ఈ వాక్యములపై పరిపూర్ణ విశ్వాసముంచి తదనురీతి భక్తితో ప్రవర్తింపవలయును.

ప్ర:— పరమాత్మస్థాన మెట్టిది?

ఉ:— (1) పరమశాంతికి నిలయము (2) శాశ్వతమైనది.

ప్ర:— అదిదేనిచే లభించును?

ఉ:— భగవదనుగ్రహముచే.

ప్ర:— భగవదనుగ్రహ మెట్లు కలుగును?

ఉ:— సర్వవిధముల ఆ పరమాత్మను శరణుబొందుటచే కలుగును.

ప్ర:— శాంతిని పొందుటకు మార్గమేమి? శాశ్వత కైవల్యపదవి దేనిచే ప్రాప్తించును?

ఉ:— భక్త్యాదులచే సర్వేశ్వరుని యనుగ్రహమును సంపాదించుటయే శాంతికిని, కైవల్యపదవికిని ఏకైకమార్గము.

అ॥ ఇంతదనుక చెప్పినబోధను చక్కగ విచారణమొనర్చి తన కెట్లుచితమని తోచునో అప్రకార మాచరింపవలసినదిగా భగవాను డర్జునునకు హితము చెప్పుచున్నాడు -

63. ఇతి తే జ్ఞానమాఖ్యాతం గుహ్యాద్గుహ్యతరం మయా విమృశ్యైతదశేషేణ యథేచ్ఛసి తథా కురు.

టీక:– ఇతి = ఈ విధముగా, గుహ్యాత్ = రహస్యమునకంటెను, గుహ్యతరమ్ = మిక్కిలి రహస్యమగు, జ్ఞానమ్ = జ్ఞానము (కర్మ, భక్తి, ధ్యాన, జ్ఞాన వైరాగ్యాది బోధయుక్తమగు ఈగీతాశాస్త్రము), మయా = నాచేత, తే = నీకు, ఆఖ్యాతమ్ = చెప్పబడినది, ఏతత్ = దీనిని, అశేషేణ = సంపూర్ణముగ, విమృశ్య = విమర్శించి (బాగుగ విచారణచేసి) యథా = ఏ ప్రకారముగా, ఇచ్ఛసి = (చేయుటకు) తలంచుచున్నావో, తథా = ఆ ప్రకారముగ, కురు = చేయుము.

తా:– ఈ విధముగా రహస్యములన్నిటికంటెను పరమరహస్యమైనట్టి జ్ఞానమును(గీతాశాస్త్రము) నేను నీకు జెప్పితిని. దీనినంతను బాగుగ విచారణచేసి తదుపరి నీకెట్లిష్టమో అట్లాచరింపుము.

వ్యాఖ్య:– 'గుహ్యాద్గుహ్యతరమ్' - శ్రీకృష్ణపరమాత్మ గీతాశాస్త్రమంతయు నుపదేశించి తుట్టతుదకు దానిని అతిరహస్యమైన విద్యగా వర్ణించుచున్నారు. ఉపనిషత్సారమగు ఈ మహాజ్ఞానమును సద్గురువులు అతిగోప్యముగ నుంచుకొని అధికారులగు సచ్ఛిష్యులకే యుపదేశించుచుందురు. అధికారపురుషుడగుటచే అర్జునునకు శ్రీకృష్ణు డద్దానిని బోధించి తద్ద్వారా లోకమున కంతకును మహోపకార మొనర్చిరి. ఈ జ్ఞానము రహస్యములలోకెల్ల అతిరహస్యమని చెప్పుటవలన దాని ప్రభావమెట్టిదో మనము ఊహించవచ్చును. ఏలయనిన, సామాన్యముగ విలువగలిగిన వస్తువులనే జనులు రహస్యముగ నుంచుదురు కాబట్టి ఈమహత్తర జ్ఞానధనముయొక్క విలువను(గ్రహించి విజ్ఞులగువారు దానిని సద్వినియోగపఱచుకొని ధన్యులు కావలయును.

'విమృశ్యైతదశేషేణ' - మహనీయులు తాము ధర్మమును బోధించినప్పటికిని దానిని గూర్చి ఆలోచించుటకును, విమర్శించుటకును ఇతరులకు పూర్తిగ అధికారమిచ్చుదురు. వారు చెప్పినబోధను పూర్వాపరవిచారణలేక, స్వయముగ దానినిగూర్చి ఆలోచింపక అమాంతముగా గ్రహించుడని ఇతరులకు వారు చెప్పరు. మహాత్ములగు గురువులయొక్క లక్షణ మిట్లే యుండును. గురువు బోధించినదానిని శిష్యుడు తనసొంతపరిజ్ఞానముతో, నిజసంస్కారముతో చక్కగ పరిశీలించి, విచారణ సలిపి, పూర్వాపరములను విమర్శించి తదుపరి దానిలో తనకు నచ్చినదానిని గ్రహింపవచ్చును. ఇట్టిస్వాతంత్ర్యమును పూర్వపు గురువులు తమ శిష్యుల కిచ్చియుండిరి. ఈపద్ధతికి అనుగుణ్యముగనే గురోర్గురువగు శ్రీకృష్ణపరమాత్మయు వ్యవహరించిరి. శ్రీకృష్ణుడు అర్జునునకు బోధింపవలసిన దానినంతను బోధించి తదుపరి 'ఓ అర్జునా! నాపై భక్తిచే, విశ్వాసముచే, గురుత్వముచే నేను చెప్పినదానినంతను నీవు కన్నుమూసికొని గ్రహింపవలెనని నేను చెప్పను. మఱియేమనిన, నీవు సొంతముగ దానిని చక్కగ విమర్శింపుము. వివేచనచేయుము. ఆ పిమ్మట నీకు నచ్చినదానిని గ్రహింపుము.' అని వచించి తనయొక్క విశాలభావమును, ఔదార్యమును ప్రకటించిరి. గురువు బోధించిన దానిని శిష్యుడు సొంతప్రజ్ఞచే సమాలోచన చేయనిచో శిష్యుని బుద్ధి వికసింపదు. ఇదియంతయు ఆలోచించియే భగవానుడు పైవాక్యములను పలికినవారైరి. మఱియు బోధయందు పటుత్వము, యాథార్థ్యము లేనిచో ఇట్టి వాక్యములను ధైర్యముగా ఎవరును పలుకజాలరు గనుక గీతాబోధయొక్క పరమప్రామాణ్యత్వము, సత్యత్వము దీనిచే సువ్యక్తమగుచున్నది. 'అశేషేణ' అని చెప్పుటచే ఒకింత నిచారణతో ముగించవలదనియు, సంపూర్తిగ, సర్వవిధముల సమస్తప్రమాణములతో విచారించుమనియు అర్జునునకు తెలిపినట్లైనది.

'యథేచ్ఛసి తథాకురు' – 'అట్లు విచారణచేసినపిదప నీకెట్లుచితమని తోచునో అట్లాచరింపుము' అని భగవానుడు సెలవిచ్చిరి. గురువగు శ్రీకృష్ణుడు కర్తృత్వమును తనపై పెట్టుకొనలేదు. నిష్కామకర్మముయొక్క చక్కని దృష్టాంత మిచట కానంబడుచున్నది. పదునెనిమిది అధ్యాయముల బోధను అనర్గళముగ నుపదేశించి తుట్టతుదకు దాని ఫలితమును కోరకయే భగవానుడు విరమించుచున్నారు. అర్జుననిచే తిరిగి యుద్ధమును చేయింపించుట తన బోధయొక్క ఒకానొక లక్ష్యమైనప్పటికిని ఆ బోధయొక్క ఫలమగు అట్టి లక్ష్యమును వాంఛింపకయే శ్రీకృష్ణుడు దానిని ముగించివైచెను. 'నీవు యుద్ధముచేయుము, లేక చేయకనుండుము – దానితో నాకు పనిలేదు. నేను చెప్పవలసిన ధర్మమును నీకు చెప్పివేసితిని. ఆ పిదప నీయిష్టము (యథేచ్ఛసి తథాకురు)' – అని భగవానుడు విశాలదృష్టితో పలికిరి. నిష్కామకర్మయొక్క మచ్చుతునక యిది.

అట్లుకాక కర్తృత్వము తమపై వేసికొనినచో ఇక గురువులకు శాంతియుండదు. కావున వారెన్నటికిని అట్లు చేయరు. వారి ధర్మమును (Duty) వారు నెరవేర్చుదురు. ఫలమును వాంఛింపరు. ఇక శిష్యుడు తన ఉద్ధారమును తాను చూచుకొనవలసియుండును. గురువు దారిచూపును. శిష్యుడు తాను సొంతముగ నడపవలెను.

'జ్ఞానమాఖ్యాతమ్' – అని చెప్పినందువలన గీతాశాస్త్రమందు కర్మ భక్త్యాద్యనేకములు వచింపబడినను అవి యన్నియు జ్ఞానమం దంతర్భూతములే యని స్పష్టపడుచున్నది. కర్మ, భక్తి, ధ్యానాద్యనేక ధర్మములుబోధించి తుట్టతుదకు వాని నన్నింటిని కలిపి భగవానుడు 'జ్ఞానం' అను ఒక్క పదములో ఇమిడ్చి యిచట చెప్పివైచిరి. కాబట్టి సమస్తమార్గములు తుదకు జ్ఞానమునందే పరిసమాప్తను బొందుననియు, జ్ఞానమే జీవుల చరమలక్ష్యమనియు, ఆకర్మభక్త్యాదులు జ్ఞానప్రాప్తికి సహాయభూతములుగ నుండుననియు దీనిద్వారా నిశ్చయించుకొనవచ్చును.

ప్ర:– ఈ గీతాజ్ఞాన మెట్టిది?

ఉ:– పరమరహస్యమైనది.

ప్ర:– గురువు జ్ఞానమును బోధించినపిదప శిష్యు డేమిచేయవలెను?

ఉ:– ఆ చెప్పినదానిని తన సొంత భావములతో చక్కగా విమర్శించి, సమాలోచనచేసి తనకు నచ్చినదానిని కార్యానిత్వ మొనర్చవలెను.

అ॥ అర్జుననిపై ప్రీతిగలిగి శ్రీకృష్ణభగవానుడు అతిరహస్యమైన, సారభూతమైన ఒకటి రెండు వాక్యములను మఱల చెప్పదలంచి యిట్లు నుడువుచున్నాడు –

64. సర్వగుహ్యతమం భూయ శ్శృణు మే పరమం వచః
ఇష్టోఽసి మే దృఢమితి తతో వక్ష్యామి తే హితమ్.

టీక:– సర్వగుహ్యతమమ్ = రహస్యములన్నిటిలోను పరమరహస్యమైనదియు, పరమమ్ = శ్రేష్ఠమైనదియు నగు, మే = నాయొక్క, వచః = వాక్కును, భూయః = మఱల, శృణు = వినుము, (త్వమ్ = నీవు), మే = నాకు, దృఢమ్ = మిక్కిలి, ఇష్టః అసి = ఇష్టుడవగుచున్నావు, ఇతి తతః = అను కారణమువలన, తే = నీకు, హితమ్ = హితమును(మేలును), వక్ష్యామి = చెప్పుచున్నాను.

తా:– (ఓ అర్జునా!) రహస్యము లన్నిటిలో పరమ రహస్యమైనదియు, శ్రేష్ఠమైనదియునగు నా వాక్యమును మఱల వినుము. (ఏలయనిన) నీవు నాకు మిక్కిలి ఇష్టుడవు. ఇక్కారణమున నీయొక్క హితమునుగోరి మఱల చెప్పుచున్నాను.

వ్యాఖ్య:– 'సర్వగుహ్యతమమ్' – గుహ్యమ్ = రహస్యమైనది, గుహ్యతరమ్ = పరమరహస్యమైనది, గుహ్యతమమ్ = మిగుల పరమరహస్యమైనది, సర్వగుహ్యతమమ్ = మిక్కిలి అత్యంత పరమరహస్యమైనది. – ఈ ప్రకారముగ శ్రీకృష్ణపరమాత్మ తాను వేయగలిగినన్ని విశేషణములన్నిటిని వేసి ఈ పదమును ప్రయోగించిరి. బోధయొక్క రహస్యత్వపరిమాణము, ప్రభావము దీనిచే గోచరమగుచున్నది. మఱియు చెప్పబోవు బోధయందు పరమ విశ్వాసము, కుతూహలము ఈ పదముచే ఏర్పడుచున్నవి.

'భూయః' – మఱల చెప్పుచున్నాను వినుము. శిష్యునిపైగల వాత్సల్యముచే గురువాతనికి బోధను మఱల మఱల చెప్పును. చెప్పినదానినే మఱల జ్ఞాపకము చేయును. క్రిందటిశ్లోకమున 'ఇతి తే జ్ఞాన మాఖ్యాతమ్' అను వాక్యమును చెప్పి భగవానుడు గీతాబోధనంతను పరిసమాప్తము చేసిరి. అయినను అర్జునునిపైగల వాత్సల్యముచే ప్రేరితుడై మఱల కొంత ఉపదేశము చేయదలంచి ఈ వాక్యములను తిరిగి వచించిరి.

'పరమం వచః' – అని చెప్పుటవలన ఈ చెప్పబోవు వాక్యములు పరమోత్కృష్టములని స్పష్టమగుచున్నది. సాక్షాత్ భగవంతుడే వానిని ఉత్కృష్టములని పేర్కొనుటవలన ఆ వాక్యములపై జనులెంతటి విశ్వాసము గలిగియుండవలెనో ఊహించుకొనవచ్చును.

'ఇష్టోఽసి మే దృఢమితి తతో వక్ష్యామి తే హితమ్' – గురువుయొక్క ఇష్టమును సంపాదించుకొనుటలోనే ఉన్నది శిష్యుని ప్రజ్ఞ. గురువునకు ప్రీతిపాత్రుడగుట శిష్యునకు గొప్పవరప్రసాదము. ఏలయనిన, ప్రీతిపాత్రుడగు శిష్యునకే గురువు తన హృదయమును విప్పి అతిరహస్యములైనవానిని ఉపదేశించును. కనుకనే సేవాశుశ్రూషలద్వారా, నమస్కారాదులద్వారా, వినయవిధేయతలద్వారా గురువుయొక్క ప్రీతిని, ఇష్టమును సంపాదించుకొనినచో ఇక ముక్తిమార్గము శిష్యునకు చేతికి అందినట్లే యగును. ఈ విషయమునే భగవానుడు 'తద్విద్ధి ప్రణిపాతేన'.. (4-34) అను శ్లోకముద్వారా పూర్వము స్పష్టపఱచియుండిరి.

ఇచట అర్జునుడు గురువగు శ్రీకృష్ణునకు ప్రీతిపాత్రుడయ్యెను. ఈసంగతిని శ్రీకృష్ణుడే 'ఇష్టోఽసి మే దృఢమితి' అను వాక్యముద్వారా తేటతెల్లమొనర్చిరి. హృదయమెపుడు పరిపక్వమై, నిర్మలమై, భక్తియుతమై యలరారునో, అపుడు గురువాతనిని వెతకి కొనుచువచ్చి ఆతనిహృదయక్షేత్రమునందు జ్ఞానబీజమును నాటిపోవును. చరిత్రలో అనేక దృష్టాంతము లిట్టివి కానంబడుచున్నవి. ప్రస్తుత సందర్భమునగూడ అర్జునుడు పరిపక్వ నిర్మలహృదయుడుగా నుండుటంబట్టి సాక్షాత్ భగవానుడే అర్జునునకు స్వయముగ హితమును బోధించిరి. మోక్షమునకు ఎవరు దారిచూపుదురాయని చింతింప పనిలేదు. వారి వారి హృదయమును, మనస్సును, భక్తిసంయుతముగ, పవిత్రముగ నుంచుకొనిన చాలును. సద్గురువుల యొద్దకు చేర్చును. లేక తానే వారిహృదయమున సద్బోధలను గావింపజేయును.

'నీవు నాకు ఇష్టుడవైనందువలన నీకు హితమును చెప్పుచున్నాను' అని భగవానుడు అర్జునునితో చెప్పుటవలన సర్వేశ్వరునియొక్కయు, సద్గురువులయొక్కయు అనుగ్రహమును సంపాదింపనివారికి

వారిద్వారా బోధయు లభింపకుండునని స్పష్టమగుచున్నది. కనుకనే శాస్త్రములలో పెక్కుచోట్ల **ఈశ్వరానుగ్రహములేనిచో,** సద్గురువుల అనుగ్రహములేనిచో అద్వైతజ్ఞానము (ఆత్మసాక్షాత్కారము) కలుగజాలదని చెప్పబడినది. కాబట్టి ముముక్షువులగు సాధకులందరును ఇవ్విషయమున కడుజాగరూకులై సర్వేశ్వరునియొక్కయు, సద్గురువులయొక్కయు అనుగ్రహమును సంపాదించుటకొఱకై నామస్మరణ, పూజా, సేవాదికార్యములను జేయుచు భక్తిభావసమన్వితులై యుండవలెను.

ప్ర:– శ్రీకృష్ణమూర్తి అర్జుననకు తిరిగి యెట్టి బోధను చెప్పదలంచిరి?

ఉ:– అతి రహస్యమై, సర్వోత్కృష్టమైనట్టిబోధను.

ప్ర:– శ్రీకృష్ణమూర్తి గీతాశాస్త్రమును అర్జుననికే ఏల బోధించిరి?

ఉ:– అర్జునుడు శ్రీకృష్ణునికి పరమప్రీతిపాత్రుడు కనుక (ఇష్టోఽసి మే దృఢమితి).

అ॥ తాను చెప్పదలంచిన పరమరహస్యమగు బోధను భగవానుడు రెండుశ్లోకముల ద్వారా చెప్పుచున్నాడు –

65. మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు
మామేవైష్యసి సత్యం తే ప్రతి జానే ప్రియోఽసి మే.

టీక:– మన్మనాః = నాయందు మనస్సుగలవాడవును, మద్భక్తః = నాయందు భక్తి యున్నవాడవును, మద్యాజీ = నన్నారాధించువాడవును, భవ = అగుము, మామ్ = నన్ను, నమస్కురు = నమస్కరింపుము, మామ్ ఏవ = నన్నే, ఏష్యసి = పొందగలవు, మే = నాకు, ప్రియః అసి = ఇష్టుడవైయున్నావు (కాబట్టి), తే = నీ కొఱకు, సత్యమ్ = యథార్థముగా, ప్రతిజానే = ప్రతిజ్ఞ చేయుచున్నాను (ప్రతిజ్ఞచేసి చెప్పుచున్నాను).

తా:– నాయందు మనస్సునుంచుము, నాయెడల భక్తి గలిగియుండుము, నన్నారాధించుము, నాకు నమస్కరింపుము. అట్లు కావించెదవేని నీవు నన్నే పొందగలవు. నీవు నాకిష్టుడవైయున్నావు. కాబట్టి యథార్థముగా ప్రతిజ్ఞచేసి చెప్పుచున్నాను.

వ్యాఖ్య:– ఈ శ్లోకము, రాబోవు చరమశ్లోకము గీతాసారమును తెలుపునవియైయున్నవి. భగవానుడు అతిరహస్యమగు బోధను చెప్పెదనని పలికి వీనిని ప్రారంభించుటవలన ఈశ్లోకములయొక్క మహత్తు ఎట్టిదో ముందుగనే ఊహించుకొనవచ్చును. ఈ రెండుశ్లోకములందును మొదటిపాదము 'సాధనను' రెండవపాదము 'సాధ్యమును' తెలుపుచున్నవి. అనగా ఏ సాధనచేయవలెనో మొదటిపాదములో చెప్పి దానికి లభించు ఫలితమునుగూడ వెంటనే రెండవపాదములో చెప్పివైచెను. ఇచట నాలుగు సాధనలు పేర్కొనబడినవి. (1) మనస్సును దైవమందు లగ్నముచేయుట (2) దైవమందు భక్తిగలిగియుండుట (3) దైవమునే ఆరాధించుట (4) దైవమునకే నమస్కరించుట. ఈ నాలుగు సాధనలను చేయువాడు లక్ష్యమగు పరమాత్మను తప్పక పొందగలడు (మామేవైష్యసి). పరమాత్మప్రాప్తియే ఈసాధనయొక్క ఫలితమైయున్నది.

కాబట్టి జనులు తమ మనస్సును ప్రాపంచిక దృశ్యవిలాసములనుండి, శబ్దాది విషయములనుండి మఱలించి ఆత్మయందే (దైవమందే) నెలకొల్పవలెను. మఱియు జనులకు ఏ భక్తి, ఏ ప్రీతి

బాహ్యవిషయములందు కలదో దానిని అచ్చోటనుండి మఱలించి భగవంతునియందు స్థాపించవలెను. వారినే అర్చించవలెను. ధ్యానించవలెను. వారికే నమస్కరించవలెను. అజ్ఞానులగు జనులు అట్లుచేయక తమచిత్తములను దృశ్యవిషయములందే లగ్నముచేయుచు, వానినే సేవించుచు, కామాది రాక్షసులకే నమస్కరించుచు, వారినే అర్చించుచు, పరిపోషించుచున్నారు. అట్టివారు భగవానుని యెన్నడును పొందలేరని ఈశ్లోకముద్వారా స్పష్టమగుచున్నది. కావున అట్టి విషయసేవనమును వదలివైచి జనులు తమ చిత్తమును పరమాత్మయందే కేంద్రీకరించవలెను. అత్తఱి వారు పరమాత్మను నిక్కముగా పొందగలరు.

'సత్యం తే ప్రతిజానే' - ఆ ప్రకారము సాధనలను చేయువారు భగవానుని పొందుదురో - లేదో యని అర్జునునకు సంశయములు కలుగునేమోయని తలంచికాబోలు 'ఇది సత్యము నేను ప్రతిజ్ఞ చేసి చెప్పుచున్నాను' అని శ్రీకృష్ణమూర్తి అసందిగ్ధముగ చెప్పివైచిరి. సాక్షాత్ భగవానుడే తాను ప్రతిజ్ఞ చేసి చెప్పుచున్నానని పలికినపుడు ఇక ఆ వాక్యము లెంతటి పరమసత్యములో ఊహించుకొనవచ్చును. ఈప్రకారముగ భగవానుడు ప్రతిజ్ఞచేసి చెప్పినచోట్లు గీతలో చాల అరుదు. కావున సాధకు లిట్టి అపూర్వవాక్యములపై పరిపూర్ణశ్రద్ధనుంచి తదనురీతి యాచరించి, భగవత్సాక్షాత్కారమను మహోన్నత ఫలితమును బొంది కృతార్థులు కావలయును.

'మన్మనాభవ ' - అను వాక్యమునందు. కర్మ, భక్తి, ధ్యాన, జ్ఞానములను నాలుగు సాధనలున్ను తెలుపబడినవి.

ప్ర:– భగవత్ప్రాప్తికి (మోక్షమునకు) ఉపాయలేవి?

ఉ:– (1) భగవంతునియందు (ఆత్మయందు) మనస్సు లగ్నమైయుండుట (2) భగవంతునిపై భక్తి కలిగియుండుట (3) భగవానుని ఆరాధించుట (4) భగవంతునకు నమస్కరించుట.

ప్ర:– భగవంతు డెవనిపై తన కృపాకటాక్షమును ప్రసరించును?

ఉ:– తన్నారాధించుటద్వారా తన యిష్టతను సంపాదించుకొనినవారిపై.

ప్ర:– పైన దెల్పిన విధముగ దైవమునుగూర్చి యత్నించువారికి కలుగు ఫలితమేమి?

ఉ:– వారు దైవమునే పొందెదరు. ఈ వాక్యము పరమసత్యము. సాక్షాత్ శ్రీకృష్ణమూర్తియే ఆ వాక్యములను సత్యమని ప్రతిజ్ఞచేసి చెప్పిరి.

అ॥ గీతాసారమగు చరమశ్లోకమును చెప్పుచున్నాడు -

66. సర్వధర్మాన్పరిత్యజ్య మామేకం శరణం వ్రజ
అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః.

టీక:– సర్వధర్మాన్ = సమస్తధర్మములను, పరిత్యజ్య = విడిచిపెట్టి, మామ్ = నన్ను, ఏకమ్ = ఒక్కనిమాత్రము, శరణం వ్రజ = శరణుబొందుము, అహమ్ = నేను, త్వా = నిన్ను, సర్వపాపేభ్యః = సమస్తపాపములనుండియు, మోక్షయిష్యామి = విడిపించెదను, మాశుచః = శోకింపకుము.

తా:– సమస్తధర్మములను విడిచిపెట్టి నన్నొక్కనిమాత్రము శరణుబొందుము. నేను సమస్త పాపములనుండియు నిన్ను విముక్తునిగ జేసెదను.

వ్యాఖ్య:– ఈ శ్లోకము చాల ముఖ్యమైనది. దీనిని చరమశ్లోకమని యందురు. ఋష్యాది న్యాసములలో ఈ శ్లోకముయొక్క మొదటిపాదము శక్తియనియు, రెండవపాదము కీలకమనియు చెప్పబడినది. దీనిచే ఈ శ్లోకముయొక్క ప్రాధాన్యము వెల్లడియగుచున్నది. గీతాశాస్త్రముయొక్క తత్త్వబోధయందలి తుదిశ్లోకముగనుక సారమంతయు నిమిడ్చి భగవాను డిద్దానిని చెప్పివైచిరి. ఇందు తెలుపబడిన భగవచ్ఛరణాగతి, ప్రపత్తి సాధకులకు అతిముఖ్యమైనది. వైష్ణవులీశ్లోకమును అతిప్రధానముగ నెంచి మంత్రమువలె సదా దీనిని జపించుచుందురు.

'సర్వధర్మాన్ పరిత్యజ్య' – నిత్యనైమిత్తికాది సమస్త ధర్మములకంటెను, కర్మలకంటెను భగవచ్ఛరణాగతి ఎన్నియోరెట్లు అధికఫలములను గలుగజేయును. ఆ చిన్నచిన్న ధర్మములు, కర్మలు అన్నియు పుణ్యమును గలుగజేయును. భగవచ్ఛరణాగతి మోక్షమునే కలుగజేయును. ఆ యా ధర్మములన్నింటియొక్క, కర్మలన్నింటియొక్క ఫలితము శరణాగతియొక్క ఫలితముననే ఇమిడియున్నది. (నూటిలో పది ఇమిడి యున్నట్లు). కావుననే భగవానుడు ఆ స్వల్పస్వల్పకార్యము లన్నిటిని విడిచిపెట్టి అనంతమోక్షఫలమును గలుగజేయుదానినే పట్టుకొనుమని బోధించిరి. 'మామేకమ్' – అని చెప్పుటవలన భగవంతు నొక్కరినే ఆశ్రయించిన చాలును, సమస్త కర్మ ధర్మములను ఆశ్రయించినట్లే యగునని విదితమగుచున్నది. చెట్టుమూలమును తడిపినచో శాఖాపత్రాదులన్నిటిని తడిపినట్లే యగునుగదా! పైగా పెక్కుమార్గములు, కర్మలు, ధర్మములు గజిబిజిగానుండి మనస్సునకు విక్షేపమునుగూడ కలుగజేయవచ్చును. కాబట్టి ఒక్కదానినే ఆశ్రయించుట శ్రేయస్కరము. ఆ ఒక్కటి యేది? దేనిని తెలిసికొనినచో సమస్తము తెలియబడినదగునో, దేనినిపొందినచో సమస్తము పొందబడినదియగునో, అట్టి ఆత్మవస్తువును, బ్రహ్మవస్తువును (భగవంతుని) ఒక్కరిని ఆశ్రయించిన చాలును. ఇతర గొడవలతో, ఇతర సాధనలతో, ఇతర ధర్మములతో, ఇతర కర్మలతో పనిలేదు. కావుననే వాని నన్నింటినివదలి తననొక్కనినే శరణుబొందుమని భగవాను డుపదేశించిరి.

'అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి' – అయితే కొందఱిట్లు ప్రశ్నించవచ్చును – అన్ని కర్మలు, ధర్మములు వదలుకొని భగవంతుని ఆశ్రయించినచో ఆతడు మాకేమి యొసంగగలడు? అని. అందులకు శ్రీకృష్ణభగవానుడు సూటియైన సమాధానమిచ్చిరి – 'అట్లు నన్నాశ్రయించినచో మీయొక్క సమస్తపాపములనుండి, బంధములనుండి మిమ్ములను విముక్తునిగ జేసెదను' – అని. 'సర్వపాపేభ్యో' – అని చెప్పుటవలన ఏ ఒక్క పాపమునుండియో కాదనియు సమస్తపాపములనుండియు విడుదల పొందించెద ననియు హామీనిచ్చిరి – అనగా సంపూర్ణముగ బంధవిముక్తునిగ జేసెదనని చెప్పిరి. మనుజున కింతకంటె నధికముగ కావలసినది యేమున్నది? జనన మరణాది బంధమునుండి తప్పించుకొనుట, కర్మపాశమునుండి విముక్తుడగుట ఒక్కటియే అతనికి కావలసినది. అది కలుగజేసెదనని భగవానుడు ప్రతిజ్ఞచేసిరి. అయితే యెవరికి? అందఱికినికాదు. అందఱును భగవంతుని బిడ్డలు అయియున్నప్పటికిని ఎవరు చేయిజాచి ఆతని నాహ్వానింతురో వారినే పట్టుకొని తన యొడిలో కూర్చుండబెట్టుకొనును. ఎవడు సమస్తవాంఛలను, కర్మలను, ధర్మములను వదలి తన్ను (భగవానుని, లేక ఆత్మను) ఒక్కనినే శరణుబొందునో, శరీరవాఙ్మనంబులచే తననే ఆశ్రయించునో, అనగా దృశ్యవస్తువులను, దృశ్యవిషయసంబంధకర్మలను, ధర్మములను త్యజించి దృగ్రూపమగు ఆత్మనొకదానినే అవలంబించునో అట్టివానిని మాత్రమే సంసారబంధ (పాప) శృంఖలములనుండి విడివడజేసి తరింపజేసెదనని శ్రీకృష్ణమూర్తి అసందిగ్ధముగ చెప్పివైచిరి.

దీనినిబట్టి జీవుడు నెరవేర్చవలసినదానిని నెరవేర్చినచో భగవంతుడు తానీయవలసినదానిని ఇచ్చునని స్పష్టమగుచున్నది. ఈ శ్లోకమందలి మొదటిపాదము జీవుని కర్తవ్యమును సూచించును. రెండవపాదము భగవంతు డొసంగు ప్రతిఫలమును సూచించును. జీవుడు తానుచేయవలసినది చేయనిచో భగవంతుడు తానొసంగవలసినదాని నొసంగరు. జీవుడు పరమాత్మనాశ్రయించనిచో, దృశ్యపదార్థములనుమాత్రమే అంటిపెట్టుకొనినచో పరమాత్మ మాత్ర మేమి చేయగలరు? ప్రకృతియందొకానొక అప్రతిహతనియమమును భగవాను డేర్పఱచిరి. అది యేదనగా - పాపముచే దుఃఖము, పుణ్యముచే సుఖము, జ్ఞానముచే లేక భగవచ్ఛరణాగతిచే మోక్షము కలుగును. ఎవరు ఏవిధముగ నాచరించుదురో వారావిధమగు ఫలితమునే అనుభవించుదురు. ఇందు భగవంతుని పక్షపాతమేమియులేదు. 'చేసుకొన్నవారికి చేసుకొన్నంత మహాదేవ!'

'సర్వధర్మాన్ పరిత్యజ్య' - అను వాక్యమునకు మఱియొక అర్థమున్ను కలదు. 'దృశ్యభావనలన్నింటిని వదలి దృగ్వస్తువగు ఆత్మనొకదానినే శరణుబొందుము.' అనియు చెప్పవచ్చును. ఇది ఇంకను శ్రేష్ఠమైన అర్థము. త్యాగముచే మోక్షము లభించునను శాస్త్రనిర్ణయము నిది చక్కగ పోషించుచున్నది. ఒకదానిని త్యజించనిదే మఱియొకటి లభించదు. దయ్యమును పట్టుకొనినచో దేవుడు లభించడు. దేవుని పట్టుకొనవలెననిన దయ్యమును (దృశ్యరూప పిశాచమును) వదలవలెను. అనగా దృశ్యమునుగూర్చి, అనగా క్షేత్రమునుగుఱించిన భావములను త్యజించి క్షేత్రజ్ఞుడగు పరమాత్మను శరణుబొందవలెను.

ఈ శ్లోకమున సమస్త ధర్మములను వదలుమని చెప్పినంతమాత్రమున అధర్మము నాచరించవలెనని అర్థముకాదు. లేక ధర్మములను వదలి సోమరిగ నుండుమని కాదు. మహాధర్మమగు భగవచ్ఛరణాగతిలోనే, ఆత్మాశ్రయములోనే తక్కిన అవాంతర ధర్మము లన్నియు అంతర్భూతములైయుండునుగావున - 'శతే పంచాశత్' (నూరులో యాభై ఇమిడియుండును అను) న్యాయము ననుసరించి అట్టి మహద్ధర్మము నాశ్రయించువారు చిన్న చిన్న ధర్మములను ప్రత్యేకముగ ఆచరించ నవసరములేదనియు, దాని నొక్కదానిని చక్కగ పాలించిన చాలుననియు చెప్పుటయే యగును. ఇచట పెద్దధర్మమున్నపుడు చిన్నధర్మమును పట్టుకొన నవసరములేదని చెప్పుటయేకాని, చిన్నధర్మమునందు అసలు ఏమియు సత్తువలేదనికాని, దానిని వదలి సోమరిగా నుండుమని కాని అర్థముకాదు. కాబట్టి పదములను జాగ్రత్తగ అన్వయించుకొనవలెను.

'మాశుచః' - 'ఈ సత్యమును తెలిసికొని భగవచ్ఛరణాగతి యొనర్చి ఇక యేమాత్రము శోకింపకుము' అని శ్రీకృష్ణమూర్తి అర్జునున కానతిచ్చిరి. దుఃఖరహితమగు శాశ్వత ఆత్మపదము, భగవంతుని స్థానము లభించుచున్నపుడు, ఇక శోకమున కాస్కారమే లేదు. దృశ్యము నాశ్రయించువారిని, నశ్వరవస్తువులను నమ్ముకొనువారిని శోకము బాధించునేకాని, శాశ్వతమగు ఆత్మను, భగవంతుని ఆశ్రయించువారిని కాదు. వారు నిత్యము పరమానందమునే యనుభవించుదురు. కనుకనే 'నన్నాశ్రయించినచో ఇక నీవు దుఃఖపడవలసిన అవసరము లేదనియు, కాబట్టి శోకించవద్దు (మాశుచః)' అనియు అర్జునునకు శ్రీకృష్ణమూర్తి బోధించుటకు కారణము.

'అశోచ్యానన్వశోచస్త్వమ్' - అను శోకరాహిత్యబోధద్వారా గీత ప్రారంభమై 'మాశుచః' అను శోకరాహిత్యవాక్యముతో అంతమైనదికావున గీతాలక్ష్యము శోకరాహిత్యమే యని స్పష్టపడుచున్నది. దుఃఖరాహిత్యము, ఆనందప్రాప్తి - సంసారదుఃఖశమనము, బ్రహ్మానందప్రాప్తి - ఇవియే గీతాలక్ష్యములు. అట్టి లక్ష్యములను జీవులచే బొందింపజేయుటయే గీతయొక్క ఆశయము.

ఈ శ్లోకమునందు అతిసులభమైన భక్తి, ప్రపత్తి, శరణాగతిమాత్రమే ముక్తికి హేతువుగ తెలుపబడుటచే ఇక గొప్పగొప్ప శాస్త్రములు చదువలేనివారు పాండిత్య ప్రతిభ లేనివారు, చదువురానివారు మోక్షమునకై దిగులునొందవలసిన పనిలేదనియు, నిర్మల దైవభక్తియొక్కటుండిన చాలుననియు తెలియుచున్నది.

ఈ శ్లోకము గీతయందు చాల ముఖ్యమైనదగుటచే దీనిని బాగుగ కంఠస్థము చేసి అర్థము సదా మననము చేయుచునుండుట ముముక్షువుల కత్యంత శ్రేయస్కరము.

ప్ర:— జీవులకు సమస్త పాపనివృత్తి, బంధవిముక్తి, దుఃఖనివృత్తి యెట్లు కలుగగలదు?

ఉ:— సమస్త (నిత్యనైమిత్తికాది) ధర్మములను, కర్మలను లేక సమస్త దృశ్యభావనలను వదలివైచి భగవంతుని (ఆత్మను) ఒక్కనినే ఆశ్రయించినచో, వారే జీవునకు మోక్షమునొసంగగలరు.

ప్ర:— శోకరాహిత్యమునకు మార్గమేమి?

ఉ:— భగవచ్ఛరణాగతియే, దైవాశ్రయమే.

అ॥ భక్తిలేనివానికి, భగద్వాక్యముపై విశ్వాసములేనివానికి ఈ గీతాశాస్త్రమును ఉపదేశింపరాదని తెలుపుచున్నాడు -

67. ఇదం తే నాతపస్కాయ నాభక్తాయ కదాచన
న చాఽశుశ్రూషవే వాచ్యం న చ మాం యోఽభ్యసూయతి.

టీక:— తే = నీకు, (అభిహితమ్ = చెప్పబడిన), ఇదమ్ = ఈ గీతాశాస్త్రము, కదాచన = ఎప్పుడును, అతపస్కాయ = తపస్సు లేనివానికొఱకు (లేక సంసారబంధమునుండి తప్పించుకొనవలెనని పరితపించనివానికి), న వాచ్యమ్ = చెప్పదగినదికాదు, అభక్తాయ = భక్తుడు కానివాని కొఱకును, న *(వాచ్యమ్)* = **చెప్పదగినదికాదు,** అశుశ్రూషవే చ = వినుట కిచ్ఛలేనివానికొఱకును (లేక గురుసేవ చేయనివానికొఱకు), న *(వాచ్యమ్)* = చెప్పదగినదికాదు, యః = ఎవడు, మామ్ = నన్నుగూర్చి, అభ్యసూయతి = **దూషించునో** (లేక అసూయజెందునో) *(తస్మై)* చ = అతనికొఱకును, న *(వాచ్యమ్)* = చెప్పదగినది కాదు.

తా:— నీకు బోధింపబడిన ఈగీతాశాస్త్రమును తపస్సులేనివానికిగాని, భక్తుడు కానివానికిగాని, వినుట కిష్టములేనివానికి గాని (లేక గురుసేవ చేయనివానికిగాని), నన్ను దూషించువానికిగాని (లేక, నాయెడల అసూయజెందువానికిగాని) ఎన్నడును చెప్పదగినదికాదు.

వ్యాఖ్య:— ఈ గీతాశాస్త్రమును ఎవరికి బోధింపరాదో ఈ శ్లోకమున తెలియజేయబడినది. ఏలయనగా అతిపవిత్రమైన ఈ బోధ అపాత్రునకు, అనర్హునకు ఒసంగబడుటద్వారా నిరుపయోగముకారాదు. అహంభావము, గర్వము హృదయమున బాగుగ తాండవించునపుడు జనులకీ బోధచేసినను వారి మనస్సునకెక్కదు. మురికి గుడ్డకు రంగుపట్టదు. కావున వినయవిధేయతలు, భక్తిసేవాది భావములు మున్నగునవి ఉన్నవారికే ఈగీతాశాస్త్రమును బోధింపవలెనుగాని తదితరులకు కాదని భగవానుడు చెప్పిరి. ఇట్టి అమూల్యమగుబోధ అనర్హులచేతిలోపడినచో నిష్ప్రయోజనమై పోవునుగాన అట్టిస్థితిని ఎవరును కలుగజేయకుండుటకుగాను గీతాబోధ చివఱ ఇట్టి హెచ్చరికచేయబడినది. తపస్సులేనివానికి, భక్తిలేనివానికి, (గురు) శుశ్రూష చేయనివానికి, భగవంతుని నిందించువానికి ఈ గీతాశాస్త్రమును బోధింపరాదని యిచట తెలుపబడినది. ఇచట తపస్సనగా పాపములను, హృదయమాలిన్యమును తపింపజేయుటయే యగును. లేక

'ఈ సంసారబంధమునుండి ఎప్పుడు తప్పించుకొందుమా' యను తీవ్రపరితపన అనియు చెప్పవచ్చును. అట్టి ఉత్కటపరితపనగలవానికి పరమార్థబోధ ఏది చెప్పినను బాగుగ ఒంటపట్టును (రోగిని ఔషధమువలె). ఇచట శుశ్రూషయనగా గురుసేవ, పెద్దలసేవ, భగవత్సేవయని చెప్పవచ్చును. లేక శ్రవణము చేయుటకు కుతూహలము అనియు పేర్కొనవచ్చును. 'కదాచన' అని చెప్పుటవలన ఇట్టి సుగుణములు లేనివారికి ఏ కాలమందును గీతాశాస్త్రమునుపదేశింపరాదని భగవానుడు హెచ్చరికచేసిరి. వారెవ్వరైనను సరియే లోకదృష్టిలో ఎంతటి గొప్పవారైనను సరియే. అవి కలవారికో - వారెంతటి నీచజాతి యందున్నను, విద్యావిహీనులైనను సరియే తప్పక ఉపదేశింపవచ్చునని భావము. అపాత్రులకు, అనర్హులకు, అసూయాపరులకు, దైవవిద్వేషులకు, నాస్తికులకు బోధింపబడినచో అధ్యాత్మవిద్య సత్ఫలితములను గలుగజేయజాలకుండును. కావున యోగ్యులకే అద్దాని నుపదేశింపవలయును. ఇచట గీతాశాస్త్రశ్రవణమునకు, పఠనపాఠనములకు భక్త్యాది సద్గుణముల యొక్కయే ఆవశ్యకత చెప్పబడినదిగాని, తదితతరముకాదనువిషయము బాగుగ గమనించగదియున్నది.

ప్ర:– ఈ గీతాశాస్త్రమును ఎవని కుపదేశింపరాదు?

ఉ:– (1) తపస్సులేనివానికి (2) భక్తిలేనివానికి (3) శుశ్రూషచేయనివానికి (4) భగవంతుని నిందించువానికి - ఉపదేశింపరాదు.

ప్ర:– దీనినిబట్టి గీత నెవరికి బోధింపవచ్చునని తేలుచున్నది?

ఉ:– (1) తపస్సుకలవానికి (2) భక్తికలవానికి (3) శశ్రూషచేయువానికి (4) భగవంతుని నిందింపనివానికి బోధింపవచ్చును.

అ॥ ఈ గీతాశాస్త్రమును శ్రద్ధగల యితరులకు బోధించువారు తనకు అత్యంతప్రియులని, వారుతప్పక తన్ను పొందగలరని భగవానుడు రెండు శ్లోకములద్వారా తెలియజేయుచున్నాడు -

68. య ఇమం★ పరమం గుహ్యం మద్భక్తేష్వభిధాస్యతి
భక్తిం మయి పరాం కృత్వా మామేవైష్యత్యసంశయః.

టీక:– యః = ఎవడు, పరమం గుహ్యమ్ = అతిరహస్యమైన, ఇమమ్ = ఈ గీతాశాస్త్రమును, మద్భక్తేషు = నా భక్తులకు, అభిధాస్యతి = చెప్పునో, (సః = అట్టివాడు), మయి = నాయందు, పరామ్ = శ్రేష్ఠమైన, భక్తిమ్ = భక్తిని, కృత్వా = చేసి (కలిగి), అసంశయః = సంశయరహితుడై (లేక నిస్సందేహముగ), మామ్ ఏవ = నన్నే, ఏష్యతి = పొందగలడు.

తా:– ఎవడు అతిరహస్యమైన గీతాశాస్త్రమును నాభక్తులకు చెప్పునో అట్టి వాడు నాయం దుత్తమభక్తిగలవాడై, సంశయరహితుడై (లేక, నిస్సందేహముగ) నన్నే పొందగలడు.

వ్యాఖ్య:– గీతా ప్రచారముయొక్క మహత్తర ఫలితమును భగవాను డిచట తెలుపుచున్నాడు.

★ ఇదం - పాఠాన్తరము.

గీతాప్రచారము యెడల భగవానున కెంత ప్రీతియో ఈ వాక్యముల వలన వెల్లడియగుచున్నది. గీతాప్రబోధ ఫలితము సాక్షాన్మోక్షమే యని యిట వక్కాణింపబడినది. (మామేవైష్యతి). తన భక్తులకు గీతాశాస్త్రమును బోధించువారు పరాభక్తి కలవారై బ్రహ్మసాయుజ్యమును బడయుదురని యిట వచింపబడినది. దీనినిబట్టి ఇతరులకు ఉపకారముచేయుటయే సర్వోత్తమభక్తి (పరాభక్తి) యగుచున్నది. ఇతరులకు ఉపకారముచేయుట యనగా ఆ యా రూపములతోనున్న భగవమతునకు సేవ చేయుటయే యగును. కావుననే యిది సామాన్యభక్తిగా గాక పరాభక్తిగా నిట వర్ణింపబడెను. అన్నిదానములకంటెను జ్ఞానదానము సర్వోత్తమమైనది కావున ఇతరులకు చేయుజ్ఞానదానము పరాభక్తిగ నిట వర్ణింపబడెను. 'అసంశయః' అని చెప్పినందువలన అట్టి గీతాప్రబోధకుడు తప్పక ముక్తినొందగలడని, సంశయరహితుడు కాగలడని విదితమగుచున్నది. కావున సర్వులున్ను ఇట్టి మహత్తరఫలితము నొసంగగల ఈ గీతాశాస్త్రమును తాము శ్రద్ధతో పఠించి దానిని ఇతరులకుకూడ బోధించుట ధర్మము.

ప్ర:— ఈగీతాశాస్త్ర మెట్టిది?

ఉ:— రహస్యమైనది.

ప్ర:— దీనిని ఎవరికి బోధించవలెను?

ఉ:— భగవద్భక్తులకు (క్రిందటి శ్లోకమున దెలిపిన దుర్గుణములు లేనివానికి)

ప్ర:— అట్లు బోధించువారికి కలుగు ఫలితమేమి?

ఉ:— వారు పరాభక్తికలవారై సంశయరహితులై భగవంతునే పొందుదురు (ముక్తులగుదురు). ఇవ్విషయమున సందియములేదు.

69. న చ తస్మాన్మనుష్యేషు కశ్చిన్మే ప్రియకృత్తమః
భవితా న చ మే తస్మా దన్యః ప్రియతరో భువి.

టీక:— మనుష్యేషు = మనుజులలో, తస్మాత్ = అట్టివానికంటె, మే = నాకు, ప్రియకృత్తమః = మిక్కిలి ప్రియమునొనర్చువాడు, కశ్చిత్ = ఒక్కడును, న చ = లేనేలేడు, తస్మాత్ = అతనికంటె, మే = నాకు, ప్రియతరః = మిక్కిలి ఇష్టుడైనవాడు, అన్యః = ఇతరుడు, భువి = భూలోకమున, భవితా న చ = కలుగబోడు.

తా:— మనుజులలో అట్టివానికంటె నాకు మిక్కిలి ప్రియమునొనర్చువా డెవడును లేడు. మఱియు అతనికంటె నాకు మిక్కిలి ఇష్టుడైనవాడు ఈ భూలోకమున మఱియొకడు కలుగబోడు.

వ్యాఖ్య:— క్రిందటి శ్లోకమున్ను, ఈశ్లోకమున్ను భగవానునకు అధ్యాత్మవిద్యావ్యాప్తియెడల, గీతాతత్త్వ ప్రచారముయెడల ఎంతటి ప్రీతిగలదో సువ్యక్తము చేయుచున్నవి. గీతను భగద్భక్తులకు బోధించువానికంటె మిక్కిలి ప్రియమునొనర్చువాడు తనకు మఱియొక డెవడును లేడని శ్రీకృష్ణమూర్తి వచించిరి. 'ప్రియకృత్తమః' అని 'తమ' ప్రత్యయమును వాడుటచే అట్టివాడు భగవానునకు మహాప్రియమునొనర్చువాడని స్పష్టమగుచున్నది. (ప్రియకృత్, ప్రియకృత్తరః. ప్రియకృత్తమః) ప్రపంచములో దేవునకు ప్రియమొనర్చుటకై అనేక పుణ్యకార్యములను జనులు చేయుచున్నారు. కాని వారి యందఱికంటెను ఈ గీతాతత్త్వప్రబోధకుడే

అధికపుణ్యమును సంపాదించుకొనుచున్నాడు. ఏలయనిన, అక్కార్యముద్వారా యతడు సర్వేశ్వరునకు మహత్తరప్రియము నొనర్చుచు తత్ఫలితముగ సాక్షాత్ బ్రహ్మసాయుజ్యమునే పడయుచున్నాడు. అట్టివాడు భగవంతునకు పరమ ప్రీతిపాత్రుడు (ప్రియతముడు) అగుచున్నాడు. భూతభవిష్యద్వర్తమానముల యందు అంతటి ఇష్టుడు వేఱొకడు తనకెన్నడును లేడని శ్రీకృష్ణపరమాత్మ అట్టి గీతాప్రబోధకునిగూర్చి తన సదభిప్రాయమును వెల్లడించుటచూడ అట్టి గీతాప్రచారకార్యము మహాపుణ్యప్రదమైనదని, భగవత్ప్రీతికరమైనదని తెలియుచున్నది. నిజముగా జీవితములో భగవంతునకు ప్రీతిపాత్రుడుగ నుండుటకంటె వేఱొక గొప్ప విషయమేమున్నది? అట్టివానిజన్మ సార్థకమైనట్లే.

జగన్నాథుడగు సర్వేశ్వరునకు ప్రియుడుగా నుండగల్గునట్టి జన్మము ధన్యము. అట్టి భగవత్ప్రియత్వమే జీవితపరమావధి కావున ప్రతివారున్ను గీతాతత్త్వమును తాము చక్కగ అనుభూతమొనర్చుకొని, ఇతరులకున్ను దానిని బోధించవలెను. ఇవ్విధముగ తాను తరించి ఇతరులనుగూడ తరింపజేసి, తద్ద్వారా భగవంతునకు అతిప్రియముగా నుండగల్గు సౌభాగ్యమును నోచుకొనవలెను. ఎవడు దేవునకు మిగుల ప్రియమగు కార్యమును జేయునో అతడు దేవునకు మిక్కిలి ఇష్టుడగును.

గీతాప్రబోధముయొక్క మహిమనుగూర్చి భగవాను డివ్విధముగ తెలియజేసినందు వలన ఇక ప్రతివారును తమతమ గ్రామములలోను తమతమ పరిసర ప్రాంతములలోను, గీతాసంఘములను స్థాపించి, తద్ద్వారా గీతాజ్ఞానమును ప్రజలలో లెస్సగ వ్యాపింప జేయుట ధర్మము. అట్లు చేసినచో అది భగవానునకు అతిప్రియకరకార్యమై యలరును. వారున్ను సర్వేశ్వరునకు మిక్కిలి ప్రీతిపాత్రులగుదురు (గీతాప్రచారమును గూర్చిన వివరములకై గ్రంథారంభమునగల 'గీతప్రచారము' అను శీర్షికక్రింద చూడనగును).

ప్ర:– ఈ ప్రపంచమున భగవంతునకు మిక్కిలి ప్రియమొనర్చువాడు, భగవంతునకు మిక్కిలి ఇష్టుడు ఎవుడు?

ఉ:– గీతాతత్త్వమును భగవద్భక్తులకు బోధించువాడు.

ప్ర:– అతనికంటె మిక్కిలి ప్రియుడు భగవంతునకు వేఱొకడుండునా?

ఉ:– భూతభవిష్యద్వర్తమానములం దెవడును ఉండడు.

అ|| ఈ గీతాశాస్త్రము నధ్యయనము చేయువాడు జ్ఞానయజ్ఞము నాచరించినట్లేయని వచించుచున్నాడు

70. అధ్యేష్యతే చ య ఇమం ధర్మ్యం సంవాదమావయోః
జ్ఞానయజ్ఞేన తేనాహ మిష్టస్స్యామితి మే మతిః.

టీక:– *యః చ* = ఎవడైతే, *ధర్మ్యమ్* = ధర్మయుక్తమైన (లేక, ధర్మస్వరూపమేయగు), *ఆవయోః* = మనయిద్దఱియొక్క, *ఇమం సంవాదమ్* = ఈసంభాషణను (తద్రూపమైన గ్రంథమును), *అధ్యేష్యతే* = అధ్యయనమొనర్చునో, *తేన* = అతనిచేత, *జ్ఞానయజ్ఞేన* = జ్ఞానయజ్ఞముచే, *అహమ్* = నేను, *ఇష్టః* = ఆరాధింపబడినవాడను, *స్యామ్ ఇతి* = అగుదునని, *మే* = నాయొక్క, *మతిః* = నిశ్చయము.

తా:– ఎవడు ధర్మయుక్తమైన (లేక ధర్మస్వరూపమేయగు) మన యిరువురి ఈ సంభాషణమును అధ్యయనముచేయునో అట్టివాని జ్ఞానయజ్ఞముచేత నేనారాధింపబడినవాడ నగుదునని నానిశ్చయము.

వ్యాఖ్య:— 'ధర్మ్యమ్' - అని చెప్పుటవలన ఈ గీతాశాస్త్రము ధర్మమార్గమునుండి తొలగనిదనియు, సాక్షాత్ ధర్మస్వరూపమేయనియు విదితమగుచున్నది. 'ధర్మక్షేత్ర' - అని ధర్మశబ్దముతోనే గీత ప్రారంభమగుట ఈ సందర్భమున గమనింపదగియున్నది.

'జ్ఞానయజ్ఞేన' - ఈ గీతాగ్రంథము నధ్యయనము చేయువాడు జ్ఞానయజ్ఞముచే భగవంతుని పూజించినవాడగుచున్నాడని యిచట తెలుపబడినది. కావున ఈ గ్రంథము యొక్క కేవలము పారాయణముకూడ గొప్పఫలితమును గలుగజేయగలదని తెలియచున్నది. అయితే భక్తితోగూడి చేయవలెను. అర్థము తెలిసికొని అధ్యయనము చేసినచో ఇంకను గొప్ప మేలు చేకూరగలదు. మఱియు గీతనంతను అధ్యయనము చేసినవాడు జ్ఞానయజ్ఞముచే తననారాధించుచున్నాడని చెప్పుటవలన గీతాగ్రంథముయొక్క పరమతత్త్వము జ్ఞానమేయనియు, కర్మ, భక్తి, ధ్యానాదులన్నియు ఆ జ్ఞానమందే పర్యవసించుచున్నవనియు అవి జ్ఞానోత్పత్తికి సహాయభూతములుగ నుండుననియు తెలియుచున్నది. అట్లు కానిచో గీతాగ్రంథాధ్యయనమంతయు జ్ఞానయజ్ఞమనియే యిచట యేల పేర్కొనవలెను? కావున తక్కిన కర్మ, భక్త్యాదులను సహాయముగ గైకొని జ్ఞానమును లెస్సగ నభ్యసించి అట్టి జ్ఞానరూపయజ్ఞముచే భగవత్సాక్షాత్కారము బడయవలెను. ఫల పుష్పాదులచే భగవంతుని పూజించుట సామాన్యపూజ. జ్ఞానయజ్ఞముచే నాతనిని పూజించుట పరాపూజ. మొదటిదానికంటె రెండవది మహోత్కృష్టమైనది.

'మే మతిః' - 'ఇది నా నిశ్చయము'. అని భగవానుడు చెప్పుటవలన ఈ వాక్యము పరమ ప్రమాణమైయున్నట్లు మనము భావించవలెను. ఏలయనగా సాక్షాత్ భగవానుడే 'ఇది నా స్థిరనిశ్చయము' అని ఘంటాపథముగ నొక్కి చెప్పిరిగదా!

ప్ర:— ఈ గీతాశాస్త్రము నధ్యయనముచేసినవాడు ఏ యజ్ఞము నాచరించినవాడగును?

ఉ:— జ్ఞానయజ్ఞమును.

అ॥ శ్రద్ధతో ఈ గీతాగ్రంథమును వినువాడుకూడ గొప్ప పుణ్యమును బడయగలడని వచించుచున్నాడు

71. శ్రద్ధావాననసూయశ్చ శృణుయాదపి యో నరః
సోఽపి ముక్తశ్శుభాన్ లోకాన్ ప్రాప్నుయాత్పుణ్యకర్మణామ్.

టీక:— యః నరః = ఏ మనుజుడు, శ్రద్ధావాన్ = శ్రద్ధగలవాడును, అనసూయః చ = అసూయలేనివాడునునై, శృణుయాత్ అపి = (ఈ గీతాశాస్త్రమును) వినినప్పటికిని, సః అపి = అతడుకూడ, ముక్తః = పాపవిముక్తుడై, పుణ్యకర్మణామ్ = పుణ్యకార్యములను చేసినవారియొక్క, శుభాన్ లోకాన్ = పుణ్యలోకములను, ప్రాప్నుయాత్ = పొందును.

తా:— ఏ మనుజుడు శ్రద్ధతోగూడినవాడును, అసూయలేనివాడునునై ఈ గీతా శాస్త్రమును వినునో, అట్టివాడును పాపవిముక్తుడై పుణ్యకార్యములను చేసినవారి యొక్క పుణ్యలోకములను పొందును.

వ్యాఖ్య:— శ్రద్ధనుగూర్చి, అసూయారాహిత్యమునుగూర్చి గీతయందు పెక్కుచోట్ల చెప్పబడియున్నది. గ్రంథము పూర్తియగుచున్న ఈ సందర్భమున మఱల వానిని గూర్చిన ప్రస్తావనను భగవానుడు తీసికొనివచ్చిరి. ముముక్షువునకు ఆ సద్గుణము లెంత అవసరములో దీనివలన తెలియగలదు. శ్రద్ధలేక ఏ కార్యముచేసినను

అది నిరుపయోగమేయగును. అట్లే అసూయతో గూడియున్నవాడు ఏ రంగముననను వృద్ధికిరాలేడు. అసూయ అనునది ఒక వేరుపురుగువంటిది. అది హృదయములో ప్రవేశించినచో ఇతర సద్గుణములన్నిటిని, ఇతర శక్తులన్నిటిని తొలచివైచి గుల్లచేసివేయును. కావున ఆదుర్గుణము నెవరును దరికి చేర్చరాదు.

ఈ ప్రకారము శ్రద్ధ, అసూయారాహిత్యము గలిగియుండువాడు గీతనువినినప్పటికిని పాపరహితుడై గొప్పపుణ్యలోకములను బడయగలడని యిట చెప్పబడినది. భగవానుని ఈ వాక్యములు చదువురాని కొందఱు భక్తులకు పరమాశ్వాసమును గలుగజేయుచున్నవి. ఏలయనిన, 'వారు మాకు విద్యలేదే, గీతను పారాయణము చేయలేమే. మాకు పుణ్య మెట్లు లభించును?' అని సంశయగ్రస్తులై యున్నారు. అట్టివారి సంశయమును భగవాను డిచట తీర్చివైచిరి. చదువురాకున్నను, భక్తిశ్రద్ధలతోగుడి, అసూయాది దుర్గుణములులేక, ఇతరులవలన గీతను చక్కగ శ్రవణముచేసినను అట్టివారు మహాపుణ్యమును సంపాదించుదురని భగవానుడు తెలియజేసిరి. అధ్యాత్మతత్త్వము హృదయముతో సంబంధము గలిగియున్నదేకాని శిరస్సు (Brain) తో కాదు. భగవానుడు నివసించు స్థానము ముఖ్యముగ హృదయమే అయియున్నది. మహామహాపండితులు అనేక విద్యలను కళలను సంపాదించుకొని శిరస్సును (లౌకికప్రజ్ఞను) విశాలమొనర్చుకొనినను, వారి హృదయము సంకుచితముగ నున్నచో, దయ, కరుణ, శ్రద్ధ, అనసూయ మొదలగు సద్గుణములు లేనిచో ఎక్కువ ప్రయోజనముండదు. కావుననే భగవాను డిచట ఒకవేళ చదువురాకున్నను, చక్కని గుణములు కలిగి పరులవలన గీతాదులను వినినను గొప్ప పుణ్యమును సంపాదించగలరని నుడువుచున్నారు. అయితే ఈశ్రద్ధాదులతోబాటు విద్యయు నుండినచో ఇంకను మంచిది.

ప్ర:– చదువురానివాడు ఈగీతాగ్రంథమును అధ్యయనము చేయలేడుకదా! మఱి యాతడు తరించుట ఎట్లు?

ఉ:– (1) శ్రద్ధగలిగి (2) అసూయలేక ఈ గీతాశాస్త్రమును ఎవరివలననైన వినినచో అట్టివాడు పాపరహితుడై పుణ్యాత్ములు పొందు ఉత్తమలోకములను పొందగలడు. ఈ ప్రకారముగ నతడు సద్గతి నొందగలడు.

అ॥ 'నా యీ బోధచే నీ యజ్ఞానము (భ్రమ) శమించినదా?' యని శ్రీకృష్ణమూర్తి అర్జునుని ప్రశ్నించుచున్నాడు –

72. కచ్చిదేతచ్ఛ్రుతం పార్థ! త్వయైకాగ్రేణ చేతసా
కచ్చిదజ్ఞానసమ్మోహః ప్రణష్టస్తే ధనఞ్జయ!.

టీక:– పార్థ = ఓ అర్జునా!, ఏతత్ = ఇది (నాచే నుపదేశింపబడిన ఈగీతాశాస్త్రము), త్వయా = నీచేత, ఏకాగ్రేణచేతసా = ఏకాగ్రమైన మనస్సుతో, శ్రుతం కచ్చిత్ = వినబడినదిగదా, ధనంజయ = ఓ అర్జునా!, తే = నీ యొక్క, అజ్ఞానసమ్మోహః = అజ్ఞానమువలన గలిగిన మోహము (భ్రమ), ప్రణష్టః కచ్చిత్ = సంపూర్ణముగా నశించినదిగదా?

తా:– ఓ అర్జునా! నా యీ బోధను నీవు ఏకాగ్రమనస్సుతో వింటివా? అజ్ఞానజనితమగు నీయొక్క భ్రమ (దానిచే) సంపూర్ణముగా నశించినదా?

వ్యాఖ్య:– శ్రీకృష్ణపరమాత్మ తాను చెప్పదలంచిన బోధనంతను చెప్పివైచి కట్టకడకు అర్జునుని ఈ విధముగ ప్రశ్నించుచున్నాడు. ఈ వాక్యముచే గీతాచార్యుని బోధయంతయు పరిసమాప్తమైపోవును. 'ఓ అర్జునా! నా యీ వాక్యములను నీవు ఏకాగ్రచిత్తుడవై వింటివా? నీ భ్రమ నశించినదా?' అని భగవానుడు ప్రశ్నించిరి. రోగికి ఔషధము నొసంగినపిదప ఆతని రోగము శమించినదా యని యడుగుట వైద్యుని కర్తవ్యమైయున్నది. భవరోగవైద్యుడగు శ్రీకృష్ణపరమాత్మయు ఆప్రకారమే చేసిరి. అజ్ఞానరుగ్మతచే బాధితుడగు అర్జునునకు గీతాశాస్త్రము అనుపమ ఔషధము నొసంగి భ్రమరూపమగు ఆతని వ్యాధి శమించినదాయని ప్రశ్నించుచున్నారు.

'ఏకాగ్రేణచేతసా' – ధ్యానించునపుడుగాని, శ్రవణముచేయునపుడుగాని, విచారణ సల్పునపుడుగాని మనస్సు ఏకాగ్రముగ నుండవలెను. చంచలచిత్తముతో ఏదిచేసినను ప్రయోజనకరముగా నుండదు. చంచల జలమందు సూర్యప్రతిబింబము చక్కగా పడనట్లును, చంచలదర్పణమందు ముఖము సరిగా కనుపించనట్లును, చంచలమనస్సునందు ఆత్మ సరిగా ప్రతిబింబించదు. శ్రవణాదులున్ను సరిగా జరుగవు. మఱియు అది యుద్ధకల్లోల సందర్భముగనుక అర్జునుని మనస్సు ఏమైన విక్షేపమును బొందియుండి ఏకాగ్రతను గోల్పోయినచో తాను గావించిన బోధయంతయు నిరుపయోగమగును. కావున భగవాను డిట్టి ప్రశ్నవేయుట సముచితముగనే యున్నది. ప్రతివారును తాము పారాయణము చేయునపుడుగాని, తత్త్వవిచారణ సలుపునపుడుగాని, ధ్యానమొనర్చునపుడుగాని మనస్సును బహిర్ముఖముగ పరుగెత్తనీయక ఏకాగ్రముగ నుంచుకొనవలెను. ఇదియే తుట్టతుదకు భగవానుడు కావించిన బోధ. 'మనస్సును ఏకాగ్రపఱచుకొని శ్రవణాదులనొనర్చి, అజ్ఞానమును సమూలముగ నశింపజేసికొనుడు' అను ఈ వాక్యమే శ్రీకృష్ణపరమాత్మ గీతాశాస్త్రమందు గావించిన అంతిమోపదేశము.

'అజ్ఞానసమ్మోహః' – మోహమునకు (భ్రమకు) కారణము అజ్ఞానము. అజ్ఞానముచే మనుజుడు త్రాటిని జూచి పాము అను భ్రమలో పడిపోవును. అట్లే అజ్ఞానముచే అనిత్యవస్తువు నిత్యమను మోహములో జీవుడు పడిపోవును. అజ్ఞానమువలన కలిగిన అర్జునుని మోహము (తన బంధువులు చనిపోవుదురని దుఃఖము) శ్రీకృష్ణపరమాత్మచే నుపదేశింపబడిన జ్ఞానముచే నశించిపోయెను. అది నశించినదా, లేదా యని భగవాను డర్జునుని ప్రశ్నించుచున్నారు.

'ప్రణష్టః' – ఔషధము శక్తివంతమైనది యగుచో రోగము సంపూర్తిగ నయమైపోవును. శ్రీకృష్ణుని అనుపమజ్ఞాన భేషజముచే అర్జునుని భవరోగము సంపూర్తిగ వినాశమొందినది. తాను ప్రయోగించిన ఔషధముయొక్క ప్రభావమెట్టిదో తెలియును. గనుకనే భగవానుడు ధైర్యముగ 'నీ రోగము శమించినదా?' అని యడుగగల్గిరి. 'నష్టః' యని యడుగక 'ప్రణష్టః' యని యడుగుటచే 'నీ అజ్ఞానవ్యాధి సంపూర్తిగ నశించినదా?' అని భగవానుడు ప్రశ్నించినవారైరి.

'ధనంజయ' – 'ఓ అర్జునా! పూర్వము రాజసూయయాగమున నీవు ధనాదుల నెట్లు జయించి తెచ్చితివో, అట్లే యిపుడును నీమాయాసమ్మోహమును, అజ్ఞానమును జయించి కీర్తి వహించుము.' అని హెచ్చరించుటకు కాబోలు ఈ 'ధనంజయ' పదమును భగవాను డిచట ప్రయోగించిరి.

ప్ర:– శ్రవణాదు లే ప్రకారము గావించవలెను?

ఉ:– ఏకాగ్రమనస్సుతో.

అ॥ భగవానుని యాప్రశ్నకు అర్జునుడు సమాధాన మొసంగుచున్నాడు -

అర్జున ఉవాచ -

73. నష్టోమోహఃస్మృతి ర్లబ్ధా త్వత్ప్రసాదాన్మయాఽచ్యుత! స్థితోఽస్మి గతసన్దేహః కరిష్యే వచనం తవ.

అర్జున ఉవాచ = అర్జునుడు చెప్పెను.

టీక:- అచ్యుత = ఓ కృష్ణా, త్వత్ప్రసాదాత్ = నీ యనుగ్రహమువలన, మోహః = నా యజ్ఞానము, నష్టః = నశించినది, మయా = నాచేత, స్మృతిః = జ్ఞానము (ఆత్మస్మృతి), లబ్ధా = పొందబడెను, గతసందేహః = సంశయరహితుడనై, స్థితః అస్మి = ఉన్నాను, తవ = నీ యొక్క, వచనమ్ = వాక్యమును (ఆజ్ఞను) కరిష్యే = నెరవేర్చెదను.

తా:- అర్జునుడు చెప్పెను - ఓ కృష్ణా! మీ యనుగ్రహమువలన నాయజ్ఞానము నశించినది. జ్ఞానము (ఆత్మస్మృతి) కలిగినది. సంశయములు తొలగినవి. ఇక మీయాజ్ఞను నెరవేర్చెదను.

వ్యాఖ్య:- శ్రీకృష్ణమూర్తి 'నీ అజ్ఞానము నశించినదా?' అని ప్రశ్నింప అర్జును డందులకు చక్కని సమాధానమును జెప్పెను. 'నా అజ్ఞానము (మోహము) అంతరించినది' అని యాతడు విస్పష్టముగ చెప్పివైచెను. అర్జునుడు దేహభ్రాంతితో గూడియున్నవాడై, కర్తవ్యాకర్తవ్యములను విస్మరించియున్న సందర్భమున శ్రీకృష్ణమూర్తి యాతనికి యథార్థతత్త్వము నుపదేశించిరి. (రోగికి ఔషధము నొసంగిన చందమున). ఇచట వైద్యుడు గొప్పవాడు. ఔషధము గొప్పది. ఇక రోగ మెంత తీవ్రమైనప్పటికిని ఏమి? గీతామృతమునుగ్రోలిన అర్జుననకు మోహ మంతరించినది. అజ్ఞానమను కైపు తొలగినది. ఈ విషయమును 'నష్టోమోహః' అను వాక్యముచే అర్జునుడు తానే ఒప్పుకొనెను. ఔషధమునకు సద్యఃఫలితము కలిగినది. బోధితునియందు తత్క్షణఫలితమును సాధింపగల్గుట యనునది బోధకునియొక్కయు, బోధయొక్కయు మహిమను చాటుచున్నది. కాబట్టి శ్రీకృష్ణపరమాత్మ యెంతటి శక్తిశాలియో, గీతాజ్ఞాన మెంతపటుతరమైనదో దీనిచే స్పష్టమగుచున్నది.

అధ్యాత్మజ్ఞానము అనుభవవిద్య. అది 'వాచా' జ్ఞానముతో పూర్తియగునది కాదు. ప్రతివారును దానిని ఆచరణలోపెట్టి అనుభవములో చూచుకొనవచ్చును. శాస్త్రాదులందు తెలిపినది, మహాత్ములగు ఋషులు బోధించినది కపోలకల్పితము కాదని అపుడు తేలిపోవును. అర్జునుడు శ్రీకృష్ణుని బోధను, సిద్ధాంతమును తన యుపాధియందు పరీక్షించుకొని చూచెను. సిద్ధాంతము సరియైనదేయని వెంటనే ఋజువుచేసెను. ఆ సత్యమునే ఈ శ్లోకముద్వారా అర్జునుడు లోకమునకు వెల్లడించుచున్నాడు. 'ఓ జనులారా! మందుతిని చూచితని తత్క్షణఫలితము కలిగినది. కావున ఓ సంసార వ్యాధిపీడితులారా! మీరందఱున్ను నిరాటంకముగ, నిస్సంకోచముగ దీనిని సేవింపుడు. నాకువలె మీకును తప్పక భవరోగము శమింపగలదు'. అని యాతడు లోకమునకు చాటుచున్నాడు. మఱియు ఆకలితీరినందులకు గుఱుతు త్రేపు వచ్చుటయే. అట్లే గీతామృతమును తనివితీర గ్రోలగా అర్జుననకు కడుపునిండుటచే త్రేపువచ్చెను. ఈ శ్లోకమే ఆ త్రేపు. 'నాయాకలి తీరినది నాదాహము శమించినది. సంతృప్తుడనైతిని' అని అర్జునుడు పలికెను. కావున ఇక జనులకు గీతాప్రభావముపై నమ్మకము బాగుగ కుదురగలదు. ఏలయనిన, దానిని సేవించిన అర్జుననకు ప్రత్యక్షముగ సత్ఫలితము కలిగినది. కావున తక్కినవారికిన్ని తప్పక కలుగగలదు.

'స్మృతిర్లబ్ధా' - మఱచిపోయినదానిని జ్ఞాపకమునకు తెచ్చుకొనుటయే స్మృతి, స్మరణ యనబడును. అర్జునుడు తన వాస్తవస్వరూపమగు ఆత్మను మరచి దేహభ్రాంతి కలిగియుండెను. ఇపుడు భగవానుని బోధలచే నాతనికి తిరిగి తనయొక్క ఆత్మస్వరూప జ్ఞానము కలిగినది. తాను దేహముకాదనియు, దేహాతీతమగు సచ్చిదానందాత్మయనియు భావము తిరిగి జ్ఞప్తికివచ్చినది. 'స్మృతిః' అని చెప్పుటవలన ఈ ఆత్మస్వరూపము ప్రతివానిచేతను క్రొత్తగ పొందబడునదికాదనియు, అనాదినుండి యాతనికి స్వతస్సిద్ధముగనే యుండియున్నదనియు, దానిని యాతడు మరచిపోయెననియు, తిరిగి ఆప్తుని వాక్యముచే నిపుడు జ్ఞాపకము చేసికొనవలసి యున్నదనియు స్పష్టమగుచున్నది.

ఆత్మా తు సతతం ప్రాప్తో హ్యప్రాప్తవదవిద్యయా
తన్నాశే ప్రాప్తవద్భాతి స్వకంఠాభరణం యథా (ఆత్మబోధ - శ్రీశంకరాచార్యులవారు)

'ఆత్మ ఎల్లప్పుడు పొందబడియేయున్నది. పొందబడనట్లు అవిద్యచే గోచరించుచున్నది. ఆ అవిద్య తొలగిపోవునపుడు మఱచిన స్వకంఠాభరణమునువలె తిరిగి పొందునట్లు గోచరించును' - అని శ్రీశంకరభగవత్పాదులు తెలిపినట్లు ఆత్మ సర్వజీవులకును స్వతస్సిద్ధముగ ఉండియేయున్నది. కాని మఱువబడినది. గురువాక్యముచే తిరిగి ఇపుడు జ్ఞాపకము చేసికొనవలసియున్నది. అదియే 'స్మృతి.' దీనినిబట్టి సర్వజీవులును నాశరహిత ఆత్మస్వరూపులే యనియు అవిద్యాప్రభావమున ఆ సంగతిని మఱచిపోయి తాను దేహేంద్రియాదులని తలంచి వ్యర్థముగ దుఃఖించుచున్నారనియు తేలుచున్నది. కావున అనుభవజ్ఞులగు మహనీయుల బోధచేతను, గీతాశాస్త్రవిచారణచేతను ఆ మఱచిపోయిన నిజరూపమును ప్రతివారును అర్జునునివలె తిరిగి జ్ఞప్తికితెచ్చుకొని నిజమహిమను గుర్తెఱిగి శోకవిముక్తులు కావలసియున్నారు.

'త్వత్ప్రసాదాత్' - సద్గురువులయొక్క అనుగ్రహమునకు అధ్యాత్మరంగమున గొప్పస్థానము కలదు. శిష్యుడు స్వాత్మోన్నతికై, తానెంతగా ప్రయత్నించినప్పటికిని సర్వేశ్వరునియొక్కయు, సద్గురునియొక్కయు కృపలేనిచో ఈ మాయను దాటుట కష్టసాధ్యము. కనుకనే భగవంతుని గూర్చిన పూజాజపధ్యానాదులను గావించుట, సద్గురుని త్రికరణశుద్ధముగ సేవించుట ముముక్షువునకు విధిగా ఏర్పఱుపబడినవి. మహాత్ముల యనుగ్రహమువలన మాయాబంధము సడలిపోవును. కనుకనే మన పూర్వీకులు తామెంత గొప్పవారైనను ఒకానొక గురువును ఆశ్రయించి, సేవించి, అదేవిధమున భగవంతుని పూజించి, అర్చించి తరించిపోయిరి. ఇచటగూడ అర్జునుడు తనకు అజ్ఞానము నశించుట గురువగు శ్రీకృష్ణునియొక్క అనుగ్రహమువలననే యని విస్పష్టముగ పేర్కొనెను.

'అచ్యుత' - తన భక్తులను సంసారమునందు చ్యుతులు కాకుండ తప్పించువాడు గనుక శ్రీకృష్ణునకు అచ్యుతుడను పేరు వచ్చెను. ఈ పద మిచట చాల సమయోచితముగ నున్నది. ఏలయనిన తనభక్తుడగు అర్జునుని సంసారకూపమున (అజ్ఞానమందు) జారిపోకుండ భగవంతుడు రక్షించి తన 'అచ్యుత' నామమును సార్థకము చేసికొనిరి. అర్జునుడు చ్యుతుడు కాలేదనుటకు గుఱుతు ఈ శ్లోకమునం దాతడు పలికిన పలుకులే యగును.

'గతసందేహః' - అజ్ఞానకాలములో సందేహపరంపరలు మనుజుని పీడించును. కాని ఆత్మతత్త్వముయొక్క, జగత్స్థితియొక్క ప్రత్యక్షానుభూతిని బడసినపు డిక అట్టి సంశయములకు తావేయుండదు.

భిద్యతే హృదయగ్రన్థిశ్ఛిద్యన్తే సర్వసంశయాః
క్షీయన్తే చాస్య కర్మాణి తస్మిన్ దృష్టే పరావరే.

అను ఉపనిషద్వాక్య మీ సత్యమునే ఋజువుచేయుచున్నది.

'కరిష్యే వచనం తవ' – రోగికి ఆరోగ్యము కలిగినదానికి గుఱుతు లేచి చక్కగ నడవగల్గుట ఎట్లగునో అట్లే ఆత్మజ్ఞానమును పొందినదానికి గుఱుతు దేహభ్రాంతి తొలగి కర్తవ్యమును పాలించుటయే యగును. అట్లే అర్జునునకు అజ్ఞానము శమించుటబట్టి 'మీరు చెప్పినట్లు చేసెదను' అని శ్రీకృష్ణపరమాత్మతో పలికి కర్తవ్యోన్ముఖుడు కాగల్గెను.

మఱియు లోకములో నొక శిష్టాచారము కలదు. శిష్యుడు ఎంత పైస్థితికి పోయినప్పటికిని గురుభక్తిని, గురువాక్యపాలనమును వదలరాదు. అట్లే అర్జునుడు తనకు జ్ఞానోదయమైనప్పటికిని గుర్వాజ్ఞాపాలనమును వదలలేదు. గురుభక్తికి ఇదియొక ప్రబల నిదర్శనము. అర్జునుడు జ్ఞానమును బడసి జీవితలక్ష్యము నెరవేర్చుకొని కృతకృత్యుడయ్యెను. ఇక నాతనికి చేయవలసినదేమియు ఈ ప్రపంచమునలేదు. అయినను 'కరిష్యే వచనం తవ' – మీరు చెప్పినట్లాచరించెదను అని భక్తితో వచించెను. అర్జునుని ఈ యాదర్శమును ముముక్షువు లెల్లరు సదాజ్ఞాపకమునందుంచుకొని, గురుభక్తిని, దైవభక్తిని, శాస్త్రవిశ్వాసమును ఏకాలమందును విడనాడక యుండవలెను.

ప్ర:– శ్రీకృష్ణునిబోధచే అర్జునున కెట్టి సత్ఫలితములు కలిగినవి?

ఉ:– ఆతనికి (1) అజ్ఞానము తొలగినది (2) ఆత్మస్మృతి గలిగినది (3) సంశయములు పటాపంచలైనవి (4) అతడు కర్తవ్యపరాయణుడు కాగల్గెను.

ప్ర:– జీవునకు అజ్ఞానాదు లెట్లు తొలగగలవు?

ఉ:– మహాత్ములగు సద్గురువుల బోధలచేతను, వారి యనుగ్రహముచేతను తొలగగలవు. (త్వత్ప్రసాదాత్)

అ॥ గీతాబోధయంతయు వినినపిదప సంజయుడు తనకు కలిగిన ఆనందానుభవమును ఐదు శ్లోకములద్వారా ధృతరాష్ట్రునకు వ్యక్తముచేయుచున్నాడు –

సంజయ ఉవాచ –

74. ఇత్యహం వాసుదేవస్య పార్థస్య చ మహాత్మనః
సంవాదమిమమశ్రౌష మద్భుతం రోమహర్షణమ్.

సంజయ ఉవాచ = సంజయుడు చెప్పెను –

టీక:– ఇతి = ఈ ప్రకారముగా, అహమ్ = నేను, వాసుదేవస్య = శ్రీకృష్ణునియొక్కయు, మహాత్మనః = మహాత్ముడగు (మహాబుద్ధిశాలియగు), పార్థస్య చ = అర్జునునియొక్కయు, ఇమమ్ = ఈ, అద్భుతమ్ = ఆశ్చర్యకరమైనదియు, రోమహర్షణమ్ = పులకాంకురమును (గగుర్పాటును) గలుగుజేయునదియునగు, సంవాదమ్ = సంభాషణమును, అశ్రౌషమ్ = వింటిని.

తా:– సంజయుడు చెప్పెను - ఓ ధృతరాష్ట్రమహారాజా! ఈ ప్రకారముగా నేను శ్రీకృష్ణునియొక్కయు, మహాత్ముడగు అర్జుననియొక్కయు ఆశ్చర్యకరమైనట్టి యు, పులకాంకురమును గలుగజేయుసదియునగు ఈ సంభాషణమును వింటిని.

వ్యాఖ్య:– శ్రీకృష్ణపరమాత్మ కావించిన గీతాబోధయంతయు వ్యాసుల యనుగ్రహముచే వినగల్గిన సంజయుడు, తచ్ఛ్రవణానంతరము అపూర్వమగు తన ఆనందాతిశయమును ధృతరాష్ట్రున కెఱిగించుచున్నాడు -

'పార్థస్య చ మహాత్మనః' - ఇంతదనుక మోహగ్రస్తుడై, భ్రాంతియుక్తుడై, అల్పాత్ముడగునున్నట్టి అర్జునుడు భగవానుని దివ్యబోధలచే 'మహాత్ముడు'గ మారిపోయెను. అర్జునునివలెనే ప్రతివారునుగూడ శ్రీకృష్ణుని బోధామృతమును చక్కగ పానముచేసి సంసారబంధవిచ్ఛిత్తిని, మాయామోహవినాశమును గావించుకొని "మహాత్ములై" పఱగ వలెను. 'మహాత్మా' అనునది ఒక బిరుదు. ప్రయత్నముచే దాని నెవరైనను సంపాదించుకొనవచ్చును. గీతయొక్క ముఖ్యోద్దేశ్యము, లక్ష్యము అల్పాత్ములను మహాత్ములుగ జేయుటయే యగును. మందబుద్ధులను బుద్ధిమంతులుగ మార్చుటయే యగును. అజ్ఞానిని జ్ఞానిగ నొనర్చుటయే యగును.

'అద్భుతం రోమహర్షణమ్' - శ్రీకృష్ణార్జున సంవాదరూపమగు ఈ గీతాశాస్త్రము అత్యాశ్చర్యకరమైనది. ఏలయనిన స్పర్శవేది ఇనుమును బంగారుగ జేయునట్లు ఈ శాస్త్రము మాయామోహితుని మాయావిముక్తునిగ జేయగల్గుచున్నది. ఏడ్చుచున్నవానిని నవ్వించుచున్నది. ఇట్టి అమోఘదైవీశక్తి దీనియందు కలదు. మఱియు దీనిని చదివిన, వినిన వ్యక్తి ఆనందముతో తన్మయుడైపోవును. ఇక్కారణముననే దీనిని సంజయుడు 'అద్భుతమనియు' 'రోమహర్షణ' మనియు వర్ణించిచెప్పెను. ఇట్టి అపూర్వమహిమ ఈ గీతాశాస్త్రమునం దుండుటవలననే ఇయ్యది జగద్విఖ్యాతమై సర్వజనసమాదరణీయమై, ముముక్షువులకు కల్పతరువై యొప్పుచున్నది.

ప్ర:– ఈ కృష్ణార్జునసంవాద మెట్టిదై యున్నది?

ఉ:– (1) అద్భుతమైనది (2) పులకాంకురమును (గగుర్పాటును) గలుగజేయునది.

అ॥ శ్రీ వేదవ్యాసుల యనుగ్రహముచే తా నీసంభాషణను వినగల్గితినని సంజయుడు చెప్పుచున్నాడు

75. వ్యాసప్రసాదాచ్ఛ్రుతవా నేతద్గుహ్యతమం★ పరమ్
యోగం యోగేశ్వరాత్కృష్ణా త్సాక్షాత్కథయతస్స్వయమ్.

టీక:– వ్యాసప్రసాదాత్ = శ్రీ వేదవ్యాసమహర్షియొక్క అనుగ్రహమువలన, అహమ్ = నేను, గుహ్యమ్ = రహస్యమైనదియు, పరమ్ = శ్రేష్ఠమైనదియు నగు, ఏతత్ యోగమ్ = ఈ యోగశాస్త్రమును, స్వయమ్ = స్వయముగనే, కథయతః = అర్జునునకు చెప్పుచున్న, యోగేశ్వరాత్ = యోగేశ్వరుడగు, కృష్ణాత్ = శ్రీకృష్ణునివలన, సాక్షాత్ = ప్రత్యక్షముగా, శ్రుతవాన్ = వింటిని.

★ మహం - పాఠాన్తరము.

తా:– శ్రీ వేదవ్యాసమహర్షియొక్క అనుగ్రహమువలన, నేను అతిరహస్యమైనదియు, మిగుల శ్రేష్టమైనదియు నగు ఈ యోగశాస్త్రమును స్వయముగనే అర్జునునకు చెప్పుచున్న యోగేశ్వరుఁడగు శ్రీకృష్ణునివలన ప్రత్యక్షముగా (నేరులో) వింటిని.

వ్యాఖ్య:– ఈగీతాశాస్త్రమునుగూర్చి 'యోగమ్' అని యిచట చెప్పబడినది. యోగమనగా కలుపునది. జీవుని పరమాత్మతో నైక్యపఱచునది యని అర్థము. ఈ గీతోపదేశము అట్టిదే కావున నిది యోగమనబడినది. మఱియు నిది పరమరహస్యమైనదనియు, సర్వోత్కృష్టమైనదనియు, నిట చెప్పబడినది. కావున ముముక్షువులకు అవశ్యము ఉపాధేయమై యొప్పుచున్నది.

'యోగేశ్వరాత్' - యోగమునకు ప్రభువు యోగేశ్వరుఁడు. యోగమును గుఱించి సంపూర్ణముగ నెఱిగినవాడు శ్రీకృష్ణపరమాత్మ. కాబట్టి అట్టిమహనీయుడు ఉపదేశించిన ఈ గీతారూపయోగశాస్త్రమునందు జనుల కెంతటి విశ్వసముండవలెనో యోచించుకొనవచ్చును.

'సాక్షాత్' - శ్రీవ్యాసుల యనుగ్రహముచేత గీతాశాస్త్రమును ప్రత్యక్షముగ తాను వినగల్గితినని సంజయుఁడు చెప్పుచున్నాఁడు. శ్రీవ్యాసమహర్షి సంజయునకు దూరశ్రవణ, దూరదర్శనశక్తి నొసంగినందువలన రణరంగమున జరిగిన ఈ సంవాదమును ఇంటియొద్దనుండియే యాతడు వినగల్గెను. చూడగల్గెను. కావున సంజయుఁడు ధృతరాష్ట్రునకు వచించినది ప్రత్యక్షప్రమాణమే అయియున్నది. అనగా సాక్షాత్ భగవానుని ముఖతః గీతాబోధ ఏ ప్రకారము వెలువడెనో దానిని ఉన్నది ఉన్నట్లుగ నాతడు చెప్పగల్గెనని భావము. ఈ ప్రకారముగ సంజయుఁడు చెప్పినది సాక్షాత్ భగవత్ప్రోక్తములైన వాక్యములే యగుటబట్టి గీతాగ్రంథముపై సర్వులకును పరమవిశ్వాసముండవలయును.

'స్వయమ్' - అని చెప్పుటవలన భగవానుడు స్వయముగ బోధించిన యుపదేశమగుటచే దీనికి అపరిమితమైన విలువ కలదు.

ప్ర:– గీతారూపమగు ఈ యోగశాస్త్ర మెట్టిది?

ఉ:– (1) అతిరహస్యమైనది (2) పరమోత్కృష్టమైనది (3) భగవానుడు స్వయముగ బోధించినది.

ప్ర:– ఈ గీతాశాస్త్రమును సంజయుఁడు నేరులో ఎట్లు వినగల్గెను?

ఉ:– శ్రీ వ్యాసమహర్షియొక్క అనుగ్రహముచే (దూరశ్రవణ, దూరదర్శనశక్తి, లభింప, దానిచే) వినగల్గెను.

అ॥ భగవానుని యా దివ్యబోధలను స్మరించి స్మరించి మహదానందము నొందుచున్నానని సంజయుఁడు పలుకుచున్నాఁడు -

76. రాజన్సంస్మృత్య సంస్మృత్య సంవాదమిమమద్భుతమ్
కేశవార్జునయోః పుణ్యం హృష్యామి చ ముహుర్ముహుః.

టీక:– రాజన్ = ఓ ధృతరాష్ట్రమహారాజా! అద్భుతమ్ = ఆశ్చర్యకరమైనదియు, పుణ్యమ్ =

పావనమైనదియు (లేక పుణ్యదాయకమైనదియు) నగు, కేశవార్జునయోః = కృష్ణార్జునులయొక్క, ఇమం సంవాదమ్ = ఈ సంభాషణమును, సంస్మృత్య సంస్మృత్య = తలంచి తలంచి, ముహుర్ముహుః చ = మాటిమాటికిని, హృష్యామి = ఆనందించుచున్నాను.

తా:- ఓ ధృతరాష్ట్రమహారాజా! ఆశ్చర్యకరమైనదియు, పావనమైనదియు (లేక పుణ్యదాయకమైనదియు) నగు కృష్ణార్జునులయొక్క ఈ సంభాషణమును తలంచి తలంచి మాటిమాటికి ఆనందమును బొందుచున్నాను.

వ్యాఖ్య:- సంజయుడు గీతాసంస్మరణజనిత మహదానందమును వ్యక్తమొనర్చుచున్నాడు.

'సంస్మృత్య సంస్మృత్య' - 'సంస్మృత్య' అని చెప్పుటలోను, సంస్మృత్య అని ఒక పర్యాయము చెప్పక, రెండు పర్యాయములు చెప్పుటలోను విశేషము కలదు. వివినబోధను లెస్సగస్మరించుటయే సంస్మరణము. మఱియు ఆ పదమును రెండుసార్లు చెప్పుటచే అద్దానిని మఱల మఱల లెస్సగా స్మరించవలెనని భావము. సంజయుడు ఆప్రకారమే చేసెను. అనగా భగవత్ప్రోక్తమగు ఈగీతాజ్ఞానమును వినుటమాత్రముతో తృప్తిపడక, దానిని మఱల మఱల స్మరింపదొడగెను. అనగా తీవ్రముగ మననముచేసెను. అట్లు మననము చేయుటవలననే దాని యర్థము చక్కగ హృదయమున ప్రవేశించును. (1) శ్రవణము (2) మననము (3) నిదిధ్యాసనము - అని మూడు పద్ధతులు శాస్త్రమునందు చెప్పబడినవి. సంజయుడు మొదట గీతాబోధను శ్రవణము చేసెను. ఆ పిదప మనననిదిధ్యాసనములను గావించి తత్ఫలితముగ పరమానందమును బొందగల్గెను.

'పుణ్యమ్' అని చెప్పుటవలన కృష్ణార్జునసంవాదరూపమగు ఈగీతాశాస్త్రము మహాపుణ్యప్రదమైనదియు, అతిపావనమైనదియు నని భావము. సాక్షాత్ మోక్షమునే కలుగజేయు పవిత్రవస్తువు కనుకనే దీనిని 'పుణ్యమ్' అని చెప్పిరి. అనగా ఈగీతా శాస్త్రము మూర్తీభవించిన పుణ్యమే యనియు, పాపక్షయకరమనియు భావము.

'హృష్యామి చ ముహుర్ముహుః' - స్వస్వరూపసాక్షాత్కారసమయమున, లేక భగవదైక్యము నొందుసమయ మున జీవుడు దుఃఖరాహిత్యమును, అతిహర్షమును బొందును. ఆనందమును మాటిమాటికి అనుభవిం చును. దుఃఖమయమగు ఈ సంసారమున మనుజునకు కావలసినది ఆనందమే (హర్షమే) కదా! దుఃఖరాహిత్యమేకదా! అట్టిది ఈ గీతాశాస్త్రముద్వారా జీవునకు లభించుచున్నది. దుఃఖమగ్నుడగు జీవునకు అనంతానందము దీనిద్వారా సంప్రాప్తించుచున్నది. అర్జునుడే యిందులకు దృష్టాంతము. మొదట ('విషీదన్తం' అనునట్లు) పరమశోకాకులుడైయున్న అర్జునుడు గీతాశాస్త్రశ్రవణముచే, మననముచే ('నష్టోమోహః' అనునట్లు) మోహరహితుడై ఆనందపరవశుడై కర్తవ్యనిర్వహణము నిమిత్తము రణరంగమున దుమికెను. అట్లే సంజయుడు గీతాశ్రవణమననములచే మాటిమాటికి పరమానందము నొందుచుండెను. (హృష్యామి చ ముహుర్ముహుః). ఈ ప్రకారముగ గీతాశ్రవణముచే ఇరువురును వెంటవెంటనే పరమానందము నొందగల్గిరి. కాబట్టి ఆనందము నపేక్షించు ప్రతిమానవుడును, దుఃఖము నంతమొందించగోరు ప్రతివ్యక్తియు ఈగీతాశాస్త్రమును తప్పకచదివి, అద్దాని మనన నిదిధ్యాసనములను గావింప వలెను. దుఃఖాకులురగు ప్రాణుల కీశాస్త్రము సంజీవివంటిదై యున్నది. వెయ్యేల, సమస్తజీవులకు ఆనందము నొసంగునదైయున్నది. సంజయుని పైవాక్యములే ఇందులకు తార్కాణము.

ప్ర:- కృష్ణార్జున సంవాదరూపమగు ఈ గీతాశాస్త్ర మెట్టిది?

ఉ:– (1) మహాపుణ్యప్రదమైనది - అతిపావనమైనది (2) అద్భుతమైనది - మహదాశ్చర్య జనకమైనది.

ప్ర:– అట్టి గీతాశాస్త్రమును వినిన పిదప యేమి చేయవలెను?

ఉ:– ఆ వినిన యర్థమును మాటిమాటికి మననము చేయవలెను. నిదిధ్యాసనము గావింపవలెను.

ప్ర:– అట్లు చేసినందువలన ఏమి ఫలితముచేకూరును?

ఉ:– జీవుడు దుఃఖరహితుడై, అతిహర్షమును, ఆత్మానందమును బొందును. మాటిమాటికి సంతోషార్ణవమున ఓలలాడుచుండును. సంజయుడే ఇందులకు దృష్టాంతము.

అ॥ భగవానుని విశ్వరూపమును తలంచుకొని తలంచుకొని పరమాశ్చర్యము నొందుచున్నానని సంజయుడు చెప్పుచున్నాడు -

77. తచ్చ సంస్మృత్య సంస్మృత్య రూపమత్యద్భుతం హరేః
విస్మయో మే మహాన్ రాజన్ ! హృష్యామి చ పునః పునః.

టీక:– రాజన్ = ఓ ధృతరాష్ట్రమహారాజా!, హరేః = శ్రీకృష్ణమూర్తియొక్క, అత్యద్భుతమ్ = మిక్కిలి ఆశ్చర్యకరమైన, తత్ చ రూపమ్ = ఆ విశ్వరూపమును, సంస్మృత్య సంస్మృత్య = తలంచి తలంచి, మే = నాకు, మహాన్ = అధికమగు, విస్మయః = ఆశ్చర్యము, (భవతి = కలుగుచున్నది), పునః పునః చ = మాటిమాటికిని, హృష్యామి = సంతోషించుచున్నాను.

తా:– ఓ ధృతరాష్ట్రమహారాజా! శ్రీకృష్ణమూర్తియొక్క మిగుల ఆశ్చర్యకరమైన ఆ విశ్వరూపమును తలంచి తలంచి నాకు మహదాశ్చర్యము కలుగుచున్నది. మఱియు (దానిని తలంచుకొని) మాటిమాటికిని సంతోషమును బొందుచున్నాను.

వ్యాఖ్య:– క్రిందటి శ్లోకమును భగవానుని బోధవలన కలుగు ఆనందము తెలుపబడినది. ఈశ్లోకమున భగవానుని విశ్వరూపమును తలంచుకొనినపుడు, భావించినపుడు కలుగు దివ్యానుభూతి, పరమానందము వ్యక్తము చేయబడుచున్నది.

'హృష్యామి చ పునః పునః' - సంజయుడు భగవానుని బోధను, రూపమును తలంచుకొని ఆనందము పట్టలేకున్నాడు. అతనికికలిగిన ఆశ్చర్యమునకున్ను అంతులేకున్నది. ప్రతివాడును ఈ దశను అనగా 'అతిహర్ష' దశను ఎప్పటికైనను (జ్ఞానప్రాప్తిచే) పొందవలసియేయున్నాడు. నశ్వర ప్రపంచభావనను వీడి శాశ్వత భగవత్స్వరూపమును చింతించునపుడు కొందఱు ఆనందముపట్టలేక చిందులుద్రొక్కుదురు. కొందఱు యెలుగెత్తి గానముచేయుదురు (సామగానమువలె). కొందఱు ఆనందపారవశ్యముచే నృత్యముచేయుదురు. ఇవియన్నియు అతిహర్షమునకు చిహ్నములు. సంజయునకు గీతాశ్రవణానంతరము, విశ్వరూపసందర్శనానంతరము తన్మననాదులచే అట్టి మహదానందమే కలిగినది. ఆ విషయమునే యతడీ రెండు శ్లోకములద్వారా ధృతరాష్ట్రునకు వ్యక్తపఱచెను.

ప్ర:– భగవానుని విశ్వరూప మెట్టిది?

ఉ:– అత్యద్భుతమైనది.

ప్ర:– దానిని తలంచుకొనినపుడు సంజయున కెట్టి యనుభవము గలుగుచుండెను?

ఉ:– (1) మహదాశ్చర్యము (2) పరమానందము గలుగుచుండెను.

అll శ్రీకృష్ణార్జునులుండుచోట విజయము, ఐశ్వర్యము మున్నగు శుభలక్షణములు వెలయుచుండునని సంజయుడు పలుకుచున్నాడు -

78. యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః
తత్ర శ్రీర్విజయో భూతి ర్ధ్రువా నీతిర్మతిర్మమ.

టీక:– యత్ర = ఎచట, యోగేశ్వరః = యోగేశ్వరుడగు, (యోగమునకు ప్రభువగు), కృష్ణః = శ్రీకృష్ణుడు, (తిష్ఠతి = ఉండునో), యత్ర = ఎచట, ధనుర్ధరః = ధనస్సును చేబట్టిన, పార్థః = అర్జునుడు (తిష్ఠతి = ఉండునో), తత్ర = అచట, శ్రీః = లక్ష్మియు (సంపదయు), విజయః = విజయమున్ను, భూతిః = ఐశ్వర్యమున్ను, ధ్రువా = దృఢమైన, నీతిః = నీతియు, (సన్తిఇతి = కలవని) మమ = నాయొక్క, మతిః = అభిప్రాయము.

తా:– ఎచట యోగేశ్వరుడగు శ్రీకృష్ణుడున్ను ఎచట ధనుర్ధారియగు అర్జునుడున్ను ఉందురో అచట సంపదయు, విజయమున్ను ఐశ్వర్యమున్ను, దృఢమగు నీతియు ఉండునని నా యభిప్రాయము.

వ్యాఖ్య:– గీతాగ్రంథ మీశ్లోకముతో పరిసమాప్తమగుచున్నది. భగవత్సాన్నిధ్యమందు, భక్తుని సాన్నిధ్యమందు ఎట్టి శుభప్రదమైన వాతావరణమేర్పడునో ఈ శ్లోకముద్వారా వెల్వడిచేయబడినది. ఎచట యోగేశ్వరుడగు శ్రీకృష్ణభగవానుడుండునో, మఱియు నెచట ధనుర్ధారియగు అర్జునుడుండునో అచట ఐశ్వర్యము, విజయము, మున్నగునవి వెలయుచుండునవి చెప్పబడినది. కాబట్టి విజయమును, నీతిని, జ్ఞానసంపదను అభిలషించువారు భగవచ్చింతనాదులద్వారా సాక్షాత్ భగవానుని తమ హృదయమందు ప్రతిష్ఠింపజేసికొనవలెను.

భగవంతుడగు శ్రీకృష్ణుడుండుచోటే కాక, భక్తుడగు అర్జునుడుండుచోట గూడ అట్టి విజయాదులు సంభవించునని యేల చెప్పబడెననగా, అర్జునుడు సామాన్యభక్తుడు కాడు. ధనుర్ధారియగు భక్తుడు. అనగా బాహ్యశత్రువుల నే ప్రకారము గాంఢీవముచే జయించివైచెనో, అట్లే అంతఃశత్రువులనుగూడ గీతాజ్ఞానరూపధనస్సుచే ఛేదించివైచి మోహరహితుడై విలసిల్లెను (నష్టోమోహః). ఈ ప్రకారముగ అజ్ఞానము నశించిన భక్తుడు సాక్షాత్ భగవంతుడే యగుచున్నాడు. (బ్రహ్మవిద్బ్రహ్మైవభవతి). కావున ప్రకృతిని జయించినట్టియు, మాయాశత్రువును జ్ఞానఖడ్గముచే, జ్ఞానధనస్సుచే విచ్ఛిన్న మొనర్చినట్టియు భక్తుడుండుచోటగూడ భగవత్సాన్నిధ్యమందువలె విజయ సంపదాదులు వర్ధిల్లుచుండుటలో ఆశ్చర్యమేమియును లేదు. అయితే ఇచట తెలిపినది సామాన్యభక్తుని విషయముకాదనియు, అజ్ఞానమును, కామక్రోధాదులను జయించి ప్రకృతిపై విజయమును సాధించిన (ధనుర్ధరుడగు) భక్తునివిషయమే చెప్పబడినదనియు నెఱుగవలెను. కాబట్టి గీతాజ్ఞానరూప మహాధనస్సును జేబట్టినవాడును, నిష్కామ కర్మ, భక్తి జ్ఞాన ధ్యాన వైరాగ్యాదులను అస్త్రములను ధరించినవాడు నగు భక్తునిచెంత సాక్షాత్ భగవానుని

సాన్నిధ్యమందువలె విజయాదులు వర్ధిల్లుచుండునని భావము. అట్టి పరమభక్తులు, జ్ఞానులు సాక్షాత్ భగవత్స్వరూపులుగనే యుందురు. కావున దైవమందెట్టి పవిత్రీకరణశక్తి యుండునో వారియందున్ను అట్టి శక్తి యుండును. ఏలయనిన, అతిశయభక్తిస్థితియందు, లేక జ్ఞానస్థితియందు, భక్తునకును భగవంతునకును, లేక జ్ఞానికిని దేవునకును భేదముండదు. (జ్ఞానీత్వాత్మైవ మే మతమ్).

మఱియు 'ధనుర్ధరః' అనుపదము కర్మయోగమును, నిర్మల అనుష్ఠానమును గూడ సూచించుచున్నది. ప్రతివ్యక్తికిని తత్త్వబోధతో బాటు అనుష్ఠానముగూడ ఉండవలెనని ఆ పదముచే స్పష్టమగుచున్నది.

ఎచట శ్రీకృష్ణుడుండునో అచట విజయ, ఐశ్వర్యము లుండునని తెలుపుటవలన ప్రతివారును తమ గృహమందును, తమ హృదయమందును భగవంతుని స్థాపించుకొని నిరంతరము అర్చన పూజాధ్యానాదులు సలుపుచుండినచో అచ్చోట సాక్షాత్ పరమాత్మయే నివసించుచుండును. గావున అట విజయైశ్వర్యాదులు తప్పక నుండగలవు. అట్లే ఎచట భక్తి జ్ఞాన వైరాగ్యాదులు, దైవీసంపత్తి గలిగియున్న మహనీయులు, భక్తవర్యులు నివసించుచుందురో అచ్చోట ధనుర్ధారియగు అర్జునుని సన్నిధానమందువలె విజయాదులు వర్ధిల్లునని గ్రహింపవలెను. లోకమునందును ఇపుడు భగవత్పూజాదులు జరుగుచోట, మహనీయులుండు చోట శుభప్రదమైన వాతావరణము, విజయాది సల్లక్షణములు ఉండియుండుట మనము చూచుచునే యున్నాము.

ప్రతిజీవియు విజయమునే కోరునుగాని అపజయమును గాదు. సంపదనే కోరునుగాని దారిద్ర్యమునుగాదు. కాని అవి లభించుట కుపాయమేమి? ఆ యుపాయ మీ శ్లోకమున చెప్పబడినది. దానిని కార్యాన్విత మొనర్చుకొనినచో తప్పక ఆ విజయాదులు జనులకు లభించగలవు. శ్రీకృష్ణపరమాత్మను వారి హృదయమందు, వారి గేహమందు చేర్చుటయే ఆ యుపాయము. భగవంతుని భక్తిపూర్వకముగ ధ్యానించుచు భగవత్సాన్నిధ్యము ననుభవించుచుండుటయే ఆ యుపాయము. ఎచట శ్రీకృష్ణుడుండునో అచట విజయాదులుండుట తథ్యము. కాబట్టి భగవత్సాన్నిధ్యమును గలుగజేసికొనుచుండు భగవద్భక్తులకు విజయాదులు తప్పక సిద్ధించితీరును. అట్లే మహనీయులగు జ్ఞానులు, యోగిపుంగవులు మున్నగువారి సాంగత్యమందును అట్టి మహచ్ఛక్తి కలుగగలదు. కావున భగవత్సాన్నిధ్యము, సజ్జనసాంగత్యము రెండిటిని కలుగజేసికొనుచు శ్రీకృష్ణార్జునుల (నరనారాయణుల) యిరువురి సాంగత్యశ్రీని అనుభవించుచుండవలెను.

మఱియు ఎచ్చోట (ఏ పక్షమున) శ్రీకృష్ణుడు, అర్జునుడు ఉండునో, ధర్మమేపక్షమున నుండునో అచట (ఆ పక్షమున) విజయము తప్పక కలుగునను వాక్యమును చెప్పుటద్వారా సంజయుడు పాండవ పక్షముననే విజయము కలుగునను భావమును ధృతరాష్ట్రునకు ధ్వనింపజేసెను. (ఆ వాక్యమును వినియైనను ధృతరాష్ట్రుడు సంధిచేసికొని యుద్ధమును మాన్పించుట శ్రేయస్కరమని యాతనికి గూఢముగ బోధింపబడినది).

ఈ శ్లోకమందలి 'ధ్రువానీతిః' అను పదమునకు "నీతి మున్నగునవి తప్పక కలుగును" అని కొందఱు అర్థము చెప్పిరి.

గీతయొక్క అంతమున సంజయునిచే బోధింపబడిన ఈ "యత్రయోగేశ్వరః కృష్ణో...." - అను మహత్తరమగు శ్లోకమును భక్తులు మఱల మఱల జ్ఞాపకము చేసికొనుచు భగవత్సాన్నిధ్యమును తమ హృదయమున నిరంతరము కలుగజేసికొనుచు భగవదనుగ్రహముచే జీవితములను ఆనందమయములుగ నొనర్చుకొందురుగాక! మఱియు భగవానునిచే కరుణతో బోధింపబడిన ఈ గీతాశాస్త్రము నంతను చక్కగ

పఠించి, అనుష్ఠించి, ఆత్మానుభూతిని బడసి జన్మరాహిత్యరూప నిత్యానందపదవి నొందుటద్వారా మానవ జీవితమును కృతార్థము చేసికొందురు గాక!!!

హరిః ఓం తత్ సత్
ఇతి శ్రీమన్మహాభారతే శతసాహస్రికాయాం సంహితాయాం వైయాసిక్యాం
శ్రీమద్భీష్మపర్వణి శ్రీ మద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం
యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే మోక్షసన్న్యాసయోగోనామ
అష్టాదశోఽధ్యాయః
ఇది శ్రీవ్యాసముని విరచితమైనదియు, నూఱువేల శ్లోకములుగలదియును, ఛందోబద్ధ
మైనదియు నగు శ్రీమహాభారతమున భీష్మపర్వమునగల ఉపనిషత్ప్రతిపాదకమును,
బ్రహ్మవిద్యయు, యోగశాస్త్రమును, శ్రీకృష్ణార్జునసంవాదమును నగు
శ్రీ భగవద్గీతలందు మోక్షసన్న్యాసయోగమను
పదునెనిమిదవ అధ్యాయము
సంపూర్ణము
హరిః ఓమ్ తత్ సత్
శ్రీ పరబ్రహ్మార్పణమస్తు
ఓమ్.



శ్రీ భగవద్గీత

శ్లోకానుక్రమణిక

ఓం తత్సత్